www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 30-10-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 211 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం; తిథి: అష్టమి ఉ.10.07 తదుపరి నవమి; నక్షత్రం: శ్రవణం రా.6.33 తదుపరి ధనిష్ఠ వర్జ్యం: రా.10.36-12.13; దుర్ముహూర్తం: ఉ.10.04-10.50, మ.2.38-3.24; అమృతఘడియలు: ఉ.7.41-9.21; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 6.16; సూర్యాస్తమయం: 5.40 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

రఫేల్‌లో రాష్ట్రపతి

2

- యుద్ధవిమానంలో ప్రయాణించిన ద్రౌపది ముర్ము
- 15వేల అడుగుల ఎత్తు, గంటకు 700 కి.మీ. వేగం
- మరపురాని అనుభూతి అన్న త్రివిధ దళాల అధిపతి
- రెండు వేర్వేరు యుద్ధవిమానాల్లో ప్రయాణించిన తొలి రాష్ట్రపతిగా రికార్డు



రాష్ట్రపతి ముర్ముతో రఫేల్ తొలి మహిళా పైలట్ శివాంగి





చెరువును తలపిస్తున్న హనుమకొండ చౌరస్తా; నల్లగొండ జిల్లా కొమ్మేపల్లి గురుకుల పాఠశాల నుంచి విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న అధికారులు

మొంథా మోత

వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉమ్మడి జిల్లాల్లో దంచికొట్టిన వాన

- పొంగిన వాగులు, వంకలు.. జలదిగ్బంధంలో మారుమూల గ్రామాలు
- వర్షాలకు ఇద్దరి మృతి.. వరదలో వ్యాన్ డ్రైవర్ గల్లంతు
- పంటనష్టంతో అన్నదాతల గుండె చెరువు.. ఒరిగిన వరి.. తడిసిన పత్తి
- పలు రైళ్ల రద్దు.. కొన్ని దారిమళ్లింపు.. 25 స్టేషన్లలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు
- అవసరమైతే తప్ప ప్రయాణాలొద్దు.. దక్షిణమధ్య రైల్వే అధికారుల సూచన
- శంషాబాద్‌లో విమానాల రాకపోకలకు అంతరాయం
- వరంగల్ జిల్లా కల్లెడలో అత్యధికంగా 34 సెంటీమీటర్ల వర్షపాతం
- శ్రీశైలం-హైదరాబాద్ హైవేలో కోతకు గురైన వంతెన.. రాకపోకలు బంద్
- అధికారులు అప్రమత్తంగా ఉండాలి.. రైతాంగం నష్టపోకుండా చూడాలి
- చెరువులు, కుంటల్లో నీటిమట్టాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తుండాలి
- అన్నిశాఖలు సమన్వయంతో పనిచేయాలి.. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు
- బలహీనపడిన 'మొంథా'.. తెలంగాణ మీదుగా ఒడిసా, ఛత్తీస్‌గఢ్‌లోకి

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

మొంథా తుపాను ప్రభావంతో బుధవారం హైదరాబాద్ సహా వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉమ్మడి జిల్లాల్లో భారీ వర్షాలు పడ్డాయి. మరికొన్ని జిల్లాల్లో కూడా వానలు కురిశాయి. ఫలితంగా జనజీవనం స్తంభించిపోయింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వరి, పత్తి తదితర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పొలాల్లో పైరు నేల కొరిగింది. కోతకోసి రోడ్లమీద, కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసిముద్దయింది. చేలల్లో మొక్కల మీదే పత్తి తడిసి.. నల్లబారుతోంది. వరంగల్ జిల్లా కల్లెడలో ఎనిమిదన్నర గంటల వ్యవధిలో 34సెం.మీ వర్షపాతం నమోదైంది. యాదాద్రి జిల్లా మోత్కూరు

మిగతా 13వ పేజీలో...



ఖమ్మం జిల్లా కల్లూరులో నీటిపాలైన వరి పంట

అన్నదాతకు దెబ్బ మీద దెబ్బ

- ఖరీఫ్ సీజన్‌లో అతివృష్టితో ఆగమాగం
- సాధారణం కంటే 34% అధిక వర్షపాతం
- చేతికొచ్చిన పంటలు నీటి పాలవుతున్న పరిస్థితి
- ఓవైపు పంటల కొనుగోళ్లు.. మరోవైపు తేమ సమస్య

12

మంత్రివర్గంలోకి అజారుద్దీన్



సీఎం రేవంత్‌ను కలిసిన అజారుద్దీన్, చాముండేశ్వర్‌నాథ్. చిత్రంలో మంత్రులు వివేక్, తుమ్మల

- రేపు గవర్నర్ సమక్షంలో ప్రమాణ స్వీకారం
- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ఎఫెక్ట్!
- మైనారిటీ సంక్షేమం, మరో శాఖ అప్పగించే అవకాశం
- మరో రెండు మంత్రి పదవులు డిసెంబర్లో భర్తీ!
- ప్రస్తుతం ఏ చట్టసభలోనూ సభ్యుడు కాని అజారుద్దీన్
- 6 నెలల్లో అసెంబ్లీ లేదా మండలి సభ్యత్వం తప్పనిసరి
- సీఎంను కలిసిన పలు మైనారిటీ సంఘాల నేతలు
- ఉప ఎన్నికలో కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్నట్టు ప్రకటన

హైదరాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు అజారుద్దీన్‌కు కలిసి వచ్చింది. అనుకున్న దానికంటే ముందుగానే ఆయనను మంత్రి పదవి వరించింది. రాజ్‌భవన్‌లో శుక్రవారం ఉదయం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అజారుద్దీన్‌తో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. ఈ కార్యక్రమంలో

మిగతా 14వ పేజీలో...

జూబ్లీహిల్స్.. భిన్నంగా ఓటర్ పల్స్!

14

- ఒక్కో డివిజన్‌లో ఒక్కో పార్టీకి ఆదరణ
- ఎన్నికలను బట్టి మారుతున్న ఆధిపత్యం
- ఉప ఎన్నికలో ఎవరి మొగ్గు ఏ పార్టీకో?

డ్రగ్స్‌పై బ్రెజిల్ యుద్ధం!

- మాదకద్రవ్య ముఠాపై పోలీసు ఆపరేషన్
- 132 మంది ముఠా సభ్యులు హతం
- డ్రగ్స్ ముఠా జరిపిన డ్రోన్ల దాడిలో నలుగురు పోలీసుల మృతి

2



త్వరలో ఇండియా అధికారిక కాలర్ ఐడీ

- కాలర్ అసలు పేరును మొబైల్ స్క్రీన్‌పై చూపించే సీఎన్‌ఏపీ
- వచ్చే ఏడాది మార్చి 31 నాటికి దేశ వ్యాప్తంగా అమలులోకి!

2



బీఆర్ఎస్ గెలిస్తే మూడేళ్లు ఆగక్కర్లేదు

- జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపిస్తే ఏమైనా జరగొచ్చు
- రాష్ట్రంలో ఏ మార్పులైనా రావొచ్చు
- బీసీలను మోసగించిన కాంగ్రెస్‌కు ఉప ఎన్నికల్లో బుద్ధి చెప్పండి
- కాంగ్రెస్ డబ్బులిస్తే తీసుకోండి.. ఓటు మాత్రం బీఆర్ఎస్‌కే వేయండి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

14



హైటెక్‌సిటీలో మెక్‌డొనాల్డ్స్ గ్లోబల్ ఆఫీస్

- అమెరికా వెలుపల ఇదే అతిపెద్ద కార్యాలయం
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- ఇవి బ్యాక్ ఆఫీసులు కావు.. ఆవిష్కరణలకు నాడులు
- జీసీసీల రాజధానిగా హైదరాబాద్: డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ఫాస్ట్ ఫుడ్ దిగ్గజం 'మెక్ డొనాల్డ్స్' గ్లోబల్ ఆఫీసు హైదరాబాద్‌లో ఏర్పాటైంది! హైటెక్ సిటీలో 1.56 లక్షల చదరపుటడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ కార్యాలయాన్ని.. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి ప్రారంభించారు. అమెరికాకు వెలుపల తమ అతి పెద్ద కార్యాలయాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు

మిగతా 10వ పేజీలో...

వైద్యవిద్యలో పీజీ చేసినా.. 50% మంది

సర్జరీ చేయలేరు

- శస్త్రచికిత్స చేయాలంటే తమపై తమకే నమ్మకం లేదంటున్న డాక్టర్లు
- కౌన్సెలింగ్ సౌకర్యాలు లేవన్న 54% మంది
- 70 శాతం పీజీలకు నిర్దిష్ట పనివేళలు లేవు
- 62 శాతం మందికి స్టైపెండ్ ఆలస్యం
- కొత్త వైద్య కాలేజీల్లో మౌలిక వసతుల లేమి
- 'ఫైమా- ఆర్ఎంఎస్' సర్వే సంచలన నివేదిక
- దేశవ్యాప్తంగా 2వేల మందికి పైగా మెడికోలు, డాక్టర్లతో సర్వే.. ఎన్ఎంసీకి నివేదిక
- తక్షణమే సంస్కరణలు చేపట్టాలని వినతి



హైదరాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు ఎంబీబీఎస్ చేసిన డాక్టర్లు సైతం పలు రకాల సర్జరీలు చేయగలిగేవారు. ఇప్పుడు పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసినా కత్తి పట్టుకునేందుకు యువ వైద్యుల చేతులు వణుకుతున్నాయని.. గైనకాలజీ చేసినా సిజేరియన్ చేయలేని దుస్థితిలో చాలా మంది ఉంటున్నారని.. తాజా సర్వేలో వెల్లడైంది. పీజీ పూర్తి చేసిన వైద్యుల్లో 50.5 శాతం మంది.. సొంతంగా సర్జరీ చేసే విషయంలో తమపై తమకే నమ్మకం కలగట్లేదని ఈ సర్వేలో

మిగతా 10వ పేజీలో...



విదేశీ విద్యకు భరోసా

- రూ.303 కోట్ల ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయండి
- ఆర్థిక శాఖ అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి ఆదేశాలు

హైదరాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనారిటీ విద్యార్థుల ఓవర్సీస్ స్కాలర్‌షిప్ బకాయిలు రూ.303 కోట్లను వెంటనే విడుదల చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బుధవారం ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు. 2022 నుంచి పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌ల మొత్తాన్ని ఒకేసారి క్లియర్ చేయాలని

మిగతా 12వ పేజీలో...

అప్పుల్లో కూరుకున్న డిస్కంలకు

లక్ష కోట్ల ప్యాకేజీ?

- బెయిల్‌ఔట్ ప్రణాళిక రూపొందిస్తున్న కేంద్రం
- ఈ సాయాన్ని పొందాలంటే విద్యుత్తు సంస్థలను ప్రైవేటుపరం చేయాలి
- లేదంటే ఆ డిస్కంలను స్టాక్ ఎక్స్ఛేంజీలో నమోదు చేయాలి

న్యూఢిల్లీ, అక్టోబరు 29: రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నడుస్తూ భారీ అప్పుల్లో కూరుకుపోయిన విద్యుత్తు పంపిణీ సంస్థలకు ఒక ట్రిలియన్ రూపాయల (రూ.లక్ష కోట్లు) మేర బెయిల్‌ఔట్ ఇచ్చే అంశాన్ని కేంద్ర సర్కారు తీవ్రంగా పరిశీలిస్తోంది. అయితే బెయిల్‌ఔట్ కింద నిధుల సహాయాన్ని పొందాలంటే సదరు డిస్కమ్‌లను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటు పరం చేసి.. నిర్వహణ తాలూకు నియంత్రణనూ బదిలీ చేయాల్సి ఉంటుంది. ఒకవేళ ప్రభుత్వమే నిర్వహించదలిస్తే తప్పనిసరిగా వాటిని స్టాక్‌ఎక్స్ఛేంజీలో నమోదు చేయాల్సి ఉంటుంది. ఇదంతా కేంద్ర విద్యుత్తు శాఖ రూపొందించిన ఓ ప్రణాళిక పత్రం ద్వారా బయటపడింది. ప్రభుత్వాల ఆధ్వర్యంలో ముక్కుతూమూల్గుతూ నడుస్తున్న డిస్కంలను దారిలో పెట్టేందుకు ప్రధాని మోదీ చేపట్టిన ప్రణాళికగా దీన్ని చెబుతున్నారు. అయితే బెయిల్‌ఔట్‌కు సంబంధించి విద్యుత్తు, ఆర్థిక శాఖల అధికారుల మధ్య ఇంకా చర్చలు జరుగుతున్నాయని.. దీనిపై తుది ప్రకటన ఫిబ్రవరిలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో కేంద్రం వివరించే అవకాశాలున్నాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.





3,752 ఈవీ చార్జింగ్ కేంద్రాలు

- దక్షిణ డిస్కమ్ పరిధిలో ఏర్పాటు!
- గ్రేటర్ హైదరాబాద్ సహా పలు చోట్ల అనువైన ప్రాంతాల్ని గుర్తించిన అధికార్లు
- నాలుగు కేటగిరీలుగా విభజన

హైదరాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం మరింత పెరగాలంటే దానికి తగ్గట్లుగా చార్జింగ్ సౌకర్యాలు పెంచాలని డిస్కమ్‌లు నిర్ణయించాయి. ఈమేరకు రాష్ట్రవ్యాప్తంగా జాతీయ హైవేలతో పాటు రాష్ట్ర హైవేలపై చార్జింగ్ కేంద్రాలకు అనువైన ప్రాంతాలు అధికారులు గుర్తిస్తున్నారు. దక్షిణ డిస్కమ్ (టీజీఎస్పీడీసీఎల్) పరిధిలో గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు వివిధ చోట్ల ఈవీ

మిగతా 12వ పేజీలో...

వసతులు లేవు..

బోగస్ విద్యార్థులు

- ఫీజు రీయింబర్స్‌మెంట్ దుర్వినియోగంపై ఫిర్యాదులతో రాష్ట్రవ్యాప్తంగా కొన్ని కళాశాలల్లో తనిఖీలు
- ఆరోపణలు నిజమని తేలడంతో 1900 కాలేజీల్లో తనిఖీలకు ఆదేశం
- నేడు ఇంజినీరింగ్ కాలేజీలతో మొదలు.. ఇది ప్రభుత్వ కక్ష సాధింపే..
- తనిఖీలకు సహకరించం: కళాశాలల యాజమాన్యాలు

హైదరాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని వృత్తివిద్యా కాలేజీల్లో విజిలెన్స్ తనిఖీలకు ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను కాలేజీలు దుర్వినియోగం చేస్తున్నాయంటూ గతంలో వచ్చిన ఫిర్యాదులపై ఇటీవలే ప్రభుత్వం కొన్ని కాలేజీల్లో విచారణ జరిపింది. సరైన వసతులు లేకపోవడం, ప్రభుత్వ నిబంధనలు పాటించకపోవడం, కంప్యూటర్ ల్యాబ్‌లు, సైన్స్ ల్యాబ్‌లు లేకపోవడం, బోగస్ విద్యార్థులు, అర్హతలేని అధ్యాపకులు ఉన్నట్లు తమ విచారణలో తేలిందని ప్రభుత్వం తెలిపింది. దీంతో, ఈ అంశాన్ని సమగ్రంగా విచారించాలని తాము నిర్ణయించామని.. విజిలెన్స్ డైరెక్టర్ జనరల్ నేతృత్వంలో విచారణకు ఆదేశిస్తున్నామని.. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు బుధవారం విడుదల చేసిన ఆదేశాల్లో పేర్కొన్నారు. గతంలో విడుదల చేసిన నిధులు సైతం పక్కదారి పట్టాయని, పేద విద్యార్థులకు అందాల్సిన నిధులను ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు దుర్వినియోగం చేశాయని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాలతో డీఎస్పీ స్థాయి పోలీసు అధికారి నేతృత్వంలో విజిలెన్స్, పోలీసు, సీఐడీ, ఇంటెలిజెన్స్ వర్గాలతో పాటు రీయింబర్స్‌మెంట్ పథకం అమలులో నోడల్ ఏజెన్సీగా ఉన్న

మిగతా 3వ పేజీలో...

త్వరలో ఇండియా అధికారిక కాలర్ ఐడీ

- కాలర్ అసలు పేరును మొబైల్ స్ర్కీన్‌పై చూపించే సీఎన్‌ఏపీ
- వచ్చే ఏడాది మార్చి 31 నాటికి దేశ వ్యాప్తంగా అమలులోకి !



న్యూఢిల్లీ, అక్టోబరు 29: గుర్తు తెలియని నంబర్ల నుంచి వచ్చే ఫోన్ కాల్స్ విషయంలో అప్రమత్తంగా ఉండేందుకు చాలా మంది తమ మొబైల్ ఫోనుల్లో ట్రూకాలర్ వంటి థర్డ్ పార్టీ అప్లికేషన్లు వాడుతుంటారు. ఈ థర్డ్ పార్టీ యాప్‌ల అవసరం లేకుండా మొబైల్ ఫోన్ వినియోగదారులు ఆయా సేవలు పొందేందుకు వీలుగా.. కాలింగ్ నేమ్ ప్రజంటేషన్(సీఎన్‌ఏపీ) పేరిట భారతదేశ అధికారిక కాలర్ ఐడీ అందుబాటులోకి రాబోతుంది. మొబైల్‌కు ఇన్‌కమింగ్ కాల్ వచ్చినప్పుడు.. సదరు నంబరు ఎవరి పేరు మీద రిజిస్టర్ అయి ఉందో ఆ పేరు మొబైల్ స్ర్కీన్‌పై కనిపించనుంది. సీఎన్‌ఏపీ సేవలు తమకు వద్దు అనుకునే వారు తమ టెలికామ్ సర్వీస్ ప్రొవైడర్‌ను సంప్రదించి వాటిని నిలిపివేసుకోవచ్చు. ఈ సీఎన్‌ఏపీ అమలు కోసం డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలీకమ్యూనికేషన్స్ (డీఓటీ) చేసిన ప్రతిపాదనకు ట్రాయ్ ఇప్పటికే ఆమోదం తెలిపింది. ట్రాయ్ ఆమోదానికి వెళ్లే ముందు.. దేశంలోని ఎంపిక చేసిన నగరాల్లో సీఎన్‌ఏపీని డీఓటీ పరీక్షించింది. పలు సాంకేతిక సమస్యలను గుర్తించి వాటి పరిష్కారంపై దృష్టిపెట్టింది. కాగా, 2026 మార్చి 31 నాటికి దేశ వ్యాప్తంగా సీఎన్‌ఏపీ సర్వీసును వినియోగదారులకు అందించాలని జియో, ఎయిర్‌టెల్, వోడాఫోన్ తదితర టెలికామ్ ఆపరేటర్లను డీఓటీ ఇప్పటికే ఆదేశించింది. వోడాఫోన్ ఐడియా, జియో సంస్థలు హరియాణాలో సీఎన్‌ఏపీ సేవలను ప్రయోగాత్మకంగా అందిస్తున్నాయి.

నేనొక్కడినే ఎందుకు తిట్లు తినాలి!

- రోడ్లపై క్యూఆర్ కోడ్‌ల ఏర్పాటు
- స్కాన్ చేస్తే కాంట్రాక్టర్ల వివరాలు
- నేరుగా వారినే ప్రశ్నించొచ్చు: గడ్కరీ



న్యూఢిల్లీ, అక్టోబరు 29: మౌలిక సదుపాయాల అభివృద్ధిలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంచేందుకు దేశవ్యాప్తంగా ప్రధాన రహదారులపై క్యూఆర్ కోడ్ స్కానర్లను ఏర్పాటు చేయాలని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ ప్రతిపాదించారు. ప్రజలు ఆ క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ఆ రోడ్డుకు సంబంధించిన పూర్తి వివరాలు పొందగలరన్నారు. ఆ ప్రాజెక్టు కోసం పనిచేసిన కాంట్రాక్టర్లు, సంబంధిత అధికారుల పేర్లు-ఫోన్ నంబర్లు, ఆ పనికి మంజూరు చేసిన బడ్జెట్, గడువు, నిర్వహణ వంటి కీలక విషయాలు తెలుసుకోవచ్చన్నారు. 'స్మార్ట్ రోడ్ల భవిష్యత్తు, భద్రత' అనే అంశంపై బుధవారం ఢిల్లీలో జరిగిన జరిగిన సమావేశంలో కేంద్ర మంత్రి మాట్లాడారు. రోడ్లు బాగా లేకుంటే తననే అందరూ నిందిస్తారని.. మొత్తం వ్యవస్థ చేసిన తప్పులకు తానొక్కడినే ఎందుకు తిట్లు తినాలని సరదాగా అన్నారు. అందుకే రోడ్లకు సంబంధించిన సమాచారాన్ని బహిరంగంగా ప్రకటించాలని నిర్ణయించుకున్నానని.. అప్పుడే అవినీతికి పాల్పడే వారికి నేరుగా ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. 'రోడ్లపై క్యూఆర్ కోడ్‌ల ఏర్పాటుతో దాన్ని మంజూరు చేసిన మంత్రి ఎవరు? నిర్మాణ కాంట్రాక్టర్లు, కార్యదర్శులు, ఇంజనీర్లు వారి ఫోన్ నంబర్లు, చిరునామా, ఫొటోలతో సహా ప్రజలు, మీడియాకు అందుబాటులో ఉంటాయి. తద్వారా సదరు రోడ్డు దెబ్బతిన్న, గుంతలు ఏర్పడిన నేరుగా వారికే ఫోన్ చేసి ప్రశ్నిస్తారు' అని గడ్కరీ వివరించారు.

లోకం తీరు



జనవరిలో 'స్కైరూట్' రాకెట్ ప్రయోగం!

- తొలి ప్రైవేటు వాణిజ్య రాకెట్ ప్రయోగానికి రెడీ

న్యూఢిల్లీ, అక్టోబరు 29: భారత్‌లో త్వరలోనే తొలి ప్రైవేటు వాణిజ్య రాకెట్ అంతరిక్షంలోకి ఎగరనుంది. హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ ఏరోస్పేస్ 2026 జనవరి నాటికి తన తొలి ప్రైవేట్ వాణిజ్య రాకెట్ ప్రయోగానికి సిద్ధమవుతోంది. ఈ ప్రయోగం విజయవంతమైతే దేశ అంతరిక్ష రంగంలో కీలక మైలురాయిగా నిలవనుంది. ఇస్రోలో పనిచేసిన మాజీ శాస్త్రవేత్తలు స్కైరూట్ ఏరోస్పేస్ అనే స్టార్టప్‌ను స్థాపించారు. ఈ సంస్థ మరో మూడు నెలల్లో తన తొలి పూర్తిస్థాయి వాణిజ్య ఉపగ్రహ మిషన్ ప్రయోగాన్ని చేపట్టాలని భావిస్తోంది. 2022లో సబ్ ఆర్బిటల్ వాహనం విక్రమ్-ఎస్‌ను పరీక్షించడం ద్వారా ఈ ఘనత సాధించిన తొలి ప్రైవేటు సంస్థగా స్కైరూట్ రికార్డు సృష్టించింది. ఇప్పటి వరకు భారత్‌లో ఇస్రో మాత్రమే ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టడానికి రాకెట్ ప్రయోగాలను చేపట్టింది. చిన్న ఉపగ్రహాల ప్రయోగాలకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ ఉండడంతో స్కైరూట్‌కు మంచి అవకాశాలు ఉంటాయని అంతరిక్ష రంగ నిపుణులు భావిస్తున్నారు.

ఇజ్రాయెల్‌తో వాయు.. బంధం!

- ఆరు ట్యాంకర్ విమానాల కోసం రూ.8వేల కోట్ల డీల్

న్యూఢిల్లీ, అక్టోబరు 29: వాయుసేనను మరింత శక్తివంతం చేస్తూ ఇజ్రాయెల్ నుంచి ఆరు ట్యాంకర్ విమానాలను కొనుగోలు చేయాలని రక్షణశాఖ నిర్ణయించినట్టు తెలిసింది. ఇజ్రాయెల్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇండస్ట్రీస్‌తో(ఐఏఐ) ఈ మేరకు త్వరలోనే రూ.8వేల కోట్ల విలువైన ఒప్పందం చేసుకోనున్నట్టు సమాచారం. ఫైటర్ జెట్లకు అవసరమైన ఇంధనాన్ని గగనతలంలోనే ట్యాంకర్ విమానాలు అందించగలవు. రఫేల్, సుఖోయ్-30 ఎంకేఐ వంటి ఫైటర్ జెట్లను ముఖ్యమైన ఆపరేషన్లకు వినియోగిస్తారు. చాలాసందర్భాల్లో అవి తమ అంతర్గత ఇంధన సామర్థ్యాన్ని దాటి కూడా ప్రయాణించాల్సి వస్తుంది. ఇలాంటి సమయంలో ట్యాంకర్ విమానాల అవసరం ఎంతో ఉంటుంది. ప్రస్తుతం వాయుసేన వద్ద రష్యాకు చెందిన 6 ట్యాంకర్ విమానాలు (ఇల్యూషిన్ 11-78 ఎమ్‌కేఐ) ఉన్నాయి. ఒకవేళ ఒప్పందం ఖరారైతే, సెకండ్ హ్యాండ్ బోయింగ్ 767 (కమర్షియల్) విమానాలను ట్యాంకర్ విమానాలుగా మార్చి మన వాయుసేనకు ఇజ్రాయెల్ సంస్థ అందిస్తుంది. తయారీలో 30 శాతం మేర మేడ్ ఇన్ ఇండియా పద్ధతిని అనుసరించనుంది.

భారత్‌కు కీలుబొమ్మగా కాబూల్: పాక్ మంత్రి

న్యూఢిల్లీ, అక్టోబరు 29: భారత్‌కు కాబూల్ ఒక కీలుబొమ్మగా మారిందంటూ పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ఆరోపించారు. ఇస్లామాబాద్‌పై ఎలాంటి దాడి జరిగినా దానికి 50 రెట్లు బలమైన ప్రతిస్పందన ఉంటుందని ప్రగల్భాలు పలికారు. భారత్ స్వరానికి అనుగుణంగా కాబూల్ నాయకత్వం ఆడుతోందని విమర్శించారు. కాబూల్‌లోని ప్రజలు తీగలు లాగుతూ తోలుబొమ్మలాటను నిర్వహిస్తున్నారని, వారిని ఢిల్లీ నియంత్రిస్తోందన్నారు. పశ్చిమ సరిహద్దుల్లో తన ఓటమిని కప్పిపుచ్చుకోవడానికి భారత్ అఫ్ఘానిస్థాన్‌ను వాడుకుంటోందని ఖవాజా ఆరోపించారు. పాక్, అఫ్ఘాన్ మధ్య చర్చలు ఒక ఒప్పందం కుదిరే సమయానికి కొందరి జోక్యం కారణంగా కాబూల్ నాలుగైదు సార్లు వెనకడుగు వేయడంతో విఫలమయ్యాయని తెలిపారు. అఫ్ఘానిస్థాన్ ఇస్లామాబాద్ వైపు కన్నెత్తి చూసినా కూడా వారి కళ్లు పీకేస్తామని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. అఫ్ఘాన్‌తో చర్చలు విఫలమైతే అది ఆ దేశంతో పూర్తిస్థాయి యుద్ధానికి దారితీసే అవకాశం ఉందని ఖవాజా పేర్కొన్నారు.

సరిహద్దు నిర్వహణపై భారత్- చైనా చర్చలు

న్యూఢిల్లీ, అక్టోబరు 29: సరిహద్దు నిర్వహణపై భారత్, చైనా మధ్య తాజాగా ఉన్నత స్థాయి చర్చలు జరిగాయని చైనా రక్షణ శాఖ బుధవారం ప్రకటించింది. ఎల్‌ఏసీ వెంబడి పశ్చిమ సెక్టార్‌లో ఉద్రిక్తతలను నియంత్రించే లక్ష్యంతో చేపట్టిన ఈ చర్చలు సానుకూల వాతావరణంలో సమగ్రంగా నిర్వహించినట్లు తెలిపింది. సరిహద్దుల్లో శాంతిభద్రతలను, స్థిరత్వాన్ని కాపాడుకోవడంపై ఇరు పక్షాలు అభిప్రాయాలను పంచుకున్నాయని వెల్లడించింది. సైనిక, దౌత్య మార్గాల ద్వారా చర్చలు కొనసాగించడానికి అంగీకరించాయని పేర్కొంది. ఇదిలా ఉండగా, దాదాపు ఐదేళ్ల తర్వాత భారత్, చైనా మధ్య ఇటీవల నేరుగా విమాన సర్వీసులు ప్రారంభమయ్యాయి.

రూ.కోటితో సౌకర్యవంతమైన రిటైర్మెంట్ లైఫ్

- పదిమందిలో ఏడుగురి మనోగతం

న్యూఢిల్లీ, అక్టోబరు 29: రిటైర్‌మెంట్ జీవితం సౌకర్యవంతంగా ఉండాలంటే ఉద్యోగ విరమణ వేళ పొందే ఆర్థిక ప్రయోజనాలు కనీసం రూ.కోటి వరకు ఉండాలని పలువురు కోరుకుంటున్నారని యాన్యువల్ ఇండియా రిటైర్‌మెంట్ ఇండెక్స్ అధ్యయన నివేదిక వెల్లడించింది. సర్వేలో పాల్గొన్న ప్రతి పదిమందిలో ఏడుగురు ఇదేవిధంగా స్పందించారని పేర్కొంది. చక్కటి ఫిట్‌నెస్ అలవాట్లు, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు, అధిక ప్రీమియంలతో బీమా పాలసీల స్వీకరణ వంటి వాటి వల్ల జీవన వ్యయ సూచిక క్రమేణా పెరిగిపోయింది. ఇది 2022లో 44 పాయింట్లు ఉంటే 2025లో 48కి చేరింది.

అసోం కాంగ్రెస్ సభలో బంగ్లా జాతీయ గీతం

న్యూఢిల్లీ, అక్టోబరు 29: అసోంలో కాంగ్రెస్ నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆ పార్టీ నేత బంగ్లాదేశ్ జాతీయగీతాన్ని పాడడంతో పెద్ద రాజకీయ వివాదం చెలరేగింది. 2026 అసోం ఎన్నికలకు ముందు ఈ ఘటన బీజేపీ, కాంగ్రెస్ మధ్య తీవ్రస్థాయి ఆరోపణలకు దారి తీసింది. శ్రీ భూమి జిల్లాలో జరిగిన కాంగ్రెస్ సేవాదళ్ సమావేశంలో పార్టీ నేత విధు భూషణ్ దాస్ తన ప్రసంగాన్ని ప్రారంభిస్తూ 'అమార్ సోనార్ బంగ్లా' అనే గీతాన్ని ఆలపించారు. బంగ్లాదేశ్ సరిహద్దు రాష్ట్రమైన అసోంలో, బెంగాలీలు ఎక్కువగా ఉండే శ్రీభూమి జిల్లా వంటి సున్నితమైన ప్రాంతంలో ఈ వివాదం జరగడం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ఇది చొరబాటుదారుల పట్ల కాంగ్రెస్‌కు ఉన్న సానుభూతిని తెలియజేస్తోందని బీజేపీ విమర్శించింది. అయితే, తమ పార్టీ నేత పాడింది ఠాగూర్ రచించిన గేయమేనని, దానిని బంగ్లా జాతీయగీతంతో ముడిపెట్టి బీజేపీ రాద్ధాంతం చేస్తోందని కాంగ్రెస్ ఎదురుదాడికి దిగింది.

మహారాష్ట్రలో మంటల్లో చిక్కుకున్న బస్సు

ముంబై, అక్టోబరు 29: మహారాష్ట్రలో ఓ ప్రైవేటు లగ్జరీ బస్సు మంటల్లో చిక్కుకుంది. ముంబై నుంచి జాల్నాకు 12 మంది ప్రయాణికులతో వెళ్తున్న ట్రావెల్స్ బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన డ్రైవర్, కండక్టర్ వెంటనే అప్రమత్తమై ప్రయాణికులందరినీ సమయానికి బస్సు నుంచి దించివేయడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటన నాగ్‌పూర్ మార్గంలోని సమృద్ధి హైవేపై బుధవారం తెల్లవారుజామున 3 గంటలకు జరిగింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే బస్సు పూర్తిగా కాలిపోయింది.

భారత్‌తో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుంటున్నాం

మోదీ చాలా బాగుంటారు.. కానీ మొండి ఘటం



- ఏపీఈసీ సదస్సులో ట్రంప్ వ్యాఖ్యలు
- భారత్‌కు చమురు తెస్తూ వెనక్కి మళ్లిన రష్యా ట్యాంకర్ నౌక

టోక్యో/సియోల్, అక్టోబరు 29: భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోబోతున్నామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తెలిపారు. దక్షిణ కొరియాలోని గియోంగ్జులో జరుగుతున్న ఆసియా-పసిఫిక్ ఆర్థిక భాగస్వామ్య(ఏపీఈసీ) సదస్సులో ఆయన ఈ విషయం చెప్పారు. వాణిజ్య ఒప్పందంపై భారత్-అమెరికా మధ్య చర్చలు ఓ కొలిక్కి వచ్చినట్టేననే వార్తల నేపథ్యంలో ట్రంప్ ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. అంతేకాదు ట్రంప్ డిమాండ్ మేరకు రష్యా నుంచి చమురు దిగుమతులను భారత్ తగ్గించుకుంటుండటం గమనార్హం. ట్రంప్ ఆంక్షలు విధించిన రష్యా చమురు కంపెనీల నుంచి కొనుగోళ్లు నిలిపివేశామని ఇప్పటికే రిలయన్స్, ఐఓసీ వర్గాలు వెల్లడించాయి. తాజాగా రష్యా నుంచి భారీగా చమురుతో భారత్‌వైపు వస్తున్న ది ఫ్యూరియా అనే ట్యాంకర్ నౌక బాల్టిక్ సముద్ర ప్రాంతంలో వెనక్కి మళ్లింది. అమెరికాతో వాణిజ్య ఒప్పందానికి రంగం సిద్ధమైందనే దానికి ఇది సంకేతమని అధికార వర్గాలు చెబుతున్నాయి.

భారీగా చమురు నింపుకొని వస్తున్నా..

ఈ ట్యాంకర్ నౌక అక్టోబరు 20న రష్యాలోని ప్రైమోర్స్క్ పోర్టు నుంచి సుమారు 7.3 లక్షల బ్యారెళ్ల చమురుతో బయలుదేరిందని, కానీ మంగళవారం యూటర్న్ తీసుకుందని సముద్ర రవాణాను పర్యవేక్షించే కెప్లర్ సంస్థ తెలిపింది. కొంతదూరం వెనక్కి వెళ్లాక సముద్రంలోనే నిలిచిపోయిందని వెల్లడించింది. భారత్‌లోని హెచ్‌పీసీఎల్-మిట్టల్ ఎనర్జీ సంస్థల ఉమ్మడి కంపెనీ హెచ్‌ఎంఈఎల్‌కు ఈ చమురు సరఫరా కావాల్సి ఉందని సమాచారం. అయితే రష్యా నుంచి చమురు కొనుగోళ్లను నిలిపివేస్తున్నట్టు హెచ్‌ఎంఈఎల్ బుధవారం ప్రకటించింది.

మోదీలాంటి తండ్రి ఉంటే బాగుంటుంది

ప్రధాని మోదీపై ట్రంప్ మరోసారి ప్రశంసలు కురిపించారు. "మోదీ చాలా బాగుంటారు. ఆయన లాంటి తండ్రి ఉంటే బాగుంటుంది అనిపిస్తుంది. ఆయన ఒక కిల్లర్. మహా మొండి ఘటం" అని పేర్కొన్నారు. మోదీతో తనకు మంచి సంబంధాలు ఉన్నాయని చెప్పారు. అదే సమయంలో పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్‌ను గొప్ప వ్యక్తి, గొప్ప పోరాట యోధుడు అని ట్రంప్ అభివర్ణించారు. ఇక భారత్-పాక్ మధ్య యుద్ధాన్ని తానే ఆపానని ట్రంప్ మరోసారి వ్యాఖ్యానించారు. తమను యుద్ధం చేసుకోనివ్వాలని మొదట ఇరు దేశాల అధినేతలు కోరారని, కానీ రెండు రోజుల తర్వాత ఫోన్ చేసి యుద్ధం నిలిపేస్తున్నట్టు చెప్పారని ట్రంప్ చెప్పారు. భారత్-పాక్ మధ్య పరస్పర దాడులు కొనసాగిన మే 7-10 తేదీల మధ్య ఏడు సరికొత్త యుద్ధ విమానాలు కూలిపోయాయని అన్నారు.


ప్రపంచానికి దీపస్తంభం భారత్

- నౌకారంగంలో వేగంగా అభివృద్ధి సాధిస్తున్నాం: మోదీ

ముంబై, అక్టోబరు 29: ప్రపంచంలో ఉద్రిక్తతలు, వాణిజ్య అంతరాయాలు, ఉత్పత్తి సంస్థల తరలింపు చోటుచేసుకుంటున్న సమయంలో.. ప్రపంచానికి దారి చూపించే దీపస్తంభంలా భారత్ నిలిచిందని మోదీ అన్నారు. వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తి, శాంతి, అభివృద్ధికి భారత్ సంకేతంగా మారిందన్నారు. బుధవారం ముంబైలో మారిటైమ్ వీక్-2025లో భాగంగా నిర్వహించిన మారిటైమ్ లీడర్స్ కాంక్లేవ్‌లో మోదీ పాల్గొని మాట్లాడారు. శక్తివంతమైన ప్రజాస్వామ్యం, విశ్వసనీయతే భారత్‌ను ప్రత్యేకంగా నిలిపాయని పేర్కొన్నారు. నౌకా వాణిజ్య రంగంలో భారత్ ప్రవేశపెట్టిన నూతన విధానాలు వాణిజ్య మార్గాలను పునర్ నిర్వచించే విశాల దృక్పథంలో భాగంగా, భారత్-మధ్యప్రాచ్య-యూరప్ ఆర్థిక కారిడార్‌కు ఉదాహరణగా నిలుస్తాయని మోదీ అన్నారు. భారత నౌకారంగం గొప్ప వేగంతో శక్తివంతంగా అభివృద్ధి చెందుతోందని చెప్పారు. ఇక దేశంలో అమల్లో ఉన్న శతాబ్దాల నాటి షిప్పింగ్ చట్టాలను మార్చివేసి.. 21 శతాబ్దానికి అవసరమైన ఆధునిక చట్టాలను తీసుకొచ్చామని మోదీ తెలిపారు. గతంలో రెండు మాత్రమే ఉన్న జలమార్గాల సంఖ్య 32కు పెరిగిందన్నారు. తమ దృష్టంతా బ్లూ ఎకానమీ, స్థిరమైన తీరప్రాంత అభివృద్ధిపైనే ఉంటుందని అన్నారు.

కెనడాలో భారత సంతతి పారిశ్రామికవేత్త హత్య

- గాయకుడి ఇంటిపై కాల్పులు
- లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ ఘాతుకం


దర్శన్ సింగ్ సహసి

న్యూఢిల్లీ, అక్టోబరు 29: లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ కెనడాలో ఘాతుకానికి పాల్పడింది. అక్కడ భారత సంతతి పారిశ్రామికవేత్త దర్శన్ సింగ్ సహసి(68)ని సోమవారం హత్య చేయడంతోపాటు పంజాబీ గాయకుడు చన్ని నట్టన్ ఇంటిపై కాల్పులు జరిపింది. తాము అడిగిన డబ్బు ఇవ్వకపోవడంతోనే దర్శన్ సింగ్‌ని హత్య చేసినట్లు బిష్ణోయ్ గ్యాంగ్ సభ్యుడు గోల్డి ధిల్లాన్ ఒక సోషల్ మీడియా పోస్ట్‌లో పేర్కొన్నాడు. ఆయన పెద్ద ఎత్తున మాదకద్రవ్యాల వ్యాపారం చేస్తున్నాడని ఆరోపించాడు. కెనడాలోని బ్రిటిష్ కొలంబియాలో ఎబాట్స్‌ఫోర్డ్ వద్ద ఉన్న దర్శన్ సింగ్ ఇంటి వద్దే ఆయన్ను కాల్చి చంపారు. రోడ్డు మీద పార్కు చేసి ఉన్న తన కారులో ఎక్కిన దర్శన్‌సింగ్‌పై అప్పటికే అక్కడికి కారులో వచ్చి వేచిఉన్న ఆగంతకుడు కాల్పులు జరిపి పరారయ్యాడు. దర్శన్‌సింగ్ కేనమ్ ఇంటర్నేషనల్ అనే పెద్ద టెక్స్‌టైల్ రీసైక్లింగ్ కంపెనీ యజమాని. 1991లో కెనడా వెళ్లిన ఆయన తొలుత చిన్న చిన్న ఉద్యోగాలు చేశారు. తర్వాత ఒక టెక్స్‌టైల్ రీసైక్లింగ్ కంపెనీని కొనుగోలు చేసి దాన్ని గ్లోబల్ కంపెనీగా తీర్చిదిద్దారు. దాతగాను పేరొందిన ఆయన హత్యపై కెనడాలోని పంజాబీ ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తం అయ్యింది. కాగా, గాయకుడు సర్దార్ ఖేరాకు దగ్గరవుతున్నందుకే నట్టన్ ఇంటిపై కాల్పులు జరిపినట్లు ధిల్లాన్ సోషల్ మీడియా పోస్ట్‌లో పేర్కొన్నాడు.

భారత్‌లో స్వేచ్ఛగా ఉన్నా.. బంగ్లాదేశ్‌కు వెళ్లే ఉద్దేశం లేదు

- ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా



న్యూఢిల్లీ, అక్టోబరు 29: భారత దేశంలో తాను స్వేచ్ఛగా జీవిస్తున్నానని, ఇండియాను వదిలి వెళ్లే ఉద్దేశం తనకు లేదని బంగ్లాదేశ్ మాజీ ప్రధాని, ప్రస్తుతం భారత్‌లో ఆశ్రయం పొందుతున్న షేక్ హసీనా అన్నారు. గతేడాది ఆగస్టులో బంగ్లాదేశ్‌లో హింస నేపథ్యంలో పారిపోయి ఇండియాకు వచ్చిన హసీనా బుధవారం మొట్టమొదటిసారి మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చారు. బంగ్లాదేశ్‌లో ఫిబ్రవరిలో జరగబోయే ఎన్నికల్లో తమ పార్టీ అవామీలీగ్‌ను పోటీ చేయనివ్వకపోతే కోట్లాది మంది ప్రజలు ఎన్నికలను బహిష్కరిస్తారని ఆమె మహమ్మద్ యూనస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఎన్నికల్లో తమ పార్టీ తప్ప ఏ పార్టీ గెలిచి అధికారంలోకి వచ్చినా తాను బంగ్లాదేశ్‌కు వెళ్లబోనని చెప్పారు. హసీనాకు చెందిన అవామీ లీగ్ పార్టీ గుర్తింపును బంగ్లాదేశ్ ఎన్నికల సంఘం మే నెలలో రద్దు చేసింది. ఆ తర్వాత యూనస్ ప్రభుత్వం అవామీ లీగ్ కార్యకలాపాలపై నిషేధం విధించింది. ఇదిలా ఉండగా, బంగ్లాదేశ్‌లో హింస సందర్భంగా పోలీసుల కాల్పుల్లో, ఇతర ఘటనల్లో చనిపోయిన 1400 మంది కుటుంబాలకు క్షమాపణలు చెప్పడానికి హసీనా నిరాకరించారు. అయితే, సంతాపం వ్యక్తం చేశారు.

గాజా మళ్లీ రక్తసిక్తం

- ఇజ్రాయెల్ దాడుల్లో 104 మంది మృతి

టెల్‌అవీవ్/గాజా, అక్టోబరు 29: అమెరికా మధ్యవర్తిత్వంలో అక్టోబరు 10న కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ గాజాపై ఇజ్రాయెల్ బాంబుల వర్షం కురిపించింది. ఈ దాడుల్లో 46 మంది చిన్నారులు సహా 104 మంది మృతిచెందారు. 253 మంది గాయపడ్డారు. దక్షిణ గాజాలో తమ బలగాలపై హమాస్ కాల్పులు జరపడానికి ప్రతీకారంగా హమాస్‌కు చెందిన 30 లక్ష్యాలపై శక్తిమంతమైన దాడులు చేశామని ఇజ్రాయెల్ తెలిపింది. దాడులు పూర్తి కాగానే తిరిగి కాల్పుల విరమణ ఒప్పందం పాటిస్తున్నామని ప్రకటించింది. అమెరికాకు సమాచారం ఇచ్చాకే ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు గాజాపై దాడులకు ఆదేశాలిచ్చారని సమాచారం. సైన్యంపై దాడిచేస్తే ప్రతిదాడులు జరపవచ్చంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇజ్రాయెల్ దాడులను సమర్థించారు. అయితే గాజాలో శాంతిని ఎవరూ అస్థిరపరచలేరని చెప్పారు. మరోవైపు కాల్పుల విరమణ ఒప్పందం ప్రకారం హమాస్ ఇంకా 13 మంది బందీల మృతదేహాలను అప్పగించాల్సి ఉంది.

అణు ఛోదిత జలాంతర్గామికి రష్యా పరీక్ష

న్యూఢిల్లీ, అక్టోబరు 29 : రష్యా అణు ఛోదిత జలాంతర్గామి(అండర్ వాటర్) డ్రోన్‌ను పరీక్షించింది. ఇటీవలే దీర్ఘశ్రేణి అణు ఛోదిత క్షిపణి బురెవెస్నిక్‌ని పరీక్షించిన ఆ దేశం తాజాగా అణు ఛోదిత జలాంతర్గామి డ్రోన్ పోసైడన్‌ని పరీక్షించింది. ఈ విషయాన్ని రష్యా అధ్యక్షుడు పుతిన్ బుధవారం స్వయంగా ప్రకటించారు. ప్రస్తుతమున్న రక్షణ వ్యవస్థలతో దాన్ని నిరోధించడం అసాధ్యమని కూడా చెప్పారు. అమెరికా అధ్యక్షుడు బురెవెస్నిక్ క్షిపణి ప్రయోగాన్ని విమర్శించిన తరుణంలోనే ఈ ప్రయోగం జరగడం గమనార్హం. తమ ఖండాంతర క్షిపణి సర్మత్‌ని మించిన సామర్థ్యం దీనికి ఉందని పుతిన్ చెప్పారు. సముద్రాల్లో చాలా లోతుకు వెళ్లగల సామర్థ్యం పోసైడన్‌కు ఉందని చెబుతున్నారు.

పీఎం, సీఎం..రెండు పదవులూ ఖాళీ లేవు

- బిహార్ ఎన్నికల ప్రచార సభల్లో లాలూ, సోనియాపై అమిత్ షా విమర్శ


బిహార్ ఎన్నికల ప్రచారంలో అమిత్ షా

పట్నా, అక్టోబరు 29: కేంద్ర హోం మంత్రి అమిత్ షా బుధవారం బిహార్‌లో సుడిగాలి పర్యటన చేశారు. దర్భంగా, సమస్తీపూర్, బెగుసరాయ్ నగరాల్లో ఎన్నికల ప్రచార సభల్లో ప్రసంగిస్తూ ఇండియా కూటమిపై విమర్శలు సంధించారు. 'బిహార్‌లో బీజేపీ ఎలాంటి రాజకీయ నేపథ్యం లేని మైథిలీ ఠాకూర్ వంటి అనేక మంది యువతకు టికెట్లు ఇచ్చింది. కానీ ఆర్జేడీ, కాంగ్రెస్ పార్టీలు మాత్రం ఇవ్వలేదు. ఎందుకంటే లాలూజీ ఆయన కుమారుడు తేజస్విని ముఖ్యమంత్రిని చేయాలనుకుంటున్నారు. సోనియాజీ ఆమె తనయుడు రాహుల్ ప్రధాని కావాలనుకుంటున్నారు. అయితే ఆ రెండు పదవులూ ఖాళీ లేవని వారు తెలుసుకోవాల'ని అమిత్ షా వ్యాఖ్యానించారు. లాలూ ప్రసాద్ వివిధ కుంభకోణాల కేసుల్లో కూరుకుపోగా, కాంగ్రెస్‌పై రూ.12 లక్షల కోట్ల అవినీతి కేసులు ఉన్నాయని విమర్శించారు. ప్రధాని మోదీ, బిహార్ సీఎం నితీశ్‌పై ఒక్క అవినీతి ఆరోపణ కూడా లేదన్నారు. చొరబాటుదారుల పేర్లు ఓటర్ల జాబితాలో ఉండాలని రాహుల్ గాంధీ, లాలూ ప్రసాద్‌లు కోరుకుంటుండగా... బిహార్‌లో మళ్లీ ఆటవిక రాజ్యం తేవాలన్నది తేజస్వి, రాహుల్ ఉద్దేశమని విమర్శించారు. కాంగ్రెస్-ఆర్జేడీ అధికారంలోకి వస్తే జైళ్లలో ఉన్న నిషేధిత రాడికల్ సంస్థ పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ) సభ్యులను వదిలేస్తారని ఆరోపించారు. కాగా, పాట్నా జిల్లాలో ఎన్నికల ప్రచార సభలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ ప్రసంగించారు. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి (నవంబరు 14) నాడు బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెల్లడయ్యే విషయాన్ని గుర్తుచేస్తూ.. ఎన్డీయేకు మూడింట రెండొంతుల మెజారిటీ ఇవ్వడం ఆయనకు సరైన నివాళి అని వ్యాఖ్యానించారు. నెహ్రూ తమ పార్టీకి చెందిన నాయకుడు కాకపోయినా దేశ తొలి ప్రధానిగా ఆయనను గౌరవిస్తానన్నారు.


ఓట్ల కోసం మోదీ భరతనాట్యం కూడా చేస్తారు!



ఓట్ల కోసం మోదీ ఏదైనా చేయగలరని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ దుయ్యబట్టారు. 'ఛట్ పూజ కోసం చెరువులో దిగిన మోదీ.. యమునా నదిలో స్నానం చేశానంటూ కొత్త నాటకానికి తెరతీశారు. ఓట్ల కోసం ఆయన ఎన్ని నాటకాలైనా ఆడతారు. మోదీ గారూ.. మీరు నృత్యం చేస్తే మీకే ఓటేస్తామని చెప్పండి.. అంతే.. ఆయన భరతనాట్యం కూడా చేస్తారు' అని వ్యాఖ్యానించారు. నితీశ్ కుమార్ సర్కారును బీజేపీనే రిమోట్‌తో నడుపుతోందని రాహుల్ విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇండియా కూటమి సీఎం అభ్యర్థి తేజస్వీ యాదవ్‌తో కలసి రాహుల్ బుధవారం ముజఫర్‌పూర్, దర్భంగాల్లో పర్యటించారు.

రఫేల్‌లో రాష్ట్రపతి

యుద్ధవిమానంలో ప్రయాణించిన ద్రౌపది ముర్ము



న్యూఢిల్లీ, అక్టోబరు 29: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చరిత్ర సృష్టించారు. భారత వాయుసేనకు చెందిన రెండు వేర్వేరు యుద్ధ విమానాల్లో ప్రయాణించిన తొలి రాష్ట్రపతిగా నిలిచారు. బుధవారం ఆమె రఫేల్ యుద్ధ విమానంలో ప్రయాణించారు. జి-సూట్, సన్‌గ్లాస్‌లు ధరించిన ముర్ము.. హరియాణాలోని అంబాలా వైమానిక స్థావరం నుంచి ఉదయం 11.27 గంటలకు రఫేల్ యుద్ధ విమానంలో టేకాఫ్ అయ్యారు. దాదాపు 30 నిమిషాల పాటు 200 కిలోమీటర్లకు పైగా దూరం ప్రయాణించారు. విమానం 15 వేల అడుగుల ఎత్తులో, గంటకు 700 కి.మీ. వేగంతో ప్రయాణించింది. ఈ విమానాన్ని గ్రూప్ కెప్టెన్ అమిత్ గెహానీ నడిపారు. ముర్ము ప్రయాణించిన విమానానికి తోడుగా మరో రఫేల్ జెట్ వెళ్లింది. దాన్ని వైమానిక దళాధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్ స్వయంగా నడపడం విశేషం. రఫేల్ యుద్ధ విమానంలో ప్రయాణించి, అంబాలా వైమానిక స్థావరంలో కిందకు దిగిన అనంతరం రాష్ట్రపతి ముర్ము తన అనుభవాలను సందర్శకుల పుస్తకంలో రాశారు. "రఫేల్ యుద్ధ విమానంలో ప్రయాణించడం నాకు ఎన్నటికీ మరచిపోలేని అనుభూతి" అని ముర్ము పేర్కొన్నారు. అంతకుముందు రఫేల్ జెట్ తొలి మహిళా పైలట్, స్క్వాడ్రన్ లీడర్ శివాంగి సింగ్ రాష్ట్రపతి ముర్ముతో కలిసి ఫొటోలకు పోజిచ్చారు. ఆపరేషన్ సిందూర్ వేళ శివాంగిని పాక్ సైన్యం బంధించినట్లుగా ఆ దేశ అనుకూల సోషల్ మీడియా ఖాతాల్లో కథనాలు వచ్చాయి. కాగా, ముర్ము 2023 ఏప్రిల్‌లో సుఖోయ్30 ఎంకేఐ యుద్ధ విమానంలో ప్రయాణించారు.

డ్రగ్స్‌పై బ్రెజిల్ యుద్ధం!

- మాదకద్రవ్య ముఠాపై పోలీసు ఆపరేషన్
- 132 మంది ముఠా సభ్యులు హతం

రియో డి జనీరో, అక్టోబరు 29: బ్రెజిల్‌లోని రియో డి జనీరో నగరంలో మంగళవారం జరిగిన ఓ పోలీసు ఆపరేషన్ ఆ ప్రాంతాన్ని యుద్ధభూమిగా మార్చింది. అత్యంత శక్తిమంతమైన రెడ్ కమాండ్ అనే మాదకద్రవ్య ముఠాను అణచివేసే లక్ష్యంతో పోలీసులు, భద్రతా బలగాలు నిర్వహించిన ఈ భారీ ఆపరేషన్‌లో 132 మృతిచెందారు. ఈ ఘటనలో నలుగురు పోలీసు అధికారులు కూడా ప్రాణాలు కోల్పోయినట్లు హోం శాఖ ప్రకటించింది. రియోలోని మురికివాడలైన అలెమావో, పెన్హా ప్రాంతాల్లో పాగా వేసిన రెండ్ కమాండ్ ముఠాను ఏరివేసేందుకు దాదాపు ఏడాది నుంచి అధికారులు ప్రణాళిక రచిస్తున్నారు. ఇందులో భాగంగానే మంగళవారం 2,500 మందికి పైగా పోలీసులు, భద్రతా బలగాలతో ఆపరేషన్ చేపట్టారు. హెలికాప్టర్లు, సాయుధ వాహనాలతో ముఠాలున్న ప్రాంతాలను చుట్టుముట్టి దాడుల నిర్వహించారు. ప్రతీకార చర్యల్లో భాగంగా ముఠా సభ్యులు డ్రోన్ దాడులకు తెగబడ్డారు. ఈ దాడుల్లో నలుగురు పోలీసు అధికారులు కూడా ప్రాణాలు కోల్పోయారని ప్రభుత్వం వెల్లడించింది. దీనిపై గవర్నర్ క్లాడియో కాస్ట్రో స్పందించారు. ఇది సాధారణ నేరం కాదని, నార్కో-టెర్రరిజమని ఆయన అభివర్ణించారు. ఈ ఆపరేషన్ కారణంగా రియో నగరంలో ఉద్రిక్తత నెలకొంది. దాడికి నిరసనగా ముఠా సభ్యులు నగరంలోని పలు రహదారులను దిగ్బంధించారు. దాదాపు 70 బస్సులను రోడ్లకు అడ్డంగా పెట్టి నిప్పంటించారు. దీంతో నగరంలో రవాణా వ్యవస్థ స్తంభించింది. కాల్పుల మోతతో రెండు ప్రాంతాల్లోని 46 పాఠశాలలకు సెలవులు ప్రకటించారు.

ఏసీబీకి చిక్కిన యాదగిరిగుట్ట ఇన్‌చార్జి ఎస్ఈ

- ఎలక్ట్రికల్ కాంట్రాక్టరు నుంచి రూ.1.90 లక్షల లంచం
- గతంలో వేర్వేరు కారణాలతో రెండుసార్లు సస్పెన్షన్


ఎస్ఈ రామారావు

యాదాద్రి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రికల్ కాంట్రాక్టరు నుంచి రూ.1.90 లక్షల లంచం తీసుకుంటూ యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఇన్‌చార్జి ఎస్ఈ రామారావు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు పట్టుబడ్డారు. ఆయన బుధవారం రాత్రి హైదరాబాద్ ఉప్పల్‌లోని ఒక మెడికల్ షాపు వద్ద కాంట్రాక్టర్ నుంచి నగదు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆయనను యాదగిరిగుట్ట దేవస్థానంలోని ప్రధాన కార్యాలయానికి తీసుకొచ్చారు. ఆయన చాంబర్‌లో సోదాలు నిర్వహించారు. ఇటీవల సంతకాలు చేసిన ఫైళ్ల, ఎవరెవరికి మేలు చేసేలా వ్యవహరించారన్న విషయాలపై ఆరా తీశారు. రామారావు బంధువుల ఇళ్లలోనూ ఏసీబీ అధికారులు ఏకకాలంలో రాత్రి పొద్దుపోయే వరకు సోదాలు నిర్వహించారు. యాదగిరిగుట్ట దేవస్థానంలో ఎస్ఈ స్థాయి అధికారి ఏసీబీకి పట్టుబడటం ఇదే ప్రథమం. రామారావుపై గత కొన్నేళ్లుగా అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. ఉన్నతాధికారుల అనుమతి లేకుండానే అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను నియమించినందుకు, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు రెండుసార్లు సస్పెండ్ అయ్యారు. 8 నెలల తర్వాత తిరిగి విధుల్లో చేరారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆయనకు ఉన్నతాధికారులు తిరిగి ఎస్ఈగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడం గమనార్హం.

లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన లైన్ ఇన్‌స్పెక్టర్

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గతంలో లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కినా ఆ ఉద్యోగి తీరు మారలేదు. మరోసారి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కాడు. తట్టిఅన్నారం జ్యోతిపురం కాలనీకి చెందిన ఓ వినియోగదారుడి ఇంటికి సంబంధించి 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు నూతన విద్యుత్ మీటర్ల మంజూరు కోసం పెద్ద అంబర్‌పేట్ విద్యుత్ సబ్‌స్టేషన్ లైన్ ఇన్‌స్పెక్టర్ ప్రభులాల్ లంచం డిమాండ్ చేశాడు. ఈ క్రమంలో బుధవారం బండ్లగూడలో బాధితుడు రూ. 6 వేలు ఇస్తుండగా.. ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం అతడిని నాంపల్లిలోని ఏసీబీ కార్యాలయానికి తరలించారు.

తల్లి త్యాగానికి దక్కని ఫలితం!

- కొడుకు కోసం తన కిడ్నీ దానం చేసిన తల్లి..
- శస్త్రచికిత్స తర్వాత ఇంటికొచ్చాక కుమారుడి మృతి


నాగరాజు (ఫైల్)

పర్వతగిరి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రెండు కిడ్నీలు దెబ్బ తిని చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న కొడుక్కి.. తన కిడ్నీ ఇచ్చిందా ఆ తల్లి.. అయినా అతడి ప్రాణం నిలవలేదు..! శస్త్రచికిత్స తర్వాత ఆస్పత్రి నుంచి ఇంటికొచ్చాక అస్వస్థతకు గురై మృతి చెందాడు. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని వడ్లకొండలో ఈ విషాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చింతకాయల జంపయ్య, సోమక్క దంపతులకు ముగ్గురు కొడుకులు. రెండో కుమారుడు నాగరాజు (33) ఏడేళ్ల కిందట నుంచి తన భార్య స్వప్న, కూతురు అక్షరశ్రీతో హైదరాబాద్‌లోని ఓ చికెన్ షాపులో పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. అయితే అనారోగ్యం బారినపడ్డ నాగరాజును ఇటీవల ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లగా.. పరీక్షించి అతడి రెండు కిడ్నీలు చెడిపోయాయని వైద్యులు తెలిపారు. ఎవరైనా కిడ్నీ ఇస్తే తప్ప బతికే అవకాశం లేదన్నారు. ఈ నేపథ్యంలోనే కుటుంబంలో అందరి కిడ్నీలను పరీక్ష చేయగా తల్లి సోమక్క కిడ్నీ సరిపోతుందని వైద్యులు తేల్చారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.15 లక్షల అప్పులు చేసి చెల్లించగా.. ఆపరేషన్ చేసి కిడ్నీ మార్పిడి చేశారు. అనంతరం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేయగా, ఇంటికొచ్చిన నాగరాజు తిరిగి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. దీంతో వెంటనే హైదరాబాద్‌లోని సదరు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే చనిపోయాడు. కిడ్నీ ఇచ్చి, అప్పులు చేసి మరీ వైద్య చికిత్సలు చేయించినా నాగరాజును బతికించుకోలేకపోయామని తల్లి, భార్య, కుటుంబీకులు గుండెలవిసేలా రోదించారు. నాగరాజు కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు.

వసతులు లేవు.. బోగస్ విద్యార్థులు

(మొదటి పేజీ తరువాయి)



సంక్షేమ శాఖలు, ఉన్నత విద్య, వర్సిటీల అధికారులు ఈ తనిఖీ బృందంలో ఉంటారు. వారు పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాలు పొందుతున్న అన్ని కాలేజీలనూ తనిఖీ చేస్తారు. కాలేజీలు నిజంగా అనుమతుల ప్రకారం నడుస్తున్నాయా? స్కాలర్‌షిప్ పొందుతున్న విద్యార్థులు అందుకు అర్హులేనా? నిబంధనలకు అనుగుణంగా బోధన, బోధనేతర సిబ్బంది ఉన్నారా? తరగతి గదులు, ల్యాబ్‌లు, మౌలిక సదుపాయాలు ఉన్నాయా? విద్యార్థుల హాజరు, ఫలితాలు సరైనవేనా? విద్యార్థుల ఉత్తీర్ణత ఎంత? ఏవైనా ఇతర అవకతవకలు ఉన్నాయా? తదితర విషయాలను పరిశీలిస్తారు. ఈ తనిఖీల్లో ఉన్నత విద్యాశాఖ, పాఠశాల విద్యాశాఖ అధికారులు తప్పనిసరిగా భాగస్వాములుగా ఉండాలని ప్రభుత్వం ఆదేశించింది. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ, వరంగల్ పోలీస్ కమిషనరేట్లకు చెందిన పోలీసు అధికారులు కూడా ఈ తనిఖీల్లో భాగమవుతారు.

ఆ కాలేజీలతో..

రాష్ట్రవ్యాప్తంగా ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హమైన వృత్తివిద్య కాలేజీలు దాదాపు 1900 ఉన్నాయి. ఇందులో డిగ్రీ కళాశాలలు 900 కాగా.. ఎంబీఏ-ఎంసీఏ కాలేజీలు 310, బీఈడీ కాలేజీలు 215, ఇంజినీరింగ్ 175, ఫార్మసీ 123, పాలిటెక్నిక్ 70, ఐటీఐ, లా, ఇతర కాలేజీలు మరో వంద వరకు ఉంటాయి. తొలుత ఇంజినీరింగ్ కాలేజీల్లో తనిఖీలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాలు పొందుతున్న కాలేజీల్లో జూనియర్ కాలేజీలూ ఉన్నాయి. వాటిని మినహాయించి.. డిగ్రీ, ఇతర వృత్తివిద్య కాలేజీల్లోనే తనిఖీలు నిర్వహించనున్నారు. ఇకనుంచి ఉన్నత విద్యాసంస్థలపై కఠినంగా వ్యవహరించాలని, విచారణ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ప్రభుత్వ తనిఖీలకు సహకరించం: ఫాతీ

నాలుగేళ్లుగా బకాయిపడ్డ ఫీజు రియింబర్స్‌మెంట్ నిధులు అడిగినందునే ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ప్రైవేటు కాలేజీల యాజమాన్యాల సంఘాల సమాఖ్య (ఫాతీ) పేర్కొంది. విచారణ జరిపించాలన్న ప్రభుత్వ ఆదేశాలపై సంఘం అభ్యంతరం వ్యక్తం చేసింది. "ప్రతి విద్యార్థి వివరాలూ ఈ-పాస్ వెబ్‌సైట్లో ఉన్నాయి. విద్యార్థుల సంఖ్యను ప్రభుత్వ అధికారులే ధ్రువీకరించారు. అయినా అవకతకవకలు జరుగుతున్నాయని చెప్పడం సరికాదు" అని ఫాతీ అధ్యక్షుడు నిమ్మగడ్డ రమేశ్ బాబు ఆవేదన వెలిబుచ్చారు. నాలుగేళ్లుగా ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడంతో రాష్ట్రంలో ప్రైవేటు కాలేజీలు కొనసాగించలేని పరిస్థితులు ఉన్నాయన్నారు. ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశిస్తుందని తమకు ముందే తెలుసని, ఈ విచారణకు అధికారులకు తాము సహకరించబోమని ఆయన స్పష్టం చేశారు. తాము గతంలో ప్రకటించిన విధంగా నవంబరు-3 నుంచి కాలేజీల నిరవధిక సమ్మె ఉంటుందని రమేశ్ బాబు పేర్కొన్నారు.

పనుల్లో ఇంత జాప్యం ఎందుకు!

- నా దృష్టికి తీసుకురాలేదన్న మంత్రి అడ్లూరి
- గురుకులాలా నిర్మాణ పనులపై నేడు సమీక్ష

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హైదరాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గిరిజన గురుకులాల భవన నిర్మాణ పనుల్లో జాప్యం ఎందుకు జరుగుతోంది? 2016లో మంజూరైన పనులు ఇంకా ఎందుకు పూర్తికాలేదని.. ఇన్నాళ్లు ఈ పనుల గురించి తన దృష్టికి ఎందుకు తీసుకరాలేదని.. వెంటనే ఆ పనులు పర్యవేక్షించే ఇంజినీరింగ్ అధికారలతో సమీక్ష నిర్వహించి.. కారణాలు విశ్లేషిస్తూ నివేదిక పంపాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. ఆయన ఆదేశాల మేరకు గిరిజన సంక్షేమశాఖలో పనిచేస్తున్న ఇంజినీర్లతో బుధవారం సమావేశం ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలోని ఇంజినీర్లంతా పనుల పురోగతి నివేదికలతో హాజరు కావాలని గిరిజన గురుకుల సెక్రటరీ సీతాలక్ష్మి ఆదేశాలు జారీ చేశారు. గిరిజన గురుకులాల భవనాలు 2016-17, 2022-23లలో కలిపి రూ.463 కోట్లతో 98 మంజూరయ్యాయి. ఇప్పటి వరకు కేవలం 43భవనాలు మాత్రమే మంజూరయ్యాయి. ఇంజినీర్లు, కాంట్రాక్టర్ల కుమ్మక్కుతో పనుల్లో జాప్యం, నాణ్యత లేకపోవడం వంటి అంశాలపై మంగళవారం ఆంధ్రజ్యోతిలో 'అసంపూర్తిగా గిరిజన గురుకులాలు!' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ కథనం ఆధారంగా పనుల తీరుపైన ప్రభుత్వం ఆరా తీసింది. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆశాఖ అధికారుల తీరుపై సీరియస్ అయినట్లు తెలిసింది. గతంలో జరిగిన సమీక్ష సమావేశాల్లో ఈ పనుల అంశాన్ని ఎజెండాగా పెట్టకపోవడాన్ని తీవ్రంగా తప్పుపట్టినట్లు సమాచారం. ఆయన ఆదేశాల మేరకు ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేయాలని ఆశాఖ ఉన్నతాధికారులు నిర్ణయించారు. పనుల్లో జాప్యాన్ని నివారించడానికి తగిన చర్యలు తీసుకోనున్నారు. అంతేకాకుండా పనుల్లో నాణ్యత, ఇతర అవకతవకలు కూడా ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో కొందరు అధికారుల్లో ఆందోళన మొదలైంది. ఇదే విషయంపై ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు కూడా ఆ శాఖ అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నట్లు సమాచారం.


బీజాపూర్ పోలీసుల ఎదుట లొంగిపోయిన మావోయిస్టులు

ఒకేరోజు 72మంది మావోయిస్టుల లొంగుబాటు

- ఛత్తీస్‌గఢ్ కాంకేర్‌లో 21మంది, బీజాపూర్‌లో 51మంది..

చర్ల, కొత్తగూడెం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లో బుధవారం ఒక్కరోజే బస్తర్ డివిజన్‌లోని కాంకేర్, బీజాపూర్ జిల్లాల్లో 72మంది మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిశారు. కాంకేర్ జిల్లాలోని అడవుల నుంచి మూడు రోజుల క్రితం 21మంది మావోయిస్టులు, 18తుపాకులతో లొంగిపోగా బుధవారం వీరిని కాంకేర్ జిల్లా పోలీసులు అధికారికంగా మీడియా ముందుకు తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ పాల్గొన్నారు. మరోవైపు బీజాపూర్ జిల్లా పోలీసుల ఎదుట బుధవారం 51మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో పీఎల్‌జీఏ 1, 2, 5 బెటాలియన్, జనతన సర్కార్ సభ్యులున్నారని బీజాపూర్ ఎస్పీ జితేందర్ యాదవ్ తెలిపారు. కాగా, ఇటీవల భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసుల ఎదుట లొంగిపోయిన ముగ్గురు మావోయిస్టులకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.9.50లక్షల చెక్కులను ఎస్పీ రోహిత్ రాజు అందజేశారు.

ప్రజాయుద్ధాన్ని కొనసాగించడమే మా వైఖరి

- లేఖ విడుదల చేసిన మావోయిస్టు పార్టీ

ప్రజాయుద్ధాన్ని కొనసాగించడమే తమ వైఖరని స్పష్టం చేస్తూ మావోయిస్టు పార్టీ బుధవారం ఓ లేఖ విడుదల చేసింది. ఒడిసా రాష్ట్ర కమిటీ గణేశ్ పేరిట విడుదలైన ఆ లేఖలో.. దీర్ఘకాలిక ప్రజాయుద్ధం కొనసాగిస్తామని, ప్రజలు తప్పుడు ప్రచారాలు నమ్మొద్దని సూచించారు. కేంద్ర కమిటీ సభ్యుడు, తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి చంద్రన్న హైదరాబాద్ పోలీసుల ఎదుట లొంగిపోయాడని, లాల్ సలాం చేస్తూ భవిష్యత్తులో విప్లవం కోసం ప్రజల మధ్య పనిచేస్తానని ఆయన ప్రకటించడం దిగజారుడు తనమేనని విమర్శించారు. దేవ్‌జీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యాడని చంద్రన్న చెప్పాడని అది పూర్తి అబద్ధమని పేర్కొన్నారు. మావోయిస్టు పార్టీ ప్రజా యుద్ధంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటోందని, అవన్నీ తాత్కాలికమని వాటిని అధిగమించి పార్టీ ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. అలాగే రెండు సంవత్సరాలుగా పార్టీ ఎదుర్కొంటున్న భౌతిక నష్టాలను అధిగమించడానికి, ఉద్యమాన్ని బలోపేతం చేయడానికి ప్రయత్నం చేస్తున్నామని గణేశ్ ఆ లేఖలో పేర్కొన్నాడు.

సౌదీలో కేరళ పథకాల ప్రచారం..
ఇద్దరు మలయాళీ ప్రముఖుల అరెస్టు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

గల్ఫ్ దేశాల్లో ప్రవాస మలయాళీల కోసం కేరళ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న బీమా పథకం ప్రయోజనాలను ప్రవాసీయులకు వివరిస్తున్న ఇద్దరు ప్రముఖ ప్రవాసీయులను సౌదీ అరేబియా పోలీసులు అరెస్టు చేశారు. సౌదీ అరేబియాలోని ఈశాన్య ప్రాంతంలో ఓ చోట ప్రవాసీయులు గుమిగూడినప్పుడు ఈ ఘటన చోటుచేసుకుంది. అరెస్టయిన ఇద్దరు ప్రవాసీయులు మలయాళీ సమాజంలో పేరుప్రతిష్ఠలు కలిగిన ప్రముఖులు కాగా, అందులో ఒకరు కేరళ సీఎం అధ్యక్షుడిగా ఉన్న ప్రవాసీ వ్యవహారాల సంస్థలో డైరెక్టరుగా ఉన్నారు. అరెస్టయిన ఇద్దర్నీ కనీసం బెయిల్‌పై విడుదల చేయించేందుకు రియాద్‌లోని భారతీయ ఎంబసీ కొన్ని రోజులుగా చేస్తున్న ప్రయత్నాలు విఫలమవుతున్నాయి. దీంతో ఈ ఇద్దర్నీ విడుదల చేయించేందుకు కేరళ సీఎం స్వయంగా రంగంలోకి దిగారు. కాగా, సౌదీ అరేబియా సహా ఇతర గల్ఫ్ దేశాల్లో సభలు, సమావేశాల నిర్వహణపై నిషేధం ఉంది. అయినా, తెలుగు ప్రవాసీయులు అనేక మంది ఎలాంటి అనుమతులు పొందకుండా.. సమావేశాలు నిర్వహిస్తుంటారు. ఈ రకమైన కార్యకలాపాలపై పోలీసులు ఎప్పటికప్పుడు ఓ కన్నేసి ఉంచుతారు.

హైదరాబాద్‌లో రోబోటిక్ గైట్ ట్రైనర్

- తొలిసారిగా అందుబాటులోకి తెచ్చిన హెచ్‌సీఏహెచ్
- రోబోటిక్స్, రికవరీ ల్యాబ్ ప్రారంభం



రోబోటిక్ గైట్ ట్రైనర్

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నాడీ సంబంధిత సమస్యలు, కండరాల బలహీనత వల్ల చలనం కోల్పోయిన రోగులను సాధారణ స్థితికి తీసుకొచ్చేందుకు ఉపయోగపడే 'జీ గైటర్' అనే అత్యాధునిక రోబోటిక్ గైట్ ట్రైనర్ హైదరాబాద్‌లో అందుబాటులోకి వచ్చింది. ప్రపంచ స్ట్రోక్ దినోత్సవం సందర్భంగా హెచ్‌సీఏహెచ్ సువిటాస్ రిహాబిలేషన్ సెంటర్.. హైదరాబాద్‌లోని సోమాజీగూడలో సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ రోబోటిక్స్ అండ్ రికవరీని బుధవారం ప్రారంభించింది. నగరంలోనే తొలిసారిగా ఈ కేంద్రంలో జి గైటర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ కార్యక్రమంలో హెచ్‌సీఏహెచ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ గౌరవ్ తుక్రాల్ మాట్లాడుతూ.. తెలంగాణలో స్ట్రోక్ కేసులు గణనీయంగా పెరుగుతున్నాయని, పట్టణ ప్రాంతాల్లో నమోదవుతున్న కేసుల్లో 20-30 శాతం మంది 18 నుంచి 45 ఏళ్ల లోపు వారే ఉంటున్నారని తెలిపారు. ఆ రోగులను సాధారణ స్థితికి తీసుకొచ్చేందుకు అవసరమైన రీహాబిలిటేషన్ కేంద్రాల కొరత ఉందన్నారు. దేశంలో ప్రస్తుతం 11.7 లక్షల మంది రోగులకు ఒక రీహాబిలిటేషన్ కేంద్రం మాత్రమే ఉందని తెలిపారు. స్ట్రోక్ లేదా పెద్ద శస్త్ర చికిత్స తర్వాత రోగి కోలుకునే క్రమంలో మొదటి 90 రోజులు అత్యంత కీలకమన్న డాక్టర్ గౌరవ్.. రోబోటిక్స్, రికవరీ ల్యాబ్ ద్వారా సాధ్యమైనంత వేగంగా రోగులు కోలుకునేలా చేయవచ్చని తెలిపారు. హెచ్‌సీఏహెచ్ మెడికల్ ఆపరేషన్స్ డైరెక్టర్ డాక్టర్ విజయ్ జనగామ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్రపవార్

నవజాత శిశువుల విక్రయం కేసు

- ఏడుగురి నిందితుల అరెస్టు
- వివరాలు వెల్లడించిన నల్లగొండ జిల్లా ఎస్పీ

నల్లగొండ క్రైం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నవజాత శిశువుల విక్రయం కేసులో ఓ వైద్యురాలు సహా ఏడుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. 15 రోజుల ఆడ శిశువుతో పాటు 21రోజుల మగ శిశువును విక్రయించారనే ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరస్వతి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్లు తెలిపారు. నవజాత శిశువులను నల్లగొండలోని శిశుగృహకు అప్పగించినట్లు చెప్పారు.

రూ.2.30లక్షలకు ఒప్పందం

నల్లగొండ జిల్లా తిరుమలగిరి సాగర్ మండలం ఎల్లాపురం తండాకు చెందిన కొర్ర బాబు, పార్వతి దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. 15 రోజుల క్రితం హాలియాలోని నిర్మల్ ఆస్పత్రిలో పార్వతి మూడో ఆడపిల్లకు జన్మనిచ్చింది. అయితే, ముగ్గురు ఆడపిల్లలను సాకలేనని భావించిన బాబు, ఇదే విషయాన్ని ఆస్పత్రి వైద్యురాలు శాంతిప్రియకు తెలియజేశాడు. ఆమె మధ్యవర్తిత్వం వహించి 16 సంవత్సరాలుగా పిల్లలులేని ఏలూరుకు చెందిన సాంబమూర్తి, రజితలకు దంపతులకు సమాచారం అందించింది. ఈ నెల 25న వీరి మధ్య రూ.2.30లక్షలకు అక్రమ దత్తత ఒప్పందం కుదిరింది. ముందుగా రూ.10వేలు ఇచ్చి సాంబమూర్తి దంపతులు శిశువును తీసుకెళ్లారు.

మగ బిడ్డకు రూ.4.50 లక్షలు

గుర్రంపోడు మండలం కోనాయిగూడెం గ్రామానికి చెందిన ఓర్సు శ్రీను మొదటి భార్య సుజాతకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఆరేళ్ల క్రితం ఒడిశాకు చెందిన మమతను రెండో వివాహం చేసుకున్నాడు. వారికి ఒక పాప జన్మించగా ప్రస్తుతం మమత ఎనిమిది నెలల గర్భవతి. పుట్టబోయే బిడ్డను విక్రయించి ఒడిశాకు వెళ్లాలని నిర్ణయించుకున్న శ్రీను దంపతులు.. దూరపు బంధువు మధ్యవర్తిత్వంతో బోయినపల్లి గ్రామానికి వేముల నాగరాజు, సువర్ణ దంపతులకు రూ 4.50లక్షలకు విక్రయించేందుకు నెలరోజుల క్రితం ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ నెల 8న మమత మగబిడ్డకు జన్మనివ్వగా.. నాగరాజు దంపతులు డబ్బు చెల్లించి బాబును తీసుకెళ్లారు. ఈ కేసులో మధ్యవర్తితో పాటు బాబును కొనుగోలు చేసిన నాగరాజు దంపతులను అరెస్టు చేయగా.. శిశువు తల్లిదండ్రులు పరారీలో ఉన్నట్లు ఎస్పీ తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

గాజాలో మళ్ళీ...

గాజామీద ప్రళయభీకరంగా విరుచుకుపడాలని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ తన సైన్యాన్ని ఆదేశించడంతో, రాత్రివేళల్లో జరిగిన ఆ విచక్షణారహిత దాడుల్లో పసిపిల్లలతో సహా అనేకమంది మరణించారని వార్తలు వచ్చాయి. దక్షిణగాజాలో తమ బలగాలమీద హమాస్ కాల్పులు జరిపిందనీ, ప్రతీకారంగా ఈ వైమానిక దాడులకు ఆదేశాలు ఇచ్చామని నెతన్యాహూ చెప్పుకున్నారు. తాము కాల్పుల విరమణ ఒప్పందానికి కట్టుబడే ఉన్నామని, మాట తప్పిన నెతన్యాహూ మళ్ళీ మంటలు రేపుతున్నాడనీ, ఇదే వైఖరి కొనసాగితే మృతదేహాల అప్పగింత మరింత ఆలస్యం అవుతుందని హమాస్ హెచ్చరిస్తోంది. అది ఇంకా డజనుకుపైగా మృతదేహాలు ఇజ్రాయెల్‌కు అప్పగించాల్సి ఉన్నందున, వాటిని అడ్డుపెట్టుకొని ఇజ్రాయెల్ దూకుడుకు కళ్ళెం వేయగలనని అనుకుంటోంది. ఇజ్రాయెల్ మళ్ళీ భీకరయుద్ధానికి దిగడంతో ట్రంప్ కష్టపడి కుదర్చిన ఆ శాంతిఒప్పందం కూలిపోతుందేమోనని మిగతా ప్రపంచం తెగ బాధపడుతోంది. రెండేళ్ళ పాటు బందీలను అడ్డుపెట్టుకొని పోరాడిన హమాస్‌కు, తాను రక్షణకవచం లాగా వాడుకున్నవారిని అప్పగించగానే ఇజ్రాయెల్ ఎంత నిర్దయగా విరుచుకుపడుతుందో తెలియదనుకోలేం. బందీల విడుదల, హమాస్ నిర్మూలన లక్ష్యంగా యుద్ధాన్ని ఆరంభించిన నెతన్యాహూ ఆ రెండిటినీ సాధించలేక కొట్టుమిట్టాడుతున్న స్థితిలో ట్రంప్ కుదర్చిన శాంతి ఒప్పందం అందుకు దారులు పరిచింది. బందీల అప్పగింత జరిగిపోయింది కనుక, ఆ రెండో లక్ష్యం సాధించుకోవడం నెతన్యాహూకు ఇక సులభమే. హమాస్ చేతిలో సజీవంగా ఉన్నవారంతా తన చేతుల్లోకి వచ్చీరాగానే, మృతదేహాల లెక్కల్లో తేడాపాడాలున్నాయంటూ నెతన్యాహూ అప్పట్లోనే విరుచుకుపడ్డారు. హమాస్ సోమవారం అప్పగించిన ఒక మృతదేహం విషయంలో ఆయనకు ఏకంగా కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడం కనిపించింది. వెనువెంటనే మంత్రిపుంగవులతోనూ, భద్రతాధికారులతోనూ ఆంతరంగిక సమావేశాన్ని ఏర్పాటుచేసి, ప్రతీకారంగా ఒక్కరోజులో వందమంది పాలస్తీనియన్లను మృతదేహాలుగా మార్చేశారు. ఇజ్రాయెల్ సైనికుల మీద తాము ఏ దాడులూ చేయలేదన్న హమాస్ ప్రకటనను విశ్వసించడం ఆయనకు ఇష్టంలేకపోయింది.

ఒప్పందానికి అనుగుణంగా డెబ్బైరెండుగంటల్లో బందీలను సవ్యంగా అప్పగించిన హమాస్, మృతదేహాలను కూడా ఇచ్చేస్తుందన్న టెన్షన్ నెతన్యాహూకు ఉన్నదేమో! ఒకపక్క హమాస్ స్థావరాలు, నాయకులు లక్ష్యంగా తాను భీకరదాడులు జరుపుతూంటే, మిగిలిన దేహాలు ఇవ్వడం హమాస్‌కు కష్టమనీ, అది తెగించనూ వచ్చని నెతన్యాహూకు తెలియకపోదు. శాంతి ఒప్పందం అమల్లో ఉండగా, ఇజ్రాయెల్ ప్రధాని సైనికచర్యకు ఆదేశించడమంటే దానిని ఉల్లంఘించడమేనని అమెరికా అధ్యక్షుడికీ తెలుసు. అయినా, ఆయన మళ్ళీ ఇజ్రాయెల్ ప్రతీకార దాడులు సరైనవేనంటూ సమర్థించుకొచ్చారు, హమాస్‌ను తప్పుబట్టారు. ట్రంప్‌కు చెప్పకుండా నెతన్యాహూ ఇంత ధైర్యంగా దాడులు చేయరన్నది నిజం. ట్రంప్ బలవంతంగా కుదర్చిన ఆ శాంతి ఒప్పందంలో దాడులు తప్పుకానీ, ప్రతీకారదాడులు చేయవచ్చునని ఉన్నదేమో మరి.

ఇజ్రాయెల్‌ను నియంత్రించనిపక్షంలో కాల్పుల విరమణ నిలవదు, మృతదేహాల అప్పగింత ముందుకు సాగదు. ఉద్రిక్తతలు పెరిగిపోతూ, శాంతి ఆశలు మళ్ళీ పతనమైపోవడం బందీల బంధువులకు తీరని వ్యథ. సుదీర్ఘనిరీక్షణ తరువాత ఇప్పుడే వారిలో ఆశలు చిగురిస్తున్నాయి. అల్‌షిఫా ఆస్పత్రి పరిసరాల్లో వైమానిక దాడులు జరపడం, పసిపిల్లలను సైతం పొట్టనబెట్టుకోవడం క్షమించరాని నేరం. హమాస్‌ను విశ్వసించమని ఎవరూ అనడం లేదు. దేహాల అప్పగింతలో అది ఉద్దేశపూర్వకమైన జాప్యం చేస్తుండవచ్చు. హామీకి అనుగుణంగా వ్యవహారం నడవకపోవచ్చును. కానీ, ఆ సంస్థ లక్ష్యంగా సాగిన రెండేళ్ళ యుద్ధం లక్షమంది అమాయకుల ప్రాణాలు తీసిందే తప్ప ప్రకటిత లక్ష్యాలు సాధించలేకపోయింది. ఆహారసరఫరాలను అడ్డుకుంటూ, సాయాన్ని నిలిపివేస్తూ గాజావాసులమీద ఇజ్రాయెల్ ఇంకా ఎంతకాలం కక్షసాధించినా, ఊచకోతలు కోసినా హమాస్‌కు పోయేదేమీ లేదు. గాజాను వల్లకాడు చేయడం వినా, ఒక్కబందీని కూడా విడిపించుకోలేకపోయిన ఇజ్రాయెల్‌కు ఈ ఒప్పందం ఒక మంచి అవకాశం. రెడ్‌క్రాస్ వంటి సంస్థలు మధ్యలో ఉన్నందున అది సహనంతో, సంయమనంతో వ్యవహరించడం అవసరం. పాలస్తీనియన్లకు న్యాయం చేయని, ఇజ్రాయెల్ పక్షాన రాసిన ఈ ఒప్పందాన్ని నిలబెట్టడం ట్రంప్ చేతుల్లో ఉంది. కాల్పుల విరమణ ఒప్పందం అమలులో ఉన్నదని అంటూనే ఇజ్రాయెల్, అమెరికా కలసి ఆడుతున్న ఈ నాటకాన్ని మిగతా ప్రపంచం కొనసాగనివ్వకూడదు.

దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి, విభజన గాయాలు చెలరేగుతున్న అస్థిర కాలంలో మొదటి హోం శాఖా మంత్రిగా బాధ్యతలు చేపట్టిన పటేల్, సంస్థానాలను విలీనం చేసి దేశాన్ని ఏకం చేయటంలో ప్రముఖ పాత్ర పోషించారు. తన దౌత్య చాతుర్యంతో, ధైర్యంతో, స్పష్టమైన నిర్ణయాలతో అనేక సమస్యలను పరిష్కరించారు. జాతి సమైక్య సారథిగా, నవభారత వారధిగా దేశ చరిత్రలో పటేల్ స్థానం సుస్థిరం.


దేశాన్ని ఏకం చేసిన దక్షత

ఉక్కు మనిషిగా పేరుగాంచిన గొప్ప దేశభక్తుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, రాజనీతిజ్ఞుడు సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్. దేశ సమైక్యత, సమగ్రత పట్ల ఆయన దూరదృష్టి, సాహసం, స్వాతంత్ర్యం సిద్ధించిన తొలినాళ్లలో పలు విపత్కర సమస్యలను ఎదుర్కొని దేశాన్ని ముందుకు నడిపించిన విధానాన్ని ప్రజలందరూ ఇప్పటికీ గుర్తుచేసుకుంటున్నారు.

గుజరాత్‌లోని నాడియాడ్‌లో 1875 అక్టోబర్ 31న జన్మించిన వల్లభ్‌భాయ్, బారిష్టరు చదువు పూర్తి చేసుకొని అహ్మదాబాద్‌లో లాయరుగా పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. మహాత్మాగాంధీ పిలుపు మేరకు స్వాతంత్ర్య ఉద్యమంలో అడుగుపెట్టి, గాంధీతో పాటు ఎన్నో పోరాటాల్లో భాగస్వాములయ్యారు. లాయర్‌గా తన ప్రాక్టీస్‌ను వదిలిపెట్టి ఉద్యమాలు సాగించారు. పాశ్చాత్య వస్త్రధారణ వదిలేసి, నిరాడంబరత అలవర్చుకుని, స్వదేశీ భావనకు అలవాటుపడ్డారు. మహాత్మాగాంధీ ఆలోచనలను, భావాలను సరైన దృష్టికోణం నుంచి అర్థం చేసుకున్న రాజకీయ నాయకులలో సర్దార్ పటేల్ ఒకరు. గాంధీజీ 'స్వరాజ్యం నుంచి సురాజ్యం' గురించి చెబితే, పటేల్ స్వరాజ్యాన్ని సురాజ్యంగా మార్చు చేసే సుపరిపాలనకు, సంస్కరణలకు దారితీసిన ఆద్యుడు. గుజరాత్‌లోని ఖేదా, బార్డోలీ ప్రాంతాల్లో గాంధీ ప్రేరణతో పటేల్ నడిపిన సత్యాగ్రహం, అపూర్వమైన రైతాంగ ఉద్యమం ఆయనకు చరిత్రలో చిరస్థానాన్ని కల్పించాయి.

దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి, విభజన గాయాలు చెలరేగుతున్న అస్థిర కాలంలో మొదటి హోం శాఖా మంత్రిగా బాధ్యతలు చేపట్టిన పటేల్ మొదట సంస్థానాలను విలీనం చేసి దేశాన్ని ఏకం చేయటంలో ప్రముఖ పాత్ర పోషించారు. తన దౌత్య చాతుర్యంతో, ధైర్యంతో, స్పష్టమైన నిర్ణయాలతో అనేక సమస్యలను పరిష్కరించారు. బ్రిటిష్ పాలకులు దేశానికి స్వాతంత్ర్యం ఇచ్చినప్పటికీ సంస్థానాల విషయంలో మెలిక పెట్టి వెళ్లడం సమస్యగా మారింది. అప్పటికి దేశంలో ఉన్న 565 సంస్థానాలకు స్వయం నిర్ణయాధికారాన్ని కట్టబెట్టారు ఆంగ్లేయులు. అందులో 562 సంస్థానాలను సామ దాన భేద దండోపాయాలతో పటేల్ భారత్‌లో చేర్చగా... కశ్మీర్, జునాగఢ్, హైదరాబాద్ సంస్థానాలు మాత్రం స్వతంత్ర రాజ్యాలుగా ఉంటామని భీష్మించాయి.

గుజరాత్‌లోని జాంనగర్ పూర్వ రాజైన జాంసాహిబ్‌కు చెందినది. అధికార బదిలీకి ఇంకా రెండు నెలల గడువు ఉండగా ఈలోపే జాంసాహిబ్ కథియావర్ ప్రాంత రాష్ట్రాలన్నిటినీ కలిపి పాకిస్థాన్ సహాయంతో ఒక స్వతంత్ర రాజ్యంగా ఏర్పాటు చేయాలనుకున్నాడు. ఈ ఉద్దేశ్యంతో ఢిల్లీలోని తోటి సంస్థానాధీశులను కలవబోతున్నాడని పటేల్‌కు తెలిసింది. ఆ వెంటనే జాంసాహిబ్ సోదరుడైన కల్నల్ హిమ్మత్‌సింగ్ ద్వారా వారిని తన ఇంటికి విందుకు తీసుకురావాలని పటేల్ కోరాడు. భోజన సందర్భంలో పటేల్ తన ఆత్మీయతతో, ప్రేమతో జాంసాహిబ్ హృదయాన్ని గెలుచుకున్నారు. జాంసాహిబ్ స్వతంత్ర రాజ్యం ఏర్పాటు చేయాలన్న ప్రణాళికను విరమించుకున్నాడు.




మరో సంఘటన షేక్ అబ్దుల్లాకు సంబంధించినది. కశ్మీర్‌ను పాలిస్తున్న రాజా హరిసింగ్ భారత యూనియన్‌లో కలవాలనుకోగా, కశ్మీర్‌లో 'నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ' నాయకుడు షేక్ అబ్దుల్లా మాత్రం కశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి ఆశించి, దానికై ఎడతెగని ప్రయత్నాలు ఆరంభించాడు. దేశానికి మకుటమైన కశ్మీర్– రక్షణ దృష్ట్యా, సంస్కృతి దృష్ట్యా, ప్రకృతి సౌందర్యం దృష్ట్యా ఎంతో కీలకమైన ప్రదేశం. రాజ్యాంగ పరిషత్‌లో కశ్మీర్‌కు సంబంధించిన 'ఆర్టికల్ 370'పై చర్చిస్తున్న సమయంలో అసహనంతో ఉన్న షేక్ అబ్దుల్లా తన స్థానం నుంచి లేచి "నేను తిరిగి కశ్మీర్‌కు వెళుతున్నాను" అని సభలో ప్రకటించాడు. దీంతో ప్రధాని నెహ్రూ లేని కారణంగా రాజ్యాంగ పరిషత్‌లో ఉన్న పటేల్, "ఈ రోజు సభ నుంచి వెళ్లి రైలులో కూర్చోవచ్చు. కానీ ఆ రైలు మాత్రం ఢిల్లీని దాటి వెళ్లబోదు" అనే సందేశాన్ని తెలియజేశారు. పరిణామాలను గ్రహించిన షేక్ అబ్దుల్లా తన ప్రయాణాన్ని రద్దు చేసుకున్నారు.

హైదరాబాద్ సంస్థానం ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ పాలనలో ఉంది. సొంత కరెన్సీ, సొంత రైల్వే, సొంత సైన్యం ఉన్న హైదరాబాద్‌ను స్వతంత్ర రాజ్యంగా ఉంచాలని నిజాం ప్రయత్నించారు. భారత్‌లో విలీనానికి గడువు కావాలని, అప్పటివరకు స్వతంత్రంగా ఉంటామని ప్రతిపాదించారు. అందుకు పటేల్ అంగీకరించలేదు. ఎందుకంటే, భారత్‌తో గడువు కోరిన నిజాం, మరోవైపు పాకిస్థాన్‌కు రూ.20 కోట్లు ఇచ్చినట్లుగా ఆధారాలు దొరికాయి. అంతేగాక, హైదరాబాద్ సంస్థానం తరపున కరాచీలో ప్రజా సంబంధాల అధికారిని కూడా నిజాం నియమించారు. దీంతో నిజాం వైఖరిపై పటేల్‌కు సందేహం కలిగింది. పటేల్ ఆదేశాలతో మేజర్ జనరల్ జె.ఎన్.చౌధురి నేతృత్వంలో 'ఆపరేషన్ పోలో' 1948 సెప్టెంబర్ 13న మొదలై అదే నెల 18 సాయంత్రానికి పూర్తయింది. సైనిక చర్య ద్వారా హైదరాబాద్ సంస్థానాన్ని రెండు వైపుల నుంచి ముట్టడించి పటేల్ స్వాధీనం చేసుకున్నారు. సెప్టెంబర్ 17న భారత్ యూనియన్‌లో విలీనం చేసి హైదరాబాద్ రాష్ట్రంలో మువ్వన్నెల భారత పతకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా పటేల్‌ను ఉద్దేశించి రష్యా ప్రధాని నికోలయి బుల్గనిన్ "మీరు రాజులను అంతం చేయకుండానే, రాజుల పాలనను అంతం చేశారు" అంటూ చేసిన వ్యాఖ్యలు పటేల్ పరిపాలనా దక్షతకు అద్దం పడుతుంది.

పటేల్ ఒక వైపు సంస్థానాల విలీనంతో పాటు మరోవైపు భారత పరిపాలన వ్యవస్థను పటిష్టం చేసేందుకు కూడా కృషి చేశారు. స్వాతంత్ర్యానంతరం పాలనలో సారూప్యతను, దేశ సమైక్యతను సాధించాలనే సంకల్పంతో అఖిల భారత సర్వీసులను (ఐఏఎస్, ఐపీఎస్) ఏర్పాటు చేశారు. అందుకే ఆయనను అఖిల భారత సివిల్ సర్వీసుల పితామహుడుగా ("Father of All India Services") అభివర్ణిస్తారు. పోలీస్ వ్యవస్థను బలోపేతం చేయడంలో పటేల్ కృషి మరువలేనిది. మొదటి సాంస్కృతికశాఖ మంత్రిగా కూడా బాధ్యతలు అందించిన పటేల్ గుజరాత్‌లోని సోమనాథ్ దేవాలయ పునర్నిర్మాణానికి పూనుకున్నారు. అంతర్గత భద్రత వ్యవస్థ, సరిహద్దు పరిరక్షణ, రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ మొదలైన అంశాలపై స్పష్టమైన దిశానిర్దేశం చేశారు.

నేడు దేశ సమగ్రత, సమైక్యత అత్యంత ప్రధానమైన అంశం. భాష పేరుతో, మతం పేరుతో, కులం పేరుతో రెచ్చగొట్టి దేశాన్ని ముక్కలు ముక్కలు చెయ్యాలని చూస్తున్న విదేశీ స్వార్థ శక్తులకు స్వదేశంలో కూడా వంత పాడేవాళ్లు తోడయ్యారు. దేశంలోను 'దక్షిణమూ ఉత్తరమూ వేర్వేరు' అనే భావనను రేకెత్తించేందుకు కొందరు పన్నుతున్న కుయుక్తులను అణచివేసి మనమందరం '145 కోట్ల భారతీయులం' అన్న భావన తీసుకురావడమే ప్రధాన లక్ష్యం. ఆనాడు పటేల్ ఈ దృఢ సంకల్పంతోనే రజాకార్లను, ప్రత్యేకవాదులను అణచివేశాడు. నేడు పటేల్ స్ఫూర్తితో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని భారత ప్రభుత్వం ఆపరేషన్ సిందూర్ పేరుతో ఉగ్రవాదులకు గట్టి గుణపాఠం నేర్పింది.

జాతి సమైక్య సారథిగా, నవభారత వారధిగా మన దేశ చరిత్రలో పటేల్ స్థానం సుస్థిరం. పటేల్ అంత్యక్రియలకు హాజరైన నాటి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ "సర్దార్ శరీరాన్ని ఈ అగ్ని దహించివేయొచ్చు. కానీ, ఆయన కీర్తిని దహించే అగ్ని ఈ ప్రపంచంలో లేదు" అన్నారు. కాలాలు మారినా ఇనుమడిస్తున్న ఆయన కీర్తే అందుకు ఋజువు.



● బండారు దత్తాత్రేయ
మాజీ గవర్నర్

(రేపు సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ 150వ జయంతి)

గూగుల్ డేటా సెంటర్: అపోహలు – వాస్తవాలు

విశాఖపట్నంలో గూగుల్ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో డేటా సెంటర్‌ను నిర్మించబోతోందనే వార్తలు వెలువడగానే అనేక ఇతర రాష్ట్రాలతో పాటు రాష్ట్రంలోని ప్రతిపక్షం కూడా ప్రభుత్వంపైన ప్రతికూలంగా స్పందించింది. తద్వారా అసలు 'డేటా సెంటర్' అంటే ఏమిటి? దీని ప్రాధాన్యం ఏమిటి? సమాజానికి దీని అవసరం ఉందా? అనే ప్రశ్నలు సహజంగానే తలెత్తుతాయి.

మనం యూట్యూబ్‌లో సినిమానో, ఫేస్‌బుక్‌లో రీల్‌నో స్ట్రీమ్ చేసినప్పుడూ; గూగుల్ పేనో ఫోన్ పేనో చెల్లింపుల కోసం వాడినప్పుడూ, గూగుల్‌నో, చాట్ జీపీటీనో ప్రశ్న అడిగినప్పుడూ, వాట్సాప్‌లో మెసేజ్‌లు పంపినప్పుడూ... ఈ డేటా అంతా ఎక్కడో ఒకచోట ఉండాలి. ఇది కేవలం 'క్లౌడ్'లో తేలుతూ ఉండదు. ఇది ప్రత్యేకమైన, అత్యంత సురక్షితమైన భవనంలో నెలకొల్పబడిన డేటా సెంటర్‌లో ఉంటుంది. డేటా సెంటర్‌లు కేవలం నిల్వ సౌకర్యాలు మాత్రమే కాదు, అవి మొత్తం డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు పునాదిగా ఉంటాయి.

నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారతదేశం ఇంతటి ప్రాధాన్యం గల డేటా సెంటర్ల వ్యవస్థాపనలో టాప్ 10 దేశాల్లో కూడా లేదు. ప్రపంచ వ్యాప్తంగా డేటా సెంటర్ పోటీలో ఇతర దేశాలకు అందనంత ఎత్తులో అమెరికా ఉన్నది. అక్కడ మార్చి 2025 నాటికి 5,426 డేటా సెంటర్లు ఉన్నాయి. అమెరికా తరువాత చైనాలో వేలాది డేటా సెంటర్లు ఉన్నాయి. వాటిలో హైపర్ స్కేల్ డేటా సెంటర్లు 100కు పైగా ఉన్నాయి. అలాగే జర్మనీలో 529, బ్రిటన్‌లో 523, ఫ్రాన్స్‌లో 322, ఆస్ట్రేలియాలో 314, నెదర్లాండ్స్‌లో 298, రష్యాలో 251, ఇటలీలో 173, మెక్సికోలో 168 డేటా సెంటర్లు ఉన్నాయి.

డేటా సెంటర్ల నిర్వహణలో విద్యుత్ వినియోగం ఎక్కడుంది? భారతదేశం 138 డేటా సెంటర్లతో ప్రపంచంలో 13వ స్థానంలో ఉంది! అదనంగా, 2025 చివరికల్లా 1015 మెగావాట్ల సామర్థ్యంతో 45 కొత్త డేటా సెంటర్‌ల నిర్మాణం జరుగుతోంది. భారతదేశంలో డేటా వినియోగం వేగంగా పెరుగుతున్నది. ప్రపంచ డేటాలో 20శాతం భారతదేశం నుంచే వస్తోంది. జూన్ 2023లో ప్రచురితమైన ఎరిక్సన్ మొబిలిటీ నివేదిక ప్రకారం... 2028 నాటికి భారతదేశంలో ప్రతి వినియోగదారుడు నెలకు 62 జీబీ డేటాను వాడతాడని అంచనా. ఇది అమెరికా, పశ్చిమ యూరప్, దక్షిణ కొరియా, చైనా వంటి అభివృద్ధి చెందిన మార్కెట్‌లను కూడా అధిగమిస్తుంది. అయినప్పటికీ దేశం ఇప్పటికీ ప్రపంచంలో కేవలం 3 శాతంతో అతితక్కువ డేటా సెంటర్ సాంద్రతగల దేశాల్లో ఒకటిగా ఉంది. భారతదేశంలో క్రియాశీల ఇంటర్నెట్ వినియోగదారుల సంఖ్య 2025 ముగిసే నాటికి 90కోట్లకు చేరుకుంటుంది. దీనితో పోల్చినప్పుడు 2022లో అమెరికాలో రూ.30కోట్ల ఇంటర్నెట్ వినియోగదారులు మాత్రమే ఉన్నారు.

భారతదేశంలోని డేటా సెంటర్లలో ఎక్కువ శాతం ముంబైలో ఉన్నాయి. చెన్నై రెండవ స్థానంలో ఉంది. దేశంలోని ఇతర డేటా సెంటర్ హబ్‌లు బెంగళూరు, హైదరాబాద్, నోయిడా (ఢిల్లీ-NCR), పూణే, కోల్‌కతా వంటి నగరాలలో ఉన్నాయి.

అక్టోబర్ 14న విశాఖపట్నంలో ఒక భారీ హైపర్ డేటా సెంటర్‌ను నెలకొల్పనున్నామని గూగుల్ ప్రకటించింది. ఈ డేటా సెంటర్ 1-గిగావాట్ (1000 మెగావాట్లకు సమానమైన) సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. అంటే ఇది యావత్ ప్రపంచంలోనే అత్యంత సామర్థ్యం గల డేటాసెంటర్ అవుతుంది. ఇప్పటివరకు అమెరికాలోని నెవేడాలో 660 మెగావాట్ల సామర్థ్యంతో ఒక డేటా సెంటర్ అత్యంత సామర్థ్యం గలదిగా ఉండేది. విశాఖపట్నం డేటా సెంటర్ 12 దేశాలలో విస్తరించి ఉన్న 'గూగుల్ గ్లోబల్ నెట్‌వర్క్ ఆఫ్ ఏఐ' సెంటర్లలో భాగం అవుతుంది.

రాబోయే అయిదేళ్లలో (2026–2030) సుమారు రూ. లక్షా 30వేల కోట్లతో దేశంలో మొట్టమొదటి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) హబ్‌ను విశాఖపట్నంలో గూగుల్ ఏర్పాటు చేస్తుంది. ఏఐ అభివృద్ధికి కేంద్రంగా పనిచేయడంతో పాటు, విశాఖపట్నం ఒక ప్రధాన కనెక్టివిటీ హబ్‌గా మారనుంది. ఎందుకంటే గూగుల్ దాని సబ్ సీ (సముద్రం అడుగున) కేబుల్ మౌలిక సదుపాయాలను అక్కడకు తీసుకువచ్చి, వాటిని దాని ప్రపంచవ్యాప్త నెట్‌వర్క్‌తో అనుసంధానించనుంది. అంటే గూగుల్ ఏఐ టెక్నాలజీని తీసుకురావడమే కాకుండా, దాని సబ్ సీ కేబుల్, నెట్‌వర్క్ కనెక్టివిటీ హబ్ ద్వారా డిజిటల్ మౌలిక సదుపాయాలను కూడా నిర్మిస్తుంది. దీనితో ఆసియా-పసిఫిక్ ప్రాంతాలకు ప్రత్యక్ష సంబంధం ఏర్పడటమే కాకుండా, దానితో వచ్చే హై స్పీడ్ ఇంటర్‌నెట్ ఇతర కంపెనీల డేటా సెంటర్లు విశాఖపట్నానికి రావటానికి అవకాశం ఏర్పడుతుంది.



గూగుల్ డేటా సెంటర్‌తో దాదాపు 2 లక్షల మందికి ఉపాధి లభిస్తుంది. అంతేకాదు గూగుల్ డేటా సెంటర్ నిర్మాణంతో ఏర్పడే ఇకో సిస్టమ్ కారణంగా మెటా, అమెజాన్, మైక్రోసాఫ్ట్ వంటి అనేక సంస్థలు తమ డేటా సెంటర్లను, ఏఐ అభివృద్ధి సెంటర్లను ఇక్కడకు తీసుకువచ్చే అవకాశం ఉంటుంది. 2029 నాటికి డేటా సెంటర్ సామర్థ్యాన్ని 6 గిగావాట్లకు చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్న ఆంధ్రప్రదేశ్‌లో విశాఖపట్నం కేంద్రంగా మరో సైబరాబాద్ ఆవిర్భవిస్తుంది.

(డేటా సెంటర్ల నిర్వహణలో విద్యుత్ వినియోగం) కీలకం కాబట్టి, వాటిని అవి వినియోగించే విద్యుత్ పరిమాణంతో కొలుస్తారు. 2023లో అమెరికాలోని డేటా సెంటర్‌లు 176 టెరావాట్-గంటల (TWh) విద్యుత్‌ను ఉపయోగించాయి (1 టెరావాట్ గంటలు అంటే 10 లక్షల మెగావాట్ గంటలకు సమానం). ఇది అమెరికా మొత్తం విద్యుత్ వినియోగంలో దాదాపు 4.4శాతం. ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్ పెరుగుదలతో డేటా సెంటర్ల విద్యుత్ వినియోగం 2030 నాటికి 12శాతానికి పెరగవచ్చు. నీటి వినియోగం కూడా ఎక్కువే. అయితే లిక్విడ్ కూలెంట్ సాంకేతికతతో అది నిర్వహించగలిగే స్థాయిలోనే ఉంటుంది. ఈ లెక్కలను చూసినప్పుడు డేటా సెంటర్ల నిర్మాణంలో అమెరికాకు చేరువగా ఇప్పట్లో ఏ దేశమూ చేరుకోలేదని అర్థమవుతుంది.

ఈ డేటా సెంటర్ల వ్యవస్థాపనలో భారతదేశం (ఎక్కడుంది?...)

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గూగుల్‌తో మాత్రమే ఒప్పందం చేసుకున్నప్పటికీ గూగుల్ అదానీ ఎంటర్‌ప్రైజెస్ డేటా సెంటర్ జాయింట్ వెంచర్ సంస్థ అదానీ కోనెక్స్, భారతీ ఎయిర్‌టెల్‌లను వ్యూహాత్మక భాగస్వాములుగా చేసుకుంది. దానితో రూ.85,000 కోట్ల ప్రాజెక్టుల అంచనా రూ. లక్షా 25వేల కోట్లకు పెరిగింది. విశాఖపట్నంలో ప్రత్యేకంగా నిర్మించిన డేటా సెంటర్‌ను సంయుక్తంగా స్థాపించడం, అలాగే గూగుల్‌కు చెందిన కొత్త అంతర్జాతీయ సబ్ సీ కేబుళ్లను హోస్ట్ చేయడానికి అత్యాధునిక కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ (CLS)ను ఏర్పాటు చేయడం ఎయిర్‌టెల్ ఆధ్వర్యంలో జరుగుతుంది. దీనితో ఈ డేటా సెంటర్ విస్తృతమైన గ్లోబల్ టెరెస్ట్రియల్, సబ్ సీ ఇన్‌ఫ్రాస్టక్చర్‌లో చేరనుంది.

డేటా సెంటర్లు తీవ్ర స్థాయిలో విద్యుత్తును, నీటిని వినియోగిస్తాయి. గూగుల్ డేటా కేంద్రం అత్యంత ఆధునిక లిక్విడ్ కూలింగ్ సాంకేతికతతో నిర్మితమవుతుంది. దీనితో విద్యుత్ ఆవశ్యకతలో 20శాతం తగ్గుతుంది. ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తిలో దేశంలోనే అగ్రస్థాయిలో ఉంది. రాష్ట్రంలో ఇప్పటికే 8,000 మెగావాట్ల సోలార్, 4,083 మెగావాట్ల పవన, ఇతర పద్ధతులతో 500 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి జరుగుతోంది. అంతేకాదు, గూగుల్ తన డేటా సెంటర్ అవసరాల కోసం 1000 మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్తు ప్లాంట్‌ను నెలకొల్పడానికి సిద్ధపడింది. విశాఖపట్నంలో ఏర్పాటు చేయబోయే డేటా సెంటర్లకు కావలసిన నీరు పోలవరం ఎడమ కాలువ నుంచి సరఫరా అవుతుంది. నీటి లభ్యతలో ముంబాయి, చెన్నై, బెంగళూరుల కంటే విశాఖపట్నం మెరుగైన నగరం అని వేరే చెప్పనక్కరలేదు.

గూగుల్ డేటా సెంటర్‌ను విశాఖపట్నానికి తీసుకురావటంలో చంద్రబాబు తన పలుకుబడిని పూర్తి స్థాయిలో ఉపయోగించి కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించినట్లు తెలుస్తోంది. దీని కోసం కేంద్ర ప్రభుత్వంతో కొన్ని చట్టాలను కూడా సవరింపజేయవలసి వచ్చిందని ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ అన్నారు. బీజేపీ పాలనలోని మహారాష్ట్ర ఈ గూగుల్ డేటా సెంటర్ కోసం తీవ్రస్థాయిలో ప్రయత్నించింది. తమిళుడైన సుందర్ పిచాయ్‌ను ప్రభావితం చేసి, 'ఈ గూగుల్ సెంటర్‌ను తమిళనాడుకు తీసుకురాలేదని అక్కడి ప్రతిపక్షం ప్రభుత్వంపైన విమర్శలు చేస్తోంది. ఆంధ్రప్రదేశ్ తీవ్ర లోటు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రమని, దానికి ఈ ప్రాజెక్టును చేపట్టే అర్హతలేదని కర్ణాటక ఐటీ మంత్రి తీవ్రమైన విమర్శలు గుప్పించారు.

ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపక్షం కూడా గూగుల్ డేటా సెంటర్ విషయంలో ప్రభుత్వంపై విరుచుకుపడింది. పది రోజులపాటు వైసీపీ నాయకులు, మేధావులు తమ మీడియా సంస్థల ద్వారా 'గూగుల్ డేటా సెంటర్ ఒక గోడౌన్' అని, దానితో వచ్చే ఉద్యోగాలు నామమాత్రమేనని, కాలుష్యం పెరిగిపోతుందని రకరకాలుగా బురదజల్లారు. ఈ దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మకపోవడంతో జగన్ ఆకస్మికంగా మడమతిప్పి, నాలుక మడతేశారు. 'తాను గూగుల్ డేటా సెంటర్‌ను స్వాగతిస్తున్నానని; ప్రస్తుతం నడిచేది, రాబోయేది ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్ యుగమేనని; గూగుల్ డేటా సెంటర్‌తో విశాఖపట్నంలో డేటా సెంటర్లకు అనుకూల ఇకో సిస్టమ్ ఆవిర్భవిస్తుందని, దానితో ఎటువంటి కాలుష్యం ఉండదని' అక్టోబర్ 24వ తేదీన తన అనుకూల మీడియా ద్వారా ప్రకటించారు. ఈ ప్రకటనతో ప్రజలు తెల్లబోగా, అప్పటిదాకా నానాయాగీ చేసిన మేధావులు సిగ్గుతో కుంచించుకుపోయారు.

గూగుల్ డేటా సెంటర్‌తో దాదాపు 2 లక్షల మందికి ఉపాధి లభిస్తుంది. అంతేకాదు గూగుల్ డేటా సెంటర్ నిర్మాణంతో ఏర్పడే ఇకో సిస్టమ్ కారణంగా మెటా, అమెజాన్, మైక్రోసాఫ్ట్ వంటి అనేక సంస్థలు తమ డేటా సెంటర్లను, ఏఐ అభివృద్ధి సెంటర్లను రాష్ట్రానికి తీసుకువచ్చే అవకాశం ఉంటుంది. ఇటీవల రుషికొండలో నాస్డాక్-లిస్టెడ్ సిఫీ టెక్నాలజీస్‌కు చెందిన డేటా సెంటర్ విభాగం అయిన 'సిఫీ ఇన్ఫినిట్ స్పేసెస్ లిమిటెడ్' విశాఖపట్నంలో నిర్మించనున్న మొదటి 50 మెగావాట్ల ఏఐ – పవర్డ్ ఎడ్జ్ డేటా సెంటర్, ఓపెన్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ (CLS)లకు రాష్ట్ర ఐటీ మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్ట్ తక్కువ-లేటెన్సీ కంప్యూట్ మౌలిక సదుపాయాలను, సబ్ సీ నెట్‌వర్క్‌ల ద్వారా ప్రత్యక్ష అంతర్జాతీయ బ్యాండ్‌విడ్త్ కనెక్టివిటీని అందిస్తుంది. 2029 నాటికి డేటా సెంటర్ సామర్థ్యాన్ని 6 గిగావాట్లకు చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్న ఆంధ్రప్రదేశ్‌లో విశాఖపట్నం కేంద్రంగా మరో సైబరాబాద్ ఆవిర్భవిస్తుందని చెప్పవచ్చు.

■ నెల్లూరు నరసింహారావు
సీనియర్ జర్నలిస్ట్

చేతులు మారుతున్న రాజ్యాంగ ఆయుధం

నక్సల్స్ ఉద్యమంలో ఉన్నత స్థానంలో ఉన్న నాయకులు మల్లోజుల వేణుగోపాల్‌రావు, తక్కళ్లపల్లి వాసుదేవరావులు చాలామంది సహచరులతో కలిసి ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమక్షంలో ఇటీవల లొంగిపోయారు. ఈ సందర్భంగా తమ ఆయుధాలను రాజ్యం చేతుల్లో పెట్టారు. దానికి బదులుగా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రులు వారి చేతికి భారత రాజ్యాంగ ప్రతిని అందజేశారు. ఈ సందర్భంగా– ఆ నాయకులు ఆయుధాలతో పాటు తమ అభిప్రాయాలనూ ఆశయాలనూ మార్చుకున్నారా? లేక తాత్కాలిక యుద్ధ విరమణ చేశారా? ఆయుధం స్థానాన్ని రాజ్యాంగం పూరించగలుగుతుందా? లేక రహస్య పోరాటాలు తిరిగి కొనసాగుతాయా?– తదితర ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.



ఈ చర్చ కన్నా ముందు ప్రపంచవ్యాప్తంగా 21వ శతాబ్ది పూర్వార్ధంలో సమాజంలో పునాది స్థాయిలో జరిగిన మార్పు చేర్పులను రాజకీయ, సామాజిక, ఆర్థిక, పౌర, సాంకేతిక, శాస్త్ర రంగాల వెలుగులో పరిశీలిస్తే కొంతమేరకైనా మేలు జరుగుతుంది.

ప్రపంచీకరణ వేగంగా పరుగెడుతున్న చోట దీర్ఘకాలిక ప్రాతిపదికన ప్రజా పోరాటాలు కొనసాగించడం అంత సులభమైన విషయం కాదు. సమాజం పునాదిలో జరుగుతున్న మార్పుల వలన ఉపరితలంలో అగుపించే ఉద్యోగాలలో, వ్యక్తులలో, వ్యవస్థలో స్థిరత్వం ఉండడానికి వీలు లేని ఒక సంక్షోభ వాతావరణం ఏర్పడింది. సమాజం క్రమంగా భూస్వామ్య వ్యవస్థ నుంచి పెట్టుబడిదారీ విధానంగా పరివర్తన చెందింది. జాతీయ పెట్టుబడిదారుడు అంతర్జాతీయ క్యాపిటలిస్టుగా ఎదిగాడు. బహుళ జాతి సంస్థలు మార్కెట్లను ఆక్రమించాయి. పంటలు పండించే సాధారణ స్వభావం మార్చుకొని రియల్ ఎస్టేట్‌గా భూమి రూపాంతరం చెందింది. కనబడే ప్రభుత్వాలను తెర వెనుక ఉండి నడిపే డ్రైవింగ్ ఫోర్స్ ఒత్తిడి శాసనకర్తల నిర్ణయాలపై ప్రభావం చూపుతున్నది. ఆయా ప్రభుత్వాలను చెప్పుకోదగ్గ స్థాయిలో కట్టడి చేస్తోంది. లాభాల దాహం తీరని జాతీయ అంతర్జాతీయ పెట్టుబడిదారులు అందరూ ఒక్కటిగా తమ తమ ఉత్పత్తులను ఆయా దేశాలకు ఎగుమతి చేస్తారు. ఎగుమతి దిగుమతులపై ఆయా దేశాల మీద ఒత్తిడి తెచ్చి సుంకాల రాయితీని పొందుతారు. దీనితో ఎగుమతి దిగుమతుల సుంకాల మధ్య అంతరం ఏర్పడుతుంది. తద్వారా ఎక్కువ దేశాలు నష్టపోతే, కొన్ని సంపన్న దేశాలు లాభపడతాయి. ఇదే నేటి ప్రపంచీకరణ తెచ్చిన వాణిజ్యయుద్ధ నీతి తంత్రం. జాతీయంగా అంతర్జాతీయంగా ఏర్పడిన ఇటువంటి పరిస్థితులలో రహస్య సాయుధవాదులు తమ ఆయుధాలతో పోరాట బాట వీడిన సదరు వ్యక్తులకు రాజ్యాంగ ప్రతులను ప్రభుత్వ నాయకులు అందజేస్తున్నారు. ఇక్కడే తిరకాసు అంతా ఉంది. ఆయుధాలతో సహా లొంగిపోవడం అంటే తమ ఆశయం పట్ల విశ్వాసం సడలిపోయినట్టు భావించాల్సి వస్తుంది. రాజ్యాంగ ప్రతిని స్వీకరించడం అంటే రాజ్యం పట్ల విధేయత కలిగి ఉండడంగా అన్వయించుకోవాలి.

రాజ్యాంగాన్ని రాజ్యం త్రికరణ శుద్ధిగా ఆచరించి, ప్రజా సమస్యలను పరిష్కరిస్తే సమాజంలో పోరాటాల అవసరమే ఉండదు. కానీ రాజ్యం తీసుకున్న నిర్ణయాలపైన జాతీయ అంతర్జాతీయ పెట్టుబడిదారుల ప్రభావం ఉంటుందని ముందే మాట్లాడుకొని ఉన్నాం. ఇటువంటి పరిస్థితుల్లో రాజ్యాంగాన్ని అమలు చేయడం శాసనకర్తలకు అసాధ్యంగా పరిణమిస్తుంది. వీటన్నిటి పర్యవసానంగా సంపద అంతా పిడికెడుమంది చేతుల్లో కేంద్రీకృతం అవుతున్నది. ధనవంతులకు పేదలకు మధ్య పూడ్చలేని అగాథం పెరిగిపోతున్నది. శాసనసభలు బలహీనపడుతున్నాయి. నాయకులు ఏం చేయాలో దిక్కుతోచక 'అభివృద్ధి, సంక్షేమం' అనే మాటలను చర్విత చర్వణంగా వల్లె వేస్తుంటారు. ప్రజల నిత్యావసర జీవితం తీవ్రమైన ఆటుపోట్లకు గురి అవుతుంది. సహజ ప్రకృతి వనరులు తీవ్రంగా నష్టపోతాయి. విలువలు సంస్కృతి దిన దినం లుప్తమైపోతాయి. రైతులు, కుటీర పరిశ్రమలు తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతాయి. చివరికి ఆయా వృత్తులను ఆశ్రయించి జీవిస్తున్నవారు అటు ఉత్పత్తులకు గిట్టుబాటు ధర రాక, ఇటు ఉత్పత్తి ఉపకరణాల వ్యయం పెరిగిపోవడం వలన తలకు మించిన అప్పుల పాలై ఆత్మహత్యలను ఆశ్రయిస్తారు.

ఈ నేపథ్యంలో నేడు ఆయుధాన్ని వీడి రాజ్యాంగాన్ని చేతబూనుతున్నవారు భవిష్యత్తులో చట్టబద్ధంగా ప్రజాసమస్యల పరిష్కార ఉద్యమాలను చేపట్టినా– వాటికి ఫలితం ఉంటుందా? అన్నదే ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న!

○ జూకంటి జగన్నాథం


వికీపీడియా ఇంటర్న్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

తెలుగు వికీపీడియా పురోగతికి, తెలుగు భాషలో నాణ్యమైన, విశ్వసనీయమైన జ్ఞానాన్ని ప్రపంచానికి ఉచితంగా అందించే లక్ష్యంతో, తెలుగు వికీమీడియన్స్ యూజర్ గ్రూప్ (TWUG), ఐఐఐటీ-హైదరాబాద్‌లోని ఓపెన్ నాలెడ్జ్ ఇనిషియేటివ్స్ (OKI) బృందం సంయుక్త ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక కార్యక్రమం జరగనున్నది. ఇందులో భాగంగా మూడు నెలల ఉచిత ఆన్‌లైన్ ఇంటర్న్‌షిప్, స్వచ్ఛంద కార్యకర్తల కార్యక్రమం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నాం. 2025 నవంబర్ 14 నుంచి 2026 ఫిబ్రవరి 14 వరకు ఈ కార్యక్రమం జరుగుతుంది. ప్రతిరోజూ రాత్రి 7:00 నుంచి శిక్షణ తరగతులు జరుగుతాయి. ఇందులో పాల్గొనడానికి 18 నుంచి 30 సంవత్సరాల యువత అర్హులు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు గూగుల్ ఫారం ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించాలి. దరఖాస్తుతో పాటు తమ సీవీ (బయో-డేటా), ఒక ప్రేరణాత్మక వ్యాసం లేదా నమూనా రచనను జత చేయాలి. నిపుణుల ప్యానెల్ ద్వారా స్క్రీనింగ్ లేదా ఇంటర్వ్యూ నిర్వహించి తుది ఎంపిక చేస్తారు. కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసినవారికి (కనీసం 100 కొత్త వ్యాసాలు లేదా 200 ఇప్పటికే ఉన్న వ్యాసాలను మెరుగుపరచడం) ఓకేఐ, టీడబ్ల్యూయూజీ సంయుక్తంగా అధికారిక ప్రశంసాపత్రం అందజేస్తాయి. ఉద్యోగం చేస్తూ, ఇతర వృత్తులలో ఉంటూ లేదా పార్ట్‌టైమ్‌లో తెలుగు భాషాభివృద్ధికి కృషి చేయాలనే ఆసక్తి ఉన్నవారు, వయస్సుతో సంబంధం లేకుండా స్వచ్ఛంద కార్యకర్తలుగా చేరవచ్చు. వీరికి మూడు వారాల పాటు ఉచిత శిక్షణ ఇస్తారు.

దరఖాస్తు ఫారం: https://forms.gle/3FfJ44o2gXMfEJzb8లో లభిస్తుంది. దరఖాస్తులు పంపడానికి నవంబర్ 10 ఆఖరు తేదీ. మరిన్ని వివరాలకు వాట్సాప్: 9014120442; Email: contact@tewikipedia.org

– తెలుగు వికీమీడియన్స్ యూజర్ గ్రూప్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com


భారీ వర్షంతో నీటమునిగిన వరంగల్ రైల్వేస్టేషన్


రాయపర్తిలో రహదారిపై ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు



వర్షపు నీటిలో మునిగిపోయిన హనుమకొండ చౌరస్తా


శివనగర్‌లో మోకాలులోతు నీళ్లలో నుంచి నడిచివెళుతున్న యువకులు

కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

భారీ వర్షాల నేపథ్యంలో హనుమకొండ, వరంగల్ జిల్లా కలెక్టరేట్లలో ప్రజలకు అత్యవసర సేవలు అందించే నిమిత్తం కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. మొంథా తుఫాన్ ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రజలను ఆదుకునేందుకు ఏర్పాటు చేసిన ఈ కంట్రోల్ రూమ్‌లు 24 గంటలు పని చేస్తాయి.

- హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టరేట్లలో 1800 4253424, 9154225936, 1800 4251115
- గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్యాలయంలో 1800 425 1980, 9701999676,
- విద్యుత్‌కు సంబంధించిన సమస్యలకు ఎన్‌పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో 1800 425 0028

నెంబర్లను ఏర్పాటు చేశారు.

అల్లకల్లోలం

ముంచెత్తిన మొంథా తుఫాన్

హనుమకొండ, అక్టోబర్ 29 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుఫాన్ ప్రభావం హనుమకొండ, వరంగల్ జిల్లాలో తీవ్రంగా చూపింది. రెండు జిల్లాలో బుధవారం భారీ వర్షాలు కురిశాయి. ఆకాశానికి చిల్లుపడిందా..? అన్న రీతిలో ఎడతెరిపి లేకుండా కుండపోతగా వర్షాలు పడుతూనే ఉన్నాయి. వరంగల్ జిల్లాలో అత్యధికంగా వర్షాలు కురిశాయి. పర్వతగిరి మండలం కల్లెడలో అత్యధికంగా 340 మి.మీ. వర్షపాతం నమోదు కాగా, సంగెం, నెక్కొండ, ఖిలా వరంగల్, పాలకుర్తి, వర్ధన్నపేట, భీమదేవరపల్లి మండలాల్లోనూ 200 మి.మీ. పైన వర్షం పడింది.

అతలాకుతలం

ఈ రెండు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తుండడంతో అనేక ప్రాంతాలు అతలాకుతలం అయ్యాయి. వరదలు బీభత్సం సృష్టించాయి. లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. అనేక ఇళ్లలోకి వర్షపు నీరు ప్రవహించింది. కొన్నిచోట్ల వరదల్లో వంటసామానులు, నిత్యావసర వస్తువులు కొట్టుకుపోయాయి. వస్తువులన్నీ నీటమునిగి ముద్దయ్యాయి. గుడిసెవాసుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. భారీ వర్షాలకు చాలా చోట్ల గుడిసెలు కొట్టుకుపోయాయి. పలు చోట్ల నేలమట్టమయ్యాయి. అనేక మంది నిరాశ్రయులయ్యారు. వరదల్లో చిక్కుకొని విలవిల్లాడారు. వీరందరిని డిజాస్టర్‌మేనేజ్ మెంట్ బృందాలు సురక్షిత ప్రాంతాలకు

(మిగతా 6లో..)


నర్సంపేట మండలం మాధన్నపేటలో నేలకొరిగిన వరిని చూసి కంటతడిపెడుతున్న రైతు

- హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో కుంభవృష్టి
- రోజంతా కుండపోతగా కురిసిన వర్షం
- రహదారులపైకి చేరిన వరదనీరు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- ఇళ్లలోకి ప్రవేశించిన నీరు
- చెరువులుగా మారిన కాలనీలు
- స్తంభించిన జన జీవనం
- వరంగల్, కాజీపేట రైల్వేస్టేషన్లలోకి చేరిన నీరు
- పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం
- కలెక్టరేట్లలో టోల్ ఫ్రీ నెంబర్ల ఏర్పాటు
- పర్వతగిరిలో అత్యధికంగా 340 మి.మీ. వర్షం
- పరిస్థితిపై మంత్రి పొన్నం సమీక్ష
- అప్రమత్తంగా ఉండాలన్న ఎంపీ కావ్య, ఎమ్మెల్యే నాయిని
- పునరావాస కేంద్రాలకు ముంపు బాధితులు
- ప్రజలు బయటకు రావొద్దన్న అధికారులు

పలు రైళ్లు రద్దు.. దారి మళ్లింపు..

- తుఫాన్ ప్రభావంతో రైల్వేశాఖ నిర్ణయం
- కాజీపేటలో హెల్ప్ డెస్క్

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి
- అధికారులతో ఎంపీ కావ్య టెలీకాన్ఫరెన్స్


పబ్లిక్‌గార్డెన్ వద్ద వర్షంలో పాఠశాలల నుంచి వెళుతున్న విద్యార్థినులు


హనుమకొండ చౌరస్తాలోని ఓ షాపింగ్‌కాంప్లెక్స్ సెల్లార్‌లోకి ప్రవహిస్తున్న వరదనీరు

నేడు పాఠశాలలు, కళాశాలలకు సెలవు

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న భారీవర్షాల కారణంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం వరంగల్, హనుమకొండ జిల్లాల్లోని అన్ని పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు సెలవు ప్రకటించినట్లు డీఐఈవోలు శ్రీధర్ సుమన్, గోపాల్, డీఈవోలు రంగయ్యనాయుడు, వాసంతి తెలిపారు. ఈ మేరకు వారు బుధవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. వరంగల్ జిల్లాలో గురువారం జరగాల్సిన ఎస్ఏ-1 పరీక్ష తర్వాత నిర్వహిస్తామని డీఈవో రంగయ్య తెలిపారు. కాగా, హనుమకొండ జిల్లాలో గురువారం జరుగాల్సిన ఎస్ఏ-1 పరీక్ష నవంబరు 1న నిర్వహిస్తామని డీఈవో వాసంతి తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి : మంత్రి పొన్నం

మొంథా తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. రైతులకు నష్టం వాటిల్లకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని వ్యవసాయ, మార్కెటింగ్, రెవెన్యూ, డీఆర్డీవో తదితర సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు తరలించిన వరి ధాన్యం నిల్వలతో పాటు ఆయా ప్రాంతాల్లో ఆరబెట్టిన పంట ధాన్యం వర్షానికి తడిసి నష్టపోకుండా రైతులకు టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. తుఫాన్ ప్రభావం గురించి రైతులకు తెలియజేస్తూ అప్రమత్తం చేయాలని అన్నారు. తుఫాన్ ప్రభావం తగ్గే వరకు వరి కోతలు జరపకుండా రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు ధాన్యం పంపిన వెంటనే దిగుమతి చేసుకునేలా అధికారులు పర్యవేక్షణ జరపాలని, వెంటవెంటనే ట్రక్ షీట్లు తెప్పించుకొని ట్యాబ్ ఎంట్రీలు చేయించాలని అధికారులను ఆదేశించారు. తడిసిన ధాన్యం పాడవకుండా రైతులు వ్యవసాయ అధికారులు సూచించే పద్ధతులు పాటించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు.

భారీ వర్షపాతం నమోదు

వరంగల్ జిల్లాలోని పర్వతగిరి మండలంలో కల్లెడలో అత్యధికంగా 340 మి.మీ. వర్షపాతం నమోదు కాగా, సంగెం మండలంలో 252.3 మి.మీ., నెక్కొండలో 246.3 మి.మీ., ఖిలా వరంగల్‌లో 237 మి.మీ., సంగెంలో 234.8 మి.మీ., వర్ధన్నపేటలో 228 మి.మీ., నెక్కొండలో 195.5 మి.మీ., వరంగల్‌లో 188 మి.మీ., గీసుకొండలో 185 మి.మీ., చెన్నారావు పేటలో 173.5 మి.మీ., వర్షపాతం నమోదు కాగా, హనుమకొండ జిల్లాలోని భీమదేవరపల్లి మండలంలో అత్యధికంగా 213.8 మి.మీ., హసన్‌పర్తిలో 179 మి.మీ., ధర్మసాగర్‌లో 177.8 మి.మీ., దామెరలో 171.5 మి.మీ., ఐనవోలులో 144.8 మి.మీ., కాజీపేటలో 137..8 మి.మీ., వర్షపాతం నమోదైంది.


జలమయమైన వరంగల్ పోస్టాఫీసు - అండర్ బ్రిడ్జి రహదారి


వరంగల్ - ఖమ్మం రహదారి మిల్స్‌కాలనీ పీఎస్ వద్ద వరదనీరు

మునిగిన నగరం

లోతట్టు ప్రాంతాల్లో జనం ఇబ్బందులు


లోతట్టు వాసులను సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్న పోలీసులు

- పలు కాలనీలో, ఇండ్లలోకి వచ్చిన వర్షపు నీరు
- బాధితులను పునరావాస కేంద్రాలకు తరలింపు
- 7 చోట్ల కేంద్రాలు ఏర్పాటు.. 300 మంది తరలింపు
- రక్షణ చర్యలు చేపడుతున్న అధికారులు
- వరంగల్ నగర పాలక సంస్థ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్

6

నవంబరు 14 నాటికి స్పోర్ట్స్ పాఠశాల ప్రారంభం

సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి కృతజ్ఞతలు

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియంలో తాత్కాలిక ప్రాతిపదికన నవంబరు 14 నాటికి క్రీడా పాఠశాల ఏర్పాటుకు పరిపాలన అనుమతులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డికి స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఒక ప్రకటనలో ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీహరి మాట్లాడుతూ.. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి స్పోర్ట్స్ పాఠశాలలో 4వ తరగతితో ప్రవేశాల కోసం 40మంది బాలురు, 40మంది బాలికలను కౌన్సెలింగ్ నిర్వహించాలని, అందుకు 6గురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసి నవంబరు 5, 6 తేదీల్లో ఎంపిక చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఈ మేరకు క్రీడా పాఠశాలలో పాల్గొనే విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్‌కు క్రీడా శాఖ అధికారులు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రకటనలో తెలిపారు. ఉమ్మడివరంగల్ జిల్లా ప్రాంత ప్రజల ఆకాంక్షల ప్రతి బింబంగా ఈ నిర్ణయం నిలుస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వరంగల్ యువతకు ఇది సువర్ణ అవకాశం అని, క్రీడా ప్రోత్సాహానికి సీఎం రేవంత్‌రెడ్డి అండగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే శ్రీహరి కొనియాడారు.

మహిళలకు దీపదానాలు చేయండి

- దేవాదాయ శాఖ ఈవోలకు మంత్రి కొండా సురేఖ ఆదేశం


రుద్రేశ్వరాలయ కార్తీక ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆలయ ఈవో అనిల్‌కుమార్, అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ

హనుమకొండ కల్చరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): శివకేవకులకు అత్యంత ప్రీతికరమైన పవిత్ర కార్తీకమాస సమయంలో అన్ని ఆలయాల్లో మహిళలకు దీపాలు వెలిగించుకునేందుకు ప్రమిదలు, వత్తులు, నవ్వుల నూనె అందజేయాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. బుధవారం హనుమకొండ రాంనగర్‌లోని మంత్రి నివాసంలో వేయిస్తంభాల ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ, ఆలయ ఈవో అనిల్‌కుమార్‌తో కలిసి మంత్రిని కలిసి రుద్రేశ్వరాలయంలో జరి గే కార్తీక మాస వేడుకలకు ఆహ్వాన పత్రం అందించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. దేవాదాయ శాఖ పక్షాన అన్ని ఆలయాల్లో పెద్దఎత్తున కార్తీక వేడుకలు నిర్వహించేలా ఈవోలకు ఉత్తర్వులు జారీ చేశామన్నారు. ము ఖ్యంగా నవంబరు 5వ తేదీన కార్తీక పౌర్ణమి సందర్భంగా ఉసిరిక, తులసిలకు పూజలు చేయాలన్నారు. భక్తులందరికీ ప్రసాద పంపిణీ చేయాలని, క్యూలైన్లు, మంచి నీటి వసతి, విద్యుత్ దీపాలతో అలంకరణ లాంటి పనులను చేపట్టి ఆలయాలను సుందరంగా తీర్చిదిద్ది భక్తులను ఆహ్వానించాలన్నారు. శివాలయాల్లో రెండుసార్లు నందీశ్వరుడికి అభిషేకాలు నిర్వహించాలని మారేడుదళ బిల్వార్చనలు నిర్వహించాలని సూచించారు. ప్రజల్లో ఆ ధ్యాత్మిక భావన పెంచేలా, వైష్ణవ ఆలయాల్లో పాంచరాత్ర ఆగమానుసారం కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రి కోరారు. ఆలయాల అభివృద్ధికి సీజేఎఫ్ ఫండ్ ద్వారా నిధులు కేటాయించి అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించామని, ఇందులో భాగంగా వేములవాడ ఆలయాన్ని ఆధునీకరిస్తున్నట్లు చెప్పారు. కాగా, వేయిస్తంభాల ఆలయంలో జరిగే కార్తీక వేడుకల్లో పాల్గొనేందుకు మంత్రి తన సమ్మతి తెలిపినట్లు గంగు ఉపేంద్రశర్మ తెలిపారు.

పోలీసుల అమరులను స్మరిస్తూ సైకిల్ ర్యాలీ

పాల్గొన్న సీపీ, మున్సిపల్ కమిషనర్, ఎన్పీడీసీఎల్ సీఎండీ

వరంగల్ క్రైం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని బుధవారం కమిషనరేట్ పోలీసుల ఆధ్వర్యంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ నుంచి హనుమకొండ కలెక్టరేట్ వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి, ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్ హాజరై సైకిల్ రైడర్స్‌లో జోష్ నింపారు. ఈ సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న ప్రతీ ఒక్కరికి పోలీసు అమరవీరుల కుటుంబాలతోపాటు పోలీసుల తరుపున సీపీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీలు శ్రీనువాస్, ప్రభాకర్, బాలస్వామి, ఏఎస్పీ శుభం, ఏసీపీలు జితేందర్‌రెడ్డి, నర్సింహారావు, అనంతయ్య, నాగయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


సైకిల్ ర్యాలీలో పాల్గొన్న సీపీ, మున్సిపల్ కమిషనర్



సమావేశంలో మాట్లాడుతున్న సిరికొండ మధుసూదనాచారి

ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిన సీఎం

శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి

హనుమకొండ టౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని తెలంగాణ శాసనమండలి ప్రతిపక్ష నేత, సిరికొండ మధుసూదనాచారి ఆరోపించారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటికీ సన్మానం పేరిట సభ నిర్వహించడం సరికాదన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక జరుగుతున్న సమయంలో యూసఫ్‌గూడలో సభ పెట్టడం కోడ్‌ను ఉల్లంఘించడమేనన్నారు. సభలో సినీ కార్మికుల పిల్లలకు కార్పొరేట్ విద్య అందిస్తామని, స్కూల్ కోసం భూములు కేటాయించాలని అధికారులను సీఎం రేవంత్ ఆదేశించారు. ఇది ఎన్నికలపై ప్రభావాన్ని చూపించే చర్య అన్నారు. దీనిపై ఎన్నికల కమిషన్ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జడ్పీ మాజీ చైర్మన్ సమ్మారావు, ఏఎంసీ మాజీ చైర్మన్ చింతం సదానందం, బీఆర్ఎస్ నేతలు దాస్యం విజయ్ భాస్కర్, మేడిపల్లి శోభన్ బాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కేయూ సౌత్ జోన్ మహిళల కబడ్డీ జట్టు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో స్పోర్ట్స్ సెక్రటరీ వెంకయ్య, శ్రీనివాసరెడ్డి

కేయూ క్యాంపస్ అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అక్టోబరు 29 నుంచి నవంబరు 2 వరకు తమిళనాడు సేలంలోని వినాయక మిషన్ రీసెర్చ్ ఫౌండేషన్‌లో నిర్వహించే 2025-26 సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ కాకతీయ యూనివర్సిటీ మహిళ కబడ్డీ పోటీలకు జట్టు ఎంపికైంది. ఈ మేరకు బుధవారం కేయూ స్పోర్ట్స్ సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య ఎంపిక క్రీడాకారుల వివరాలను వెల్లడించారు. ఎంపికైన వారిలో సీహెచ్. వైష్ణవి, (తాళ్ళపద్మావతి ఫార్మసీ కళాశాల, వరంగల్), డి .సునీత (టీజీటీడబ్ల్యూఆర్‌డీసీ, మహబూబాబాద్), వి.సంజన, (ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నర్సంపేట), బి.భార్గవి, (ఎంజేపీటీబీసీ కళాశాల, ఖమ్మం), ఎస్.అక్షర, (కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హనుమకొండ), పి.శిరీష, (వీఐపీఎస్, బొల్లికుంట), జె.జ్యోతి (ఎంజేపీటీడబ్ల్యూఆర్‌డీసీ కళాశాల, స్టేషన్‌ఘన్‌పూర్), బి.విద్య శ్రీ, (టీజీటీడబ్ల్యూఆర్‌డీసీ కళాశాల, కొత్తగూడెం), జి.కావ్యశ్రీ (టీజీడబ్ల్యూఆర్‌డీసీ,ఖమ్మం) బి.దివ్య, (ఎల్‌బీ కళాశాల, వరంగల్), పి.శారద, (యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, ఖమ్మం), వై. అనిత, (వీసీపీఈ కళాశాల, బొల్లికుంట), జి. హారిక, (వాగ్దేవి డిగ్రీ కళాశాల, హనుమకొండ), ఎస్.అఖిల, టీజీటీడబ్ల్యూఆర్‌డీసీ కళాశాల, దమ్మపేట) ఎంపికైనట్లు వెంకయ్య వెల్లడించారు. జట్టుకు కోచ్‌గా కిట్స్ కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, మేనేజర్‌గా హనుమకొండ వాగ్దేవి డిగ్రీ కళాశాల పీడీ డాక్టర్ పి.అజయ్‌లు వ్యవహరిస్తారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్యలు అభినందించారు.

ఏనుమాముల మార్కెట్‌కు 4 రోజులు సెలవు

వరంగల్ వ్యవసాయం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు నాలుగు రోజుల పాటు సెలవులు ప్రకటించినట్లు ఆ మార్కెట్ గ్రేడ్-2 కార్యదర్శి రామోజు రాము బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. మొంథా తుపాన్ సందర్భంగా గురు, శుక్రవారాలు సెలవు, శనివారం మార్కెట్ యార్డు బంద్, ఆదివారం సాధారణ సెలవు. తిరిగి సోమవారం మార్కెట్లో యథావిధిగా క్రయవిక్రయాలు జరుగుతాయని తెలిపారు.

తల్లి త్యాగానికి తీరని విషాదం

● తల్లి ప్రాణం సగం కోల్పోయినా దక్కని ఫలితం ● కిడ్నీ ఇచ్చిన తల్లి త్యాగం వృథా ● వడ్లకొండలో విషాద ఛాయలు

పర్వతగిరి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : తాను బతుకకపోయినా, తన కొడుకు మాత్రం బతకాలనే తల్లి ప్రేమకు సాటిలేదు. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని వడ్లకొండ గ్రామానికి చెందిన చింతకాయల సోమక్క తన కుమారుడు చింతకాయల నాగరాజు(33)కు ప్రాణం కోసం తానే కిడ్నీ ఇచ్చి తల్లి ప్రేమకు అర్థం చెప్పింది.

వివరాల్లోకెళితే పర్వతగిరి మండలంలోని వడ్డకొండ గ్రామానికి చెందిన చింతకాయల జంపయ్య-సోమక్కలకు ముగ్గురు కొడుకులు. కాగా, రెండవ కుమారుడు చింతకాయల నాగరాజు గత 7 సంవత్సరాల నుంచి తన భార్య స్వప్న, కూతురు అక్షరశ్రీతో హైదరాబాదులో ఒక చికెన్ షాపులో పనిచేస్తూ జీవిస్తున్నాడు. గత కొన్ని రోజులుగా అనారోగ్యం పాలైన నాగరాజు వైద్య పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రికి వెళ్లగా, కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నట్లు.. రెండు కిడ్నీలు చెడిపోయాయని, అవి చివరి స్టేజిలో ఉందని వైద్యులు తెలిపారు. దీంతో ఎవరైన దాతలు కిడ్నీలు ఇస్తే తప్ప బతికే అవకాశం లేదని వైద్యులు తెలిపారు. కుటుంబంలో అందరి కిడ్నీలను పరీక్ష చేయగా తల్లి సోమక్క కిడ్నీ తనకు సరిపోతుందని వైద్యులు తేల్చారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.15 లక్షల అప్పులు చేసి చెల్లించగా ఆపరేషన్ చేసి కిడ్నీ మార్పిడి చేశారు. హస్పిటల్ నుంచి డిశ్చార్జ్ చేయ గా, ఇంటికి వచ్చిన నాగరాజు తిరిగి మళ్లీ తీవ్ర అస్వస్థకు గురయ్యాడు. దీంతో వెంట నే హైదరాబాదులోని అదే హస్పిటల్‌కు ట్రీట్మెంట్ కోసం వెళ్తుండగానే మార్గం మధ్యలో చనిపోయాడు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నా, కుటుంబం అప్పులపాలై, కొడుకుకు కిడ్నీ ఇచ్చి బతికించుకోలేకపోయిన తల్లి, భార్య, కూతురు రోదనలతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా, ప్రభుత్వం తన కొడుకు కుటుంబాన్ని ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమవుతున్నారు.




చింతకాయల సోమక్క చింతకాయల నాగరాజు(ఫైల్)

అల్లకల్లోలం

(5వ తరువాయి)

తరలించాయి. అకాలవర్షాలకు జనజీవనం స్తంభించిపోయింది. ఉదయం నుంచి ప్రజలు ఎవరూ అడుగు బయటపెట్టలేదు. నగరంలోని రోడ్లన్నీ చెరువులుగా మారిపోయాయి. రోడ్లపై పార్కింగ్ చేసిన కార్లలో కొన్ని వరద ఉధృతికి కొట్టుకుపోయాయి. మరికొన్ని పూర్తిగా మునిగిపోయాయి. స్కూళ్లకు సెలవులు ఇవ్వకపోవడంతో విద్యార్థులు వర్షంలోనే తడుస్తూ ఇళ్లకు తిరిగి వెళ్లడం కనిపించింది.

హనుమకొండ జిల్లాలో..

భారీ వర్షాలకు రెండు జిల్లాలో అనేక చోట్ల చేతికివచ్చిన పంటలు నేలపాలయ్యాయి. పొలాల్లో భారీ ఎత్తున వరద నీరు ప్రవహించడంతో పంటలు నీటమునిగాయి. వరి, పత్తి, మొక్కజొన్న తదితర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం కటాక్షపూర్ వద్ద భారీ వర్షానికి వరి పంటలు బాగా దెబ్బతిన్నాయి. ఎలకతుర్తి మండలంలో వందల ఎకరాల్లో వరిపైర్లు నేలవాలాయి. ఆరబెట్టిన వరిధాన్యం రాశులు తడిసి ముద్దయ్యాయి. ఐనవోలు మండలంలోనూ ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి జనజీవనం అస్తవ్యస్తం కావడమే కాకుండా పంటలు దెబ్బతిన్నాయి. నడికూడ వాగు పొంగి పొర్లుతోంది. కంఠాత్మకూరు వాగు వరదనీరు కల్వర్లుపై నుంచి ప్రవహిస్తుండడంతో వాహనాలను ఇతరమార్గాల గుండా మళ్లిస్తున్నారు.

వరంగల్ జిల్లాలో..

భారీవర్షాల కారణంగా వరంగల్ జిల్లాలో ఒకరు మృతి చెందారు. దుగ్గొండి మండలంలోని గిర్నిబావి ప్రధాన రహదారి వద్ద బైక్ చెట్టును ఢీకొనడంతో బైక్‌పై వెళుతున్న లూనావత్ రాజేందర్ మృతి చెందాడు. జిల్లాలోని అన్ని మండలాల్లో అతి భారీ వర్షాలు కురవడంతో పలు చెరువులు, వాగులు పొంగుతున్నాయి. పలుచోట్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. దుగ్గొండి మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి సాంబశివరావు భారీవర్షాల దృష్ట్యా గర్భిణులను ముందు జాగ్రత్తగా జిల్లా ఆస్పత్రికితరలించాలని సిబ్బందికి సూచించారు. డాక్టర్లు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

నిలిచిన రైళ్ల రాకపోకలు

భారీవర్షాల వల్ల పలు రైళ్లు నిలిచిపోయాయి. డోర్నకల్ రైల్వేస్టేషన్‌లో పట్టాలపైకి భారీగా వరద నీరు చేరింది. దీనితో స్టేషన్‌లో గోల్కొండ, ఎక్స్‌ప్రెస్, వరంగల్-విజయవాడ మార్గంలో పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. వరంగల్ రైల్వే స్టేషన్‌లో గుంటూరు ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్ హౌరా ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, మహబూబాబాద్ స్టేషన్‌లో కోణార్క్, క్రిష్ణ, మధిర స్టేషన్‌లో షిరిడీ ఎక్స్‌ప్రెస్, పందిళ్లపల్లి (ఖమ్మం)లో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ నిలిచిపోయింది. దీనితో పాటు పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి.

నగరం జలమయం

భారీ వర్షాలకు వరంగల్, హనుమకొండ, కాజీపేట పట్టణాలు పూర్తిగా జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. హనుమకొండ బస్‌స్టాండ్ వరదనీటితో చెరువును తలపింపచేసింది. నడుములోతు నీళ్లలో ప్రయాణికులు నడిచి వెళ్లారు. బస్టాండ్ ప్రాంగణంలో పార్కింగ్ చేసిన ఆర్టీసీ బస్సులు సగం వరకు నీటిలో మునిగిపోయాయి. కాకాజీ కాలనీ, హనుమకొండ చౌరస్తా, పాత బస్‌డిపో ప్రాంతం, ఎన్‌జీవోస్ కాలనీ రోడ్డు, వరంగల్ నిట్ ప్రాంతం, కాజీపేట బాపూజీనగర్ తదితర ప్రాంతాల్లో మోకాలు ఎత్తు వరకు నీరు నిలిచి రాకపోకలు స్తంభించిపోయాయి. డ్రైనేజీలు పొంగిపొర్లాయి. వరంగల్‌లో అండర్ బ్రిడ్జి ప్రాంతంలో పెద్దఎత్తున నీరు నలిచి రాకపోకలు నిలిచిపోయాయి. నగరంలోని పలు మురికివాడల్లోని ఇళ్లలోకి వర్షపు నీరు ప్రవేశించింది. బట్టల బజార్ పూర్తిగా జలమయమైంది.

ప్రజలు బయటకు రావొద్దు..

భారీ వర్షాల కారణంగా ప్రజలు అత్యవసరమైతే తప్ప.. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని అధికారులు సూచించారు. వరదలు సంభవించిన పక్షంలో అత్యవసర సేవల కోసం అందుబాటులో తీసుకువచ్చిన టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని కోరారు. నగరంలోని ముంపు బాధితులను ఆదుకునేందుకు కార్పొరేషన్ అధికారులు రంగంలోకి దిగారు. ఏడు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. బాధితులను ఈ కేంద్రాలకు తరలించారు. ఇప్పటికే 400 మందికిపైగా పునరావాస కేంద్రాలకు చేరుకున్నారు.

అప్రమత్తంగా ఉండాలి: ఎమ్మెల్యే నాయిని

మొంథా తుపాను ప్రభావం నేపథ్యంలో పశ్చిమ నియోకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పిలుపు నిచ్చారు. ఫోన్ ద్వారా అధికారులకు పలు సూచనలు చేశారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సహాయక చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు సంగీత నృత్య పోటీలు

హనుమకొండ కల్చరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): యేటా ఐఏఎస్ అధికారులకు కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లుగా.. ఈసారి రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగులకు సంగీత నృత్య పోటీలను నిర్వహిస్తున్నట్లు సాంస్కృతిక శాఖ సంచాలకులు ఏనుగు నర్సింహారెడ్డి తెలిపారు. ఆసక్తిగల ప్రభుత్వ ఉద్యోగులు పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. నవంబరు 6,7 తేదీల్లో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో పోటీలను నిర్వహిస్తామన్నారు. కర్ణాటక, హిందూస్థానీ, జానపద, గాత్ర కచేరి, కిట్ అంశాలకు సంబంధించిన పోటీలు నవంబరు 6, జానపద, శాస్త్రీయ, నృత్య పోటీలు నవంబరు 7వ తేదీన నిర్వహింపజేస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే ఉద్యోగులకు ఓడీ సౌకర్యంతోపాటు విజేతలకు బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. సంగీత అంశాల్లో పాల్గొనేందుకు తమ పేర్లను వరంగల్ ప్రభుత్వ సంగీత విద్యారణ్య కళాశాల ప్రిన్సిపాల్ సుధీర్‌కుమార్‌కు 98496 41839, నృత్య అంశాలకు సంబంధించి నీరాజాక్షి 97044 66499 నెంబర్ల ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని సాంస్కృతిక శాఖ సంచాలకులు నర్సింహారెడ్డి సూచించారు.

పత్తిని ఆరబెట్టి తీసుకురావాలి

వరంగల్ వ్యవసాయం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : అధిక తేమ వల్ల మద్దతు ధరలో కోత విధించకుండా ఉండాలంటే రైతులు తమ పత్తిని బాగా ఆరబెట్టిన తర్వాతే సీసీఐ కేంద్రానికి తీసుకురావాలని సీసీఐ వరంగల్ బ్రాంచ్ జనరల్ మేనేజర్ మోహిత్‌శర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పత్తికి మద్దతు ధర కల్పించేందుకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఉమ్మడి వరంగల్ జిల్లాలో 60 కేంద్రాలు ఏర్పాటు చేసిందన్నారు. పత్తిలో 8 శాతం తేమ ఉంటే మద్దతు ధర క్వింటాల్‌కు రూ.8110లు పలుకుతుందని, తేమ శాతం పెరుగడం వల్ల ధరలో కోత పడుతుందన్నారు. అది కూడా తేమ 12 శాతం మించితే సీసీఐ కొనుగోలు చేయదని స్పష్టం చేశారు. అందుకే పత్తిలో తేమ శాతం అధికంగా ఉండకుండా పత్తిని ఆరబెట్టిన తర్వాతే అమ్మకానికి తీసుకురావాలని మోహిత్‌శర్మ ఆ ప్రకటనలో కోరారు.

భద్రకాళి దేవస్థానానికి రండి

మట్టెవాడ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ధర్మ విజయ యాత్రలో బాగంగా హైదరాబాద్‌లోని నల్లకుంట శంకర మఠానికి వచ్చిన శృంగేరి శారదా పీఠం ఉత్తరాధికారి విధు శేఖర భారతిస్వామిని బుధవారం భద్రకాళి దేవస్థాన ప్రధాన అర్చకుడు భద్రకాళి శేషు, వరంగల్ వాసవి క్లబ్ అధ్యక్షుడు, భద్రకాళి దేవస్థానం ధర్మకర్త తొనుపునూరి వీరన్న ఆధ్వర్యంలో కలిశారు. భారతి స్వామికి అమ్మవారి శేషవస్త్రాలు, చిత్రపటాన్ని అందజేశారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం భద్రకాళి దేవస్థానానికి రావాల్సిందిగా కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో భద్రకాళి దేవస్థాన ధర్మకర్తలు తొనుపునూరి వీరన్న, ఓరుగంటి పూర్ణ, మోత్కూరి మయూరి, రాము పాల్గొన్నారు.

మునిగిన నగరం

● నీట మునిగిన లోతట్టు ప్రాంతాలు ● బాధితులను పునరావాస కేంద్రాలకు తరలింపు ● రక్షణ చర్యలు చేపడుతున్న అధికారులు ● వరంగల్ నగర పాలక సంస్థ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షం కారణంగా వరంగల్ నగరంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు కాలనీలో వరద నీటిలో మునిగిపోయాయి. జన సంచారం అతలాకుతలమైంది. ఇక బుధవారం కురిసిన భారీ వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తం అయ్యింది. ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన కుండపోత వర్షాలకు నగంలోని ప్రధాన రహదారులు, కూడళ్లు, షాపులు, ఇండ్లలోకి వర్షపు నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇప్పటి వరకు 15 కాలనీలలో ఇండ్లలోకి వర్షపునీరు చేరుకున్నట్టు అధికారులు గుర్తించారు.

కాగా, బల్దియా అధికారులు రక్షణ చర్యలు చేపడుతున్నప్పటికీ నగరంలో చాలాచోట్ల డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపర్చకపోవడం, నాలాల శుభ్రత దీర్ఘకాలిక సమస్యగా ఉండిపోవడంతో వర్షాలు కురిసిన ప్రతీసారి పాత సమస్యే ఉత్పన్నమవుతోంది. భారీ వర్షాలకు ఇండ్లు జలమయమవ్వడం, ప్రజలు వరద ముంపునకు గురికాక తప్పదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ప్రధానంగా వరంగల్ ట్రైసిటీస్ పరిధిలోని కాజీపేట, హనుమకొండ, వరంగల్ ప్రాంతాల్లోని పలు కాలనీలు నీటమునుగుతున్నాయి. లోతట్టు ప్రాంతాలలో భూ కబ్జాదారులు రోడ్లు, డ్రైనేజీలు ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో ప్రతీసారి కాలంతో పని లేకుండా వర్షం కురిసినప్పడల్లా ఈ సమస్య ఎదురవుతోందనే విమర్శలు వస్తున్నాయి. 2020 నుంచి ఏటా భారీవర్షాలకు ఇండ్లలోకి వర్షపు నీరు చేరుకుంటున్నప్పటికీ అధికారులు అప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నారే కానీ శాశ్వత పరిష్కారం చూపడం లేదని బల్దియా అధికారులపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నీట మునిగిన ప్రాంతాలు

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరంగల్ నగరంలో పలు కాలనీలలో ఇండ్లలోకి నీరు చేరినట్టు జీడబ్ల్యూఎంసీ అధికారులు గుర్తించారు. త్వరితగతిన సహాయక చర్యలు ప్రారంభించినట్టు సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి తెలిపారు. ప్రధానంగా లోతట్టు ప్రాంతాలైన హనుమకొండ, వరంగల్ నగరంలోని పలు ప్రాంతాలతో పాటు సాయిగణేశ్ కాలనీ, గాంధీ నగర్, డీకేనగర్, లెనిన్ నగర్, వివేకానంద కాలనీ, శివనగర్, ఎస్టీఆర్ నగర్, ఎంఎన్ నగర్, సీఎస్ఆర్ గార్డెన్, కొత్తబస్‌స్టేషన్, గోకుల్‌నగర్, శాంతినగర్, కాశిబుగ్గ, రంగశాయిపేట, కరీమాబాద్, ఎస్ఆర్ఆర్ తోట, ఉర్సుగుట్ట, టీకే నగర్, మైసయ్యనగర్, గోపాలపురం, తెలంగాణ జంక్షన్, రంగంపేట, ఎన్‌జీవోఎస్ కాలనీ, పోచమ్మకుంట, ఎల్‌వీఆర్ కాలనీ, కొత్తవాడ, కాపువాడ, పాతబీటుబజార్, వరంగల్ చౌరస్తా, బట్టల బజార్, అండర్ రైల్వేగేట్ ప్రాంతాలతో పాటు పలు కాలనీలు, లోతట్టు ప్రాంతాలలో నీరు ఇండ్లలోకి చేరుకున్నాయి. కాగా, ఇండ్లలోకి వర్షపునీరు చేరడంతో జీడబ్ల్యూఎంసీ డీఆర్ఎఫ్, శానిటేషన్ సిబ్బంది స్పందించి నీటిలో చిక్కి ఇండ్లలో ఉన్న వారిని గుర్తించి పునరావాలస కేంద్రాలకు తరలించారు. ఇప్పటివరకు సుమారు 280మంది నిరాశ్రయులను పునరావాస కేంద్రాలకు తలించినట్టు శానిటరీ సూపర్‌వైజర్ నరేందర్ వెల్లడించారు. శంభునిపేట ప్రభుత్వ హైస్కూల్, బీరన్నకుంట హైస్కూల్, శుభం గార్డెన్, గుజరాత్ మార్వాడీ సెంటర్, శ్రీ రాజరాజేశ్వరి గార్డెన్ ఐదుచోట్ల, హనుమకొండలో రెండుచోట్ల పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి నగర పాలక సంస్థ సహకారంతో ఉచిత భోజన, వసతి కల్పిస్తున్నారు. బుధవారం ఉదయం 800మందికి అల్పాహారం అందించినట్టు అధికారులు తెలిపారు.



పునరావాస కేంద్రంలో ప్రజలతో మాట్లాడుతున్న మేయర్ సుధారాణి



వికాస్‌నగర్‌లో కూలిన వృక్షాన్ని తొలగిస్తున్న డీఆర్ఎఫ్ సిబ్బంది

గ్రేటర్ అధికారుల చర్యలు

వరంగల్ నగరంలో కురుస్తున్న వర్షాలకు నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ ప్రజలకు సూచించారు. మంగళవారం రాత్రి నుంచి కురిసిన వర్షాలకు నగరంలో చాలాకాలనీలతో పాటు ఇండ్లలోకి నీరు చేయడంతో కమిషనర్ అధికారులను అప్రమత్తం చేశారు. పర్యటించారు. శానిటేషన్‌తో పాటు టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్ అధికారులను సమన్వయం చేసుకుని పలు కాలనీలలో సందర్శించారు. అక్కడి ప్రజలతో మాట్లాడి ఆత్మస్థైర్యాన్ని నింపారు. సాయిగణేశ్ కాలనీ, డీకేనగర్, లెనిన్‌నగర్, అగర్తల చెరువు, మైసయ్యనగర్, గిరిప్రసాద్ కాలనీ, పద్మనగర్, శాకరాసికుంట ప్రాంతాల్లో శానిటేషన్, ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది వర్షం సైతం లెక్క చేయకుండా పర్యటించి వరద ముంపుకు గల కారణాలను తెలుసుకున్నారు. ఇంకా మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని, ప్రమాదపుటంచులో ఉన్న ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ సంబంధిత అధికారులను, ప్రజలను అధికారులను ఆదేశించారు. కాగా, నగరంలో ఏడు పునరావాస కేంద్రాలలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలన్నారు. వర్షాకాలంలో పిల్లలు బయటకు, చేపలకు, ఈతకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డీఆర్ఎఫ్ బృందాలు అప్రమత్తంగా ఉండాలన్నారు. బల్దియా ప్రధాన కార్యాయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, అత్యవసర సమయంలో టోల్‌ఫ్రీ నెంబర్‌కు 1800 425 1980, 9701999676 ఫోన్‌చేయాలని కమిషనర్ సూచించారు.

టోల్‌ఫ్రీని వాడుకోవాలి

జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

ఐసీసీసీ నుంచి పరిశీలన

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వర్షాలతో ఇబ్బందులు పడుతున్న నగర ప్రజలు టోల్‌ఫ్రీ నెంబర్‌కు 1800 425 1980 ఫోన్‌చేసి సహాయం పొందాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ కోరారు. రెండు రోజులుగా భారీ వర్షాల నేపథ్యంలో వరంగల్ నగరంలో నెలకొన్న పరిస్థితిని వరంగల్ మునిసిపల్ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఐసీసీసీ (ఇంటిగ్రేటెడ్ కమాంగ్ కంట్రోల్ రూమ్) నుంచి బుధవారం నేరుగా పరిశీలించారు. బల్దియా శానిటేషన్, ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. వరంగల్ నగరంలో ఎక్కడైనా నీట మునిగిన ప్రాంతాలు, తెరుచుకున్న మ్యాన్‌హోల్స్ ప్రాంతాలు, డ్రైనేజీ అవరోధాలను తక్షణమే గుర్తించాలన్నారు. వర్షాలవల్ల ప్రజలకు ఇబ్బందులు ఏర్పడకుండా సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ క్షేత్రస్థాయిలో కాలనీలో పర్యటించాలన్నారు. అవసరమైతే అత్యవసర సిబ్బంది యంత్రాంగం సిద్ధంగా ఉండాలన్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి వర్షాపాతం స్థితి, ట్రాఫిక్ అప్‌డేట్స్, ఫీల్డ్ ఎస్పాన్స్ టీమ్స్ పని తీరును ఐసీసీసీ నుంచి వీక్షించారు. వర్షాలవల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనవసర ప్రయాణాలు మానుకోవాలని కమిషనర్ ప్రజలకు సూచించారు.



ఐసీసీసీ నుంచి పరిశీలిస్తున్న కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

మానుకోట ఆగమాగం



మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేటలో నేలవాలిన వరి పంట

- ఎడతెరిపిలేని భారీ వర్షం
- నీటమునిగిన డోర్నకల్ రైల్వేలైన్
- నిలిచిన రైళ్లు.. ప్రయాణికుల ఇక్కట్లు
- పొంగుతున్న వాగులు.. రాకపోకలు బంద్

మహబూబాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ప్రభావంతో మహబూబాబాద్ జిల్లాలో ఎడతెరిపిలేని భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఏకధాటిగా.. కుండపోతగా వర్షం కురుస్తుండడం, బలమైన ఈదురుగాలులు వీస్తుండడంతో అతలాకుతలమైంది. బుధవారం ఉదయం 6.10 గంటలకు ప్రారంభమైన వర్షం భారీ తుఫానుగా మారి సాయంత్రం వరకు కురుస్తూనే ఉంది. డోర్నకల్ రైల్వే లైన్‌పై ప్లాట్‌ఫామ్ ఎత్తు వరకు వరదనీరు చేరడంతో ఆ ప్రాంతమంతా చెరువును తలపించింది. డోర్నకల్, గుండ్రాతిమడుగు, మహబూబాబాద్, తాళ్లపూసపల్లి స్టేషన్‌లలో రైళ్లు గంటలతరబడి నిలిపివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ ఆదేశాలతో పోలీసులు, బిస్కెట్‌లు, తాగునీరు అందించగా స్వచ్ఛంద సేవా సంస్థలు పండ్లు, బిస్కెట్‌లను పంపిణీ చేశారు. సాయంత్రం పలు రైళ్లను దారి మళ్లించారు. కలెక్టర్ ఆదేశాలతో డీఈవో పాఠశాలలకు సెలవు ప్రకటించారు.



కొత్తగూడ గుంజేడు ముసలమ్మ గుడి వద్ద రోడ్డుపై కూలిన భారీ వృక్షం

దంతాలపల్లి, పెద్దముప్పారంలో వద్ద పాలేరు పొంగి ప్రవహిస్తుండడంతో సూర్యాపేటకు రాకపోకలు నిలిచిపోయాయి. గార్ల వద్ద పాకాల వాగు పొంగి ప్రవహిస్తుండడంతో మద్దివంచ, రాంపురం, ఇతర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కేసముద్రం మండలం అర్పనపల్లి వద్ద వట్టివాగు బ్రిడ్జిపై నుంచి వరదనీరు ప్రవహిస్తుండడంతో గూడూరు, కాట్రపల్లి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. బొగ్గులవాగు వద్ద, ఈద్గా వద్ద వరద నీరు ప్రవహిస్తుండడంతో కల్వల, కేసముద్రం, ఇనుగుర్తి రాకపోకలు నిలిచిపోయాయి. గూడూరు వద్ద పాకాల వాగు పొంగి ప్రవహిస్తుండడంతో కేసముద్రం, నెక్కొండలకు రాకపోకలు నిలిచిపోయాయి. మొక్కజొన్న, పత్తి, వరి పంటలు నేలవాలి దెబ్బతిన్నాయి. కాగా, మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో ఆగిన కృష్ణా ఎక్స్‌ప్రెస్, గుండ్రాతిమడుగు స్టేషన్‌లో నిలిచిన కోణార్క్ ఎక్స్‌ప్రెస్ సాయంత్రం మళ్లీ వెనుకకు దారి మళ్లించారు. డోర్నకల్ స్టేషన్‌లో నిలిచిన గోల్కొండ ఎక్స్‌ప్రెస్ స్టేషన్‌లో నిలిపివేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆయా స్టేషన్లలో రైళ్లు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. డోర్నకల్‌లో బుధవారం ఉదయం నుంచి సాయంత్రం4 గంటల వరకు 150.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

భూపాలపల్లి జిల్లాలో స్వల్పం

భూపాలపల్లి (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లాలో బుధవారం ముసురువాన కురిసింది. మధ్యాహ్నం తర్వాత వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో జిల్లా వ్యాప్తంగా జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. తుఫాను ప్రభావంతో చేతికొచ్చిన పత్తి తడిసిపోయి రైతులకు అపార నష్టం సంభవించింది. కరీంనగర్, వరంగల్ జిల్లాలో భారీవర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. ముఖ్యంగా లోయర్ మానేరు పరీవాహక ప్రాంతంలోని మండలాల్లో అధికారులు అప్రమత్తత ప్రకటించారు. మరోవైపు ఎగువన కురుస్తున్న వర్షాలతో గోదావరికి కూడా క్రమంగా వరద తీవ్రత పెరుగుతోంది. బుధవారం సాయంత్రానికి జిల్లా వాతావరణ శాఖ సేకరించిన గణాంకాల ప్రకారం జిల్లాలో 1.7 సెంటీమీటర్ల సగటు వర్షాపాతం నమోదైంది.

ములుగు జిల్లాలో ముసురు

ములుగు (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో ములుగు జిల్లా వ్యాప్తంగా ముసురు వాతావరణం నెలకొంది. బుధవారం ఎడతెరిపిలేకుండా వాన కురిసింది. ఈ క్రమంలో జనం ఇళ్లకే పరిమితమయ్యారు. ఎవరూ బయటకు రాకపోవడంతో రోడ్లు వెలవెలబోయాయి. ఇప్పటికే వాతావరణ శాఖ ములుగు జిల్లాకు రెడ్ అలర్ట్ ప్రకటించింది. వాగులు, వంకలు, చెరువులు, గోదావరి నిండి ఉప్పొంగే అవకాశం ఉందని, లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. రైతులకు నష్టం జరగకుండా వ్యవసాయ, మార్కెటింగ్, రెవెన్యూ, డీఆర్డీవో, సంబధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ దివాకర ఆదేశాలు జారీ చేశారు. మొంథా తుఫాన్‌పై అధికారులతో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క హైదరాబాద్ నుంచి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి అప్రమత్తంగా ఉండాలన్నారు.

జనగామ జిల్లాలో..

జనగామ (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ జనగామ జిల్లాను అతలాకుతలం చేసింది. జిల్లా అంతటా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిశాయి. భారీ వర్షం కారణంగా జిల్లాలో చాలా ప్రాంతాల్లో వరి, పత్తి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. లోతట్టు ప్రాంతాల్లోని వరి, పత్తి పంటలు వర్షపు నీటిలో పూర్తిగా మునిగిపోయాయి. కోత దశకు వచ్చిన వరి, తీత దశకు వచ్చిన పత్తి పంట నీట మునగడంతో అన్నదాతకు తీవ్ర నష్టం వాటిల్లింది. జిల్లాలో బుధవారం ఉదయం 9 గంటల వరకు సాధారణ పరిస్థితులు ఉండగా 9 దాటిన తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. భారీ వర్షాల కారణంగా జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. ధాన్యం కుప్పలపై టార్పాలిన్లు కప్పినప్పటికీ కింది నుంచి నీరు చేరి ధాన్యం తడిసిపోయింది. కొన్నిచోట్ల లోతట్టు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు నీటి మునిగాయి. పలు చెరువులు మత్తళ్లు దుంకుతుండగా వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. కల్వర్టుల వద్ద వాగులు పొంగి పొర్లుతుండడంతో పోలీసులు వాహనాల రాకపోకలను నిలిపి వేసి దారి మళ్లించారు. భారీ వర్షం కారణంగా జనగామ జిల్లాకేంద్రంలోని హైదరాబాద్ రోడ్డు పూర్తిగా నీట మునిగింది. కాగా.. జిల్లాలోని పాలకుర్తి మండలం గూడూరులో అత్యధికంగా 23.5 సెం.మీ వర్షపాతం నమోదైంది.



రఘునాథపల్లిలోని జాతీయ రహదారిపై నిలిచిన వర్షపు నీటిని పరిశీలిస్తున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, పోలీసులు



హనుమకొండ చౌరస్తాలో మునిగిన ద్విచక్ర వాహనం



జలమయమైన హనుమకొండ బస్టాండ్

ముంచెత్తిన 'మొంథా'

వరంగల్, హనుమకొండ జిల్లాలు అతలాకుతలం

- చెరువులుగా కాలనీలు, కాలువలుగా రహదారులు
- తుఫాన్‌తో అస్తవ్యస్తం, లోతట్టు ప్రాంతాలు జలమయం
- కుండపోతతో స్తంభించిన జన జీవనం
- ఇళ్లలోకి ప్రవేశించిన వరద నీరు
- పర్వతగిరిలో అత్యధికంగా 340 మి.మీ. వర్షపాతం
- పలు రైళ్లు రద్దు, మరికొన్ని దారి మళ్లింపు

హనుమకొండ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ మొంథా ప్రభావం హనుమకొండ, వరంగల్ జిల్లాల్లోనూ తీవ్ర ప్రభావం చూపింది. రెండు జిల్లాల్లో ఉదయం నుంచి భారీ వర్షం కురుస్తుంది. ఆకాశానికి చిల్లు పడిందా ? అన్న రీతిలో ఎడతెరిపి లేకుండా కుండపోతగా వర్షం పడుతూనే ఉంది.

వరంగల్ జిల్లాలో అత్యధికంగా వర్షం కురిసింది. పర్వతగిరి మండలం కల్లెడలో అత్యధికంగా 340 మి.మీ. వర్షపాతం నమోదయ్యింది. సంగెం, నెక్కొండ, ఖిలా వరంగల్, పాలకుర్తి, వర్ధన్నపేట, భీమదేవరపల్లి మండలాల్లోనూ 200 మి.మీ. పైన వర్షం పడింది.

అతలాకుతలం

ఈ రెండు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తుండడంతో ఈదురుగాలులతో అనేక ప్రాంతాలు అతలాకుతలం అయ్యాయి. వరద బీభత్సం సృష్టించాయి. లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. అనేక ఇళ్లలోకి వర్షపు నీరు ప్రవహించింది. కొన్ని చోట్ల వరదల్లో వంట సామగ్రి, నిత్యావసర వస్తువులు కొట్టుకుపోయాయి. వస్తువులన్నీ నీటమునిగి ముద్దయ్యాయి. గుడిసెవాసుల పరిస్థితి దయనీయంగా మారింది. భారీ వర్షాలకు చాలా చోట్ల గుడిసెలు కొట్టుకుపోయాయి. పలు చోట్ల నేలమట్టమయ్యాయి. అనేక మంది నిరాశ్రయులయ్యారు. వరదల్లో చిక్కుకొని విలవిల్లాడారు. వీరందరిని డిజాస్టర్ మేనేజ్‌మెంట్ బృందాలు సురక్షిత ప్రాంతాలకు తరలించాయి. అకాల వర్షాలకు జనజీవనం స్తంభించిపోయింది. ఉదయం నుంచి ప్రజలు ఎవరూ అడుగు బయటపెట్టలేదు. నగరంలోని రోడ్లన్నీ చెరువులుగా మారిపోయాయి. రోడ్లపై పార్కింగ్ చేసిన కార్లలో కొన్ని వరద ఉధృతికి కొట్టుకుపోయాయి. మరికొన్ని పూర్తిగా మునిగిపోయాయి. స్కూళ్లకు సెలవులు ఇవ్వకపోవడంతో విద్యార్థులు వర్షంలోనే తడుస్తూ ఇళ్లకు తిరిగి వెళ్లడం కనిపించింది.

భారీ వర్షాలకు అనేక చోట్ల చేతికివచ్చిన పంటలు నేలపాలయ్యాయి. పొలాల్లో భారీ ఎత్తున వరద నీరు ప్రవహించడంతో పంటలు నీటమునిగాయి. వరి, పత్తి, మొక్కజొన్న తదితర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఆరబెట్టిన వరి ధాన్యం రాశులు తడిసి ముద్దయ్యాయి.

భారీ వర్షాల కారణంగా వరంగల్ జిల్లాలో ఒకరు మృతి చెందారు. దుగ్గొండి మండలంలోని గిర్ని బావి ప్రధాన రహదారి వద్ద బైక్‌పై వెళ్తున్న లూనావత్ రాజేందర్ చెట్టును ఢీకొట్టి మృతి చెందాడు. భారీ వర్షాల వల్ల పలు రైళ్లు నిలిచిపోయాయి. డోర్నకల్ రైల్వేస్టేషన్‌లో పట్టాలపైకి భారీగా వరద నీరు చేరింది. దీనితో స్టేషన్‌లో గోల్కొండ, ఎక్స్‌ప్రెస్, వరంగల్-విజయవాడ మార్గంలో పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. వరంగల్ రైల్వే స్టేషన్‌లో గుంటూరు ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్ హౌరా ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, మహబూబాబాద్ స్టేషన్‌లో కోణార్క్, కృష్ణ, మధిర స్టేషన్‌లో షిరిడి ఎక్స్‌ప్రెస్, పందిళ్లపల్లి (ఖమ్మం)లో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ నిలిచిపోయింది. దీనితో పాటు పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి.



జలమయమైన వరంగల్‌లోని శివనగర్

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

భారీ వర్షాల నేపథ్యంలో హనుమకొండ, వరంగల్ జిల్లా కలెక్టరేట్లలో ప్రజలకు అత్యవసర సేవలు అందించడానికి కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు.

పలుచోట్ల వర్షపాతం

వరంగల్ జిల్లాలోని పర్వతగిరి మండలంలో కల్లెడలో అత్యధికంగా 340 మి.మీ. వర్షపాతం నమోదు కాగా, సంగెం మండలంలో 252.3, నెక్కొండలో 246.3, ఖిలా వరంగల్‌లో 237, పాలకుర్తిలో 235.8, సంగెంలో 234.8, వర్ధన్నపేటలో 228, నెక్కొండలో 195.5, వరంగల్‌లో 188, గీసుకొండలో 185 చెన్నారావుపేటలో 173.5 మి.మీ హనుమకొండ జిల్లాలోని భీమదేవరపల్లి మండలంలో అత్యధికంగా 213.8 మి.మీ, హసన్‌పర్తిలో 179 మి.మీ, ధర్మసాగర్‌లో 177.8, దామెరలో 171.5, ఐనవోలులో 144.8, కాజీపేటలో 137.8 మి.మీ వర్షపాతం నమోదైంది.



వర్షం నీటితో నిండిన వరంగల్ రైల్వేస్టేషన్

కొట్టుకుపోయిన గొర్రెలు.. మృతి చెందిన కోళ్లు

రాయపర్తి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా రాయపర్తి మండలం మొరిపిరాల గ్రామంలో లింగాల కుంట చెరువు మత్తడి పోస్తుండగా 15 గొర్రెలు వరదలో కొట్టుకుపోయి మృతి చెందాయి. జోగు అశోక్, చేగురి శ్రీశైలంలకు చెందిన గొర్లు కాగా, మరికొన్ని గల్లంతవడంతో గ్రామస్థుల సహకారంతో గాలిస్తున్నారు. అలాగే మైలారంలో బిల్లా దేవేందర్ రెడ్డి కోళ్ల ఫారంలో వర్షానికి దాణా తడిసిపోయింది. అదే దాణా తిని సుమారు 5,500 కోళ్లు మృత్యువాతపడ్డాయి.


ఉపాధ్యాయులకు తప్పిన ప్రమాదం

మండలంలోని కొత్తూరు ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న కొంక అనురాధ విధులు ముగించుకుని మధ్యాహ్నం కారులో ఇంటికి తిరిగి వెళ్తుండగా, కురుస్తున్న వర్షానికి గ్రామ శివారులో రోడ్డుపై వరద ఉధృతికి కారు పొలాల్లోకి వెళ్లిపోయింది. అప్పటికే కారులో ఐదుగురు ఉపాధ్యాయులు ఉండగా భారీ ప్రమాదం తప్పింది. స్థానికులు ట్రాక్టర్ సహాయంతో కారును బయటకు తీసి పంపించారు.

వర్షం నీటిలో జారి పడి వృద్ధురాలి మృతి

డోర్నకల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం ఉయ్యాలవాడ గ్రామ శివారు సత్యతండాలో ఇంటిలోకి చేరిన వర్షపు నీటిలో ప్రమాదవశాత్తు జారిపడి వృద్ధురాలు జువ్వల రోషమ్మ (70) మృతి చెందింది. బుధవారం మొంథా తుపాన్ ఎఫెక్ట్‌తో కురిసిన భారీ వర్షానికి తండాలో వర్షపు నీరు నిలిచింది. ఈక్రమంలో రోషమ్మ ఇంట్లోకి వర్షపు నీరు చేరింది. అందులో ప్రమాదవశాత్తు వృద్ధురాలు రోషమ్మ జారి అక్కడికక్కడే మృతి చెందింది. ఇంట్లో ఎవరూ లేక పోవడంతో చుట్టు పక్కల వారు చూసే సరికి అప్పటికే రోషమ్మ మృతి చెందింది. ఈ విషయాన్ని తండా వాసులు డోర్నకల్ పోలీసులకు సమాచారం అందించారు.

నీట మునిగిన సబ్‌స్టేషన్



బాల సముద్రం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నిలిచిన వర్షం నీరు

రాంనగర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రభావంతో హనుమకొండ బాలసముద్రంలోని 33బై11 కేవీ సబ్‌స్టేషన్ నీట మునిగింది. పవర్ ట్రాన్స్‌ఫార్మర్, ట్రాన్స్‌ఫార్మర్లు, ఫీడర్లు ఎత్తులో ఉండటంతో వినియోగదారులకు ఎలాంటి అంతరాయం కలగలేదని కలగలేదని హనువకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. వినియోగదారులు తడిచేతులతో విద్యుత్ పరికరాలను ముట్టుకోరాదన్నారు.

న్యాయశాస్త్ర సెమిస్టర్ పరీక్షలు వాయిదా

కేయూ క్యాంపస్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధిలో అక్టోబరు 30న జరగాల్సిన న్యాయశాస్త్ర విభాగం సెమిస్టర్ పరీక్షలను భారీ వర్షాల నేపథ్యంలో వాయిదా వేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎమ్డీ అసీం ఇక్బాల్‌లు బుధవారం ప్రకటించారు. మూడేళ్ల కోర్సుల ఎల్ఎల్‌బీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు, అలాగే ఐదేళ్ల ఎల్ఎల్‌బీ ఎనిమిదో సెమిస్టర్ పరీక్షలు, ఇంజనీరింగ్ బీటెక్ మొదటి ఏడాది మొదటి సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేసినట్లు స్పష్టం చేశారు. ఆయా పరీక్షల రీషెడ్యూల్ తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని వెల్లడించారు. మిగిలిన పరీక్షలన్నీ యథావిధిగా గతంలో ప్రకటించిన షెడ్యూల్ మేరకు జరుగుతాయని పేర్కొన్నారు.

పలు రైళ్లు రద్దు.. మరికొన్ని దారి మళ్లింపు

తుఫాన్ ప్రభావంతో రైల్వే శాఖ నిర్ణయం

కాజీపేట/గిర్మాజీపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో డోర్నకల్ రైల్వేస్టేషన్‌లో ట్రాక్‌పై వరద నీరు చేరడంతో రైల్వే శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. సికింద్రాబాద్, విజయవాడ, విశాఖపట్నం రూట్లలో పలు రైళ్లను రద్దు చేసి, మిగతా రైళ్లను దారి మళ్లించారు. దీంతో రైల్వే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఇంటర్‌సిటీ, ఈస్ట్‌కోస్ట్ రైళ్లను వరంగల్ రైల్వే స్టేషన్‌లో నిలిపివేశారు. మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో కృష్ణా ఎక్స్‌ప్రెస్, డోర్నకల్ రైల్వే స్టేషన్‌లో గోల్కొండ్ ఎక్స్‌ప్రెస్, ఉండ్రాతిమడుగు రైల్వే స్టేషన్‌లో కోణార్క్, రైళ్లను నిలిపివేశారు.

రద్దయిన రైళ్ల వివరాలు

(12705 /06) గుంటూర్ - సికింద్రాబాద్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, అప్ అండ్ డౌన్ (6778) విజయవాడ - డోర్నకల్ ప్యాసింజర్, (67766) డోర్నకల్ - కాజీపేట, (07001) చర్లపల్లి - తిరుపతి అప్‌అండ్ డౌన్, రైళ్లు బుధ, గురువారల్లో రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. (12131) దాదర్ -సాయినగర్‌ల మధ్య షిర్డీ ఎక్స్‌ప్రెస్‌ను కాజీపేటలో నిలిపివేసి తిరిగి సికింద్రాబాద్ పంపించారు. కాగా, కాజీపేట రైల్వే స్టేషన్‌లో రైల్వే ప్రయాణికుల కోసం హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశారు.

పాక్షికంగా రద్దయిన రైళ్లు

(12706) సికింద్రాబాద్ నుంచి గుంటూరు వెళ్లే ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లు వరంగల్ - గుంటూరు మధ్య రద్దుచేశారు. 17406 ఆదిలాబాద్ - తిరుపతిల మధ్య నడిచే కృష్ణా ఎక్స్‌ప్రెస్ మహబూబాబాద్ - తిరుపతిల మధ్య రద్దు చేశారు. (17201) గుంటూరు - సికింద్రాబాద్ మధ్య నడిచే గోల్కొండ ఎక్స్‌ప్రెస్ రైలు డోర్నకల్ - సికింద్రాబాద్‌ల మధ్య రద్దు చేశారు. ఇదే కాకుండా మరి కొన్ని రైళ్లను దారి మళ్లించి నడిపిస్తున్నామని రైల్వే అధికారులు తెలిపారు.



వరంగల్ రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్

అవస్థ పడిన ప్రయాణికులు

వరంగల్ నగరంలో భారీ వర్షం కురుస్తుండడంతో ప్రయాణికులంతా నిలిచిపోయిన రైళ్లలోనే ఉండిపోయారు. ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా వరంగల్ రైల్వేస్టేషన్ మేనేజర్ సారయ్య ఆధ్వర్యంలో సిబ్బంది ప్రయాణికులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. అలాగే హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసి ప్రయాణికులకు ఎప్పటికప్పుడు రైళ్ల రాకపోకల సమాచారం అందజేశారు. వరంగల్-గుంటూరు మధ్య నడిచే ఇంటర్‌సిటి ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేయడంతో మహబూబాబాద్, కేసముద్రం ప్రయాణికులు బస్సుల్లో వెళ్లారు. విజయవాడ, గుంటూరు ప్రయాణికులు పుష్‌పుల్ రైల్‌లో సికింద్రాబాద్‌కు తిరిగి వెళ్లారు. అలాగే ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ కాజీపేట, బీబీనగర్ మీదుగా దారి మళ్లించారు. ఇదిలా ఉండగా బుధవారం ఉదయం నుంచి కురుస్తున్న వర్షంతో సాయంత్రం వరంగల్ రైల్వేస్టేషన్ పట్టాలపైకి వర్షం నీరు చేరుకుంది. అయితే రైళ్ల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలుగలేదు. రాత్రి 8.30 వరకు వరంగల్-విజయవాడ మార్గంలో రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి.

వర్షాన్ని సైతం లెక్క చేయకుండా..

- యూరియా కోసం భారీగా తరలి వచ్చిన రైతులు
- పంపిణీ చేయని అధికారులు
- మహిళా రైతు గొలుసు చోరీ

బయ్యారం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో యూరియా పంపిణీ కేంద్రం వద్దకు వర్షాన్ని సైతం లెక్క చేయకుండా రైతులు బుధవారం భారీగా తరలివచ్చారు. అయితే మొంథా తుఫాన్ ప్రభావంతో భారీ వర్షం కారణంగా పరిస్థితులు అనుకూలించకపోవడంతో అధికారులు యూరియా పంపిణీని నిలిపివేశారు. ఈ క్రమంలోనే యూరియా కోసం వచ్చిన ఓ మహిళా రైతుకు చెందిన బంగారు గొలుసు అపహరణకు గురైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఉప్పలపాడులో యూరియా పంపిణీ చేయనున్నారని తెలియడంతో రైతులు బుధవారం తెల్లవారుజామున పంపిణీ కేంద్రం వద్దకు భారీగా తరలివచ్చారు. భారీగా వర్షం కురుస్తుండటంతో గంటల కొద్ది గొడుగులతో క్యూలో నిల్చున్నారు. వర్షం ఎంతకు తగ్గుముఖం పట్టకపోవడంతో అధికారులు యూరియా పంపిణీని నిలుపుదల చేశారు. భద్రతా కారణాల దృష్ట్యా యూరియా లారీని కూడా అక్కడి నుంచి పంపించడంతో పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా ఓ పక్క భారీ వర్షం కురుస్తుంటే యూరియా పంపిణీ ఉందని ఎలా సమాచారం ఇచ్చారని పలువురు రైతులు సిబ్బందితో వాగ్వాదానికి దిగగా గందరగోళ పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలోనే యూరియా కోసం వచ్చిన నర్సాతండాకు చెందిన మహిళా రైతు జ్యోతికి చెందిన బంగారు గొలుసు అపహరణకు గురైంది. అపహరణకు గురైన బంగారు గొలుసు సుమారు పది గ్రాముల బరువు ఉంటుందని సమాచారం. ఎంత వెతికినా గొలుసు కనపడకపోవడంతో ఆమె బోరున విలపించింది. యూరియా పంపిణీ విషయమై ఏవో రాజును వివరణ కోరగా తొలుత వాతావరణం పొడిగా ఉండటంతో రైతులకు సమాచారం ఇచ్చామని, అనంతరం భారీ వర్షం కారణంగా పంపిణీని నిలుపుదల చేసినట్లు తెలిపారు. యూరియాను బయ్యారం పీఏసీఎస్ సొసైటీ నందు నిల్వ చేసినట్లు వెల్లడించారు. వాతావరణం పొడిగా మారిన అనంతరం ఉప్పలపాడు రైతులకు యూరియాను పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.



ఉప్పలపాడులో యూరియా కోసం వేచి చూస్తున్న రైతులు

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి
- అధికారులతో ఎంపీ కావ్య టెలి కాన్ఫరెన్స్

హనుమకొండ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ ప్రభావంతో వరంగల్, హనుమకొండ, జనగామ, భూపాలపల్లి జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా ప్రజల భద్రతపై అధికారులు పూర్తి అప్రమత్తంగా ఉండాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య సూచించారు. కలెక్టర్లు, రెవెన్యూ, పోలీసు, విద్యుత్, మున్సిపల్, పంచాయతీరాజ్, రోడ్డు భద్రత తదితర శాఖల అధికారులతో ఎంపీ కావ్య టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్ష ప్రభావిత ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పరిస్థితులను నిరంతరం పరిశీలిస్తూ తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరే ప్రమాదం ఉన్న గ్రామాలు, కాలనీల ప్రజలను ముందుగా సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగులు, చెరువులు, వంతెనల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఎంపీ సూచించారు. రైతుల పంటలకు నష్టం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, భారీ వర్షాల నేపథ్యంలో ఎవరూ చేపలు పట్టడానికి నీటి ప్రవాహం వైపు వెళ్లరాదని అన్నారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు వెళ్లవద్దని, అత్యవసర సహాయార్థం అధికారులు ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్లకు సంప్రదించాలన్నారు. వర్షాల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని సహాయక బృందాలను సిద్ధం చేయాలని, అవసరమైన ఆహార పదార్థాలు, వైద్య సహాయం, ట్రాన్స్‌పోర్టు ఏర్పాట్లపై దృష్టి పెట్టాలని కలెక్టర్లకు ఎంపీ కావ్య సలహా ఇచ్చారు. అన్ని శాఖల సమన్వయంతో వర్షాల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని, ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.


భారీ వర్షాలు.. తస్మాత్ జాగ్రత్త

అధికారులతో కలెక్టర్ స్నేహ శబరీష్ సమీక్ష

హనుమకొండ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కురుస్తున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల పరిస్థితిపై జిల్లా అధికారులతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాలో వరద పరిస్థితులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మొంథా తుఫాన్‌తో భారీ వర్షాలు ఉన్నందున అన్నిశాఖ అధికారులు అప్రమత్తంగా ఉంటూ జిల్లాలోని వర్ష ప్రభావం స్థితిగతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. భారీవర్షాల వల్ల ఉత్పన్నమైన పరిస్థితులపై ప్రజలు అప్రమత్తం చేయాలన్నారు. ప్రాణ, ఆస్తి నష్టాలు కలగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో వర్ష ప్రభావం, పరిస్థితి గురించి ఎప్పటికప్పుడు తెలియ చేయాలన్నారు. ఎడతెరిపి లేకుండా మరిన్ని రోజుల పాటు భారీ వర్షాలు కురవనున్న నేపథ్యంలో అధికారులు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి నష్టం వాటిల్ల కుండా చర్యలు చేపట్టాలన్నారు.

కేయూ అథ్లెటిక్స్ ఎంపికలు వాయిదా

కేయూ క్యాంపస్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని గురు, శుక్రవారాల్లో జరగాల్సిన అంతర్ కళాశాలల స్త్రీ, పురుషుల అథ్లెటిక్ క్రీడా పోటీలను తాత్కాలికంగా భారీవర్షాల నేపథ్యంలో వాయిదా వేసినట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య బుధవారం తెలిపారు. ఆయా పోటీలను వర్షాలు తగ్గాక నవంబరులో నిర్వహిస్తామని వెల్లడించారు.



గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

కమలాపూర్, అక్టోబర్ 29(ఆంధ్రజ్యోతి) : కమలాపూర్ మండలంలోని 7 గ్రామాలలోని ఐకేపీ ధాన్యం కొనుగొలు కేంద్రాలను కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఎఎంసి) చైర్మెన్ తవుటం ఝాన్సీరాణి రవీందర్ బుధవారం ప్రారంభించారు. మండలంలోని శనిగరం, మాదన్నపేట, శ్రీరాములపల్లి, నేరేళ్ళ, పంగడిపల్లి, మర్రిపల్లిగూడెం, గుండేడు గ్రామలలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన అనంతరం ఝాన్సీరాణి మాట్లాడుతూ.. మొంథా తుఫాన్ వల్ల వరి ధాన్యం తడిసినా ఆఖరి గింజవరకు కొనుగోలు చేస్తామన్నారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని అధికారులను ఝాన్సీరాణి ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ దేశిని ఐలయ్య గౌడ్, ఐకేపీ ఏపీఎం లలిత, మాజీ సర్పంచ్ గుండవు చరణ్ పటేల్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కెత్తే విజేందర్, చకిలం దయాకర్, యాకుబ్ పాషా, నెగ్గుల లింగయ్య, కాంగ్రెస్ పార్టీ యూత్ మండల అధ్యక్షుడు దూడ శ్రీకాంత్ పాల్గొన్నారు.

పరకాలలో కుప్పకూలిన యాగశాల



వర్షానికి కూలిన యాగశాల

పరకాల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసంలో భాగంగా పరకాల పట్టణంలోని భవానీ కుంకుమేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే మహారుద్రయాగం చేసేందుకోసం ఏర్పాటు చేసిన యాగశాల వర్షాలకు బుధవారం కుప్పకూలింది. మొంథా తుఫాను ప్రభావంతో నవంబరు 3వ తేదీన నిర్వహించతలపెట్టిన యాగాన్ని ఎట్టకేలకు పూజారులు, ఉత్సవ సమితి వాయిదా వేసింది. తిరిగి ఎప్పుడు యాగం నిర్వహించేది త్వరలోనే ప్రకటిస్తామని ఆలయ చైర్మన్ కొలుగూరి రాజేశ్వర్‌రావు, యాగ సమితి నిర్వాహకులు యర్ర లక్ష్మణ్, గండె రవి తెలిపారు.

డంపింగ్ యార్డును తొలగించకపోతే ఆమరణ దీక్ష చేస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న దువ్వ నవీన్

కాజీపేట, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : డిసెంబరు నాటికి మడికొండ డంపింగ్ యార్డును ఎత్తి వేస్తామని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు ఇచ్చిన హామీ, అమలు దిశగా ఎటువంటి చర్యలు కనిపించడంలేదనీ, డంపింగ్ యార్డు తొలగించకపోతే ఆమరణ దీక్ష చేస్తానని బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు దువ్వఖి నవీన్ అన్నారు. కాజీపేట మీడియా పాయింట్‌లో బుధవారం గ్రామస్తులు, బీజేపీ నాయకులతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. మడికొండ డంపింగ్ యార్డుతో గాలి కాలుష్యం, వర్థ్యాల దహనం, నీటి కాలుష్యం, చర్మ వ్యాధులు వంటి సమస్యలతో స్థానికుల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్ డంపింగ్ యార్డు ఎత్తివేతపై అసెంబ్లీలో చర్చించి బయో మైనింగ్ యంత్రాలు తీసుకువచ్చారని, కానీ ఇప్పటి ప్రభుత్వం ఆ యంత్రాలను నిలిపివేశారన్నారు. 10 లక్షల మెట్రిక్ టన్నుల వ్యర్థాలు 30 ఎకరాల్లో పేరుకుపోయిందని తెలిపారు. ఈ డంపింగ్ యార్డుతో ధర్మసాగర్, రాంపూర్, ఎల్కుర్తి ప్రాంతాలకు ప్రభావితం అవుతున్నా ఎమ్మెల్యే కడియం శ్రీహరి పార్టీలు మారుతూ ప్రజాసమస్యలు మరిచిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మీడియా సమావేశంలో 46వ డివిజన్ అధ్యక్షుడు పిట్టల రమేశ్, నాయకులు వెంకట్‌రావు, రుత్విక్ రెడ్డి, కుక్కల రాకేశ్, బైరి సతీష్, బండరాజు పి. రాజ్‌కుమార్ ఆర్. సాంబమూర్తి, కుమార్, కార్తీక్, శివకుమార్, సాయిచరణ్, శరత్, నాని తదితరులు పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన కాంగ్రెస్

ఆర్‌ఎల్‌డీ రాష్ట్ర అధ్యక్షుడు కపిలవాయి దిలీప్ కుమార్



మీడియాతో మాట్లాడుతున్న కపిలవాయి దిలీప్ కుమార్

వడ్డేపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిందని రాష్ట్రీయ లోక్ దళ్ (ఆర్‌ఎల్‌డీ) రాష్ట్ర అధ్యక్షుడు కపిలవాయి దిలీప్ కుమార్ అన్నారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కాలంలో బీసీలలో చైతన్యం పెల్లుబికి వచ్చిందని, అగ్ర వర్ణాల దోపిడీ పాలనను అంతమొందించాలంటే, ఎస్సీ, ఎస్టీలతో జత కట్టి రాజ్యాధికారాన్ని సాధించాల్సిన అవసరం ఉందన్నారు. గత ఎన్నికల సందర్భంగా 420 హామీలను ఇచ్చి అధికారాన్ని చేజిక్కించుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఏమి చేసిందో శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీ వర్గానికి చెందిన మహిళా మంత్రి కొండా సురేఖ పట్ల సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహార శైలీని ఆమె కుమార్తె సుస్మిత స్వయంగా ఎండగట్టారని అన్నారు. ఈ పరిణామాలకు సీఎం రేవంత్‌రెడ్డి బీసీలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని తమ పార్టీ డిమాండ్ చేస్తోందని పేర్కొన్నారు. ఆర్‌ఎల్‌డీ ఆధ్వర్యంలో చేపట్టిన సామాజిక చైతన్య రథయాత్ర వరంగల్‌కు చేరిందన్నారు. ఈ సందర్భంగా హనుమకొండలో ఆర్‌ఎల్‌డీ సాంస్కృతిక కళాబృందం ప్రతినిధి బుల్లెట్ వెంకన్న ఆధ్వర్యంలో సాంస్కృతిక ప్రదర్శనలను నిర్వహించినట్లు దిలీప్ కుమార్ తెలిపారు. ఈ సమావేశంలో ఆర్‌ఎల్‌డీ స్పోక్స్ పర్సన్ బీరప్ప, రాష్ట్ర, జిల్లా నాయకులు మల్లేశ్, రిషబ్ జైన్, నరసింహారావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానం



అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రెంటాల కేశవరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ నడుముల విజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

హనుమకొండ టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఏకశిలా పార్క్ బాలసముద్రం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ట్రై సిటీస్ అపార్ట్‌మెంట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రెంటాల కేశవరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ నడుముల విజయ్‌కుమార్‌లను బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు వంగ రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి పడాల సోమయ్య, గౌరవ అధ్యక్షుడు చాడ దశరథ్ రాంరెడ్డి, పచ్చికమట్ల ఎల్లగౌడ్, గోపాలరెడ్డి, రవీందర్ రెడ్డి అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

దామెర, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఊరుగొండ గ్రామంలో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా సీనియర్ నాయకులు వీసం రమణారెడ్డి తండ్రి వీసం రాంచంద్రారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం ఊరుగొండలో బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల సమక్షంలో దశ దిన కర్మ క్రతువును నిర్వహించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులను పలువురు ప్రముఖులు పరామర్శించి, తమ సంతాపం, సానుభూతి తెలిపారు. ఇందులో తెలంగాణ రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల పెంప కందారుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ కన్నెబోయిన రాజయ్య, రెడ్డి సంఘం జిల్లా నాయకులు గొంది జగన్‌మోహన్‌రెడ్డి, మన్నెం ఇంద్రారెడ్డి, బొల్లు సమ్మిరెడ్డి, గోగుల సత్యనారాయణరెడ్డి, బొల్లు రాజు, మల్లాడి కృష్ణారెడ్డి, బొల్లు సమ్మిరెడ్డి, బొల్లు శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షంతో అతలాకుతలం

లోతట్టు ప్రాంతాలు జలమయం

గంటల కొద్దీ ట్రాఫిక్ జాం

విద్యుత్ సరఫరాకు అంతరాయం



కేయూలోకి చేరిన వర్షపు నీరు



జలమయమైన జవహర్ కాలనీ



కాజీపేటలో జలమయమైన రహదారి



భీమారం అంగన్‌వాడీ కేంద్రంలోకి చేరిన నీరు

వడ్డెపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ నేపథ్యంలో హనుమకొండలో బుధవారం ఎడతెరపి లేకుండా భారీ వర్షం కుసింది. వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. జనజీవనం స్తంభించింది. ఈదురు గాలులకు పలుచోట్ల వృక్షాలు, చెట్లు నేలకూలి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. భారీ వర్షానికి హనుమకొండలోని భవానీనగర్, ఇందిరానగర్, అశోక కాలనీ, వికాస్‌నగర్, జవహర్ కాలనీ, ద్వారకసాయి కాలనీ, పరిమళ కాలనీ, సదాశివ కాలనీ, ప్రకాశ్‌రెడ్డిపేట, ఇందిరమ్మ కాలనీ వంటి లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ప్రజలు బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. పలు కాలనీల్లో ఇళ్లలోకి నీరు చేరి నిత్యావసర వస్తువులు, బియ్యం తడిసిపోయాయి. వికాస్ నగర్‌లో భారీ వృక్షం కూలడంతో డీఆర్ఎఫ్ సిబ్బంది కూలిన చెట్టును తొలగించారు.

కాజీపేటలో రోడ్లన్నీ జలమయం

కాజీపేట : కాజీపేటలో బుధవారం కురిసిన వర్ష బీభత్సంతో జనాలు అల్లాడిపోయారు. ఉదయం నుంచే ప్రారంభమైన ఈ వర్షం ఎడతెరిపి లేకుండా కురవడంతో నీరు ప్రధాన రహదారి, ఫాతిమానగర్, వరంగల్- హైదరాబాద్ ప్రధాన పహదారి డీజిల్ కాలనీ వద్ద రోడ్లన్నీ జలమయం అయ్యాయి. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. డీజిల్ కాలనీ కల్వర్టు వద్ద వరదనీరుతో ఉదయం నుంచి రాత్రి వరకు గంటలకొద్దీ వాహనాలు నిలిపోయాయు.. హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలు, హైదరాబాద్ నుంచి వరంగల్ వచ్చే ప్రధాన రహదారి మార్గంలో వాహనదారులు ట్రాఫిక్‌లో గంటలకొద్దీ చిక్కి అల్లాడిపోయారు. సోమిడి చెరువు వరద నీరుతో మునిగిపోయింది. కాజీపేటలో ప్రధాన రహదారులన్నీ జలమయం కావడంతో స్థానికులు ఇండ్లల్లోంచి బయటకు రాకుండా కర్ఫ్యూ వాతావరణం నెలకొంది.

హసన్‌పర్తిలో...

హసన్‌పర్తి : ముంథా తుపాను ప్రభావంతో పంచాయతీ గ్రామాలతో పాటు విలీన గ్రామాల ప్రజలు భయంతో వణికిపోతున్నారు. ఉదయం నుంచి కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పలుకాలనీలు జలమయమయ్యాయి. ఆయా గ్రామాలలో వరదనీటి ప్రభావంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బీమారం చెరువు మత్తడి పడడంతో కట్టను ఆనుకొని ఉన్న అంగన్‌వాడీ కేంద్రం నీట మునిగింది. బీమారంలోని పలు కాలనీలలో ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. బీమారం శ్యామల చెరువు మత్తడి పడడంతో నాలాలు నిండి పలు కాలనీలు నీట మునిగి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. భీమారం బస్టాండు ప్రాంతం కరీంనగర్-హనుమకొండ ప్రధాన రహదారిపై, చింతగట్టు క్యాంపు ప్రధాన రహదారిపై వరదనీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ప్రధాన రహదారిపై వరద ఉధృతి పెరగడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పలేదు. కరీంనగర్-హనుమకొండ వైపుగా ఆయా గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు, వాహనదారులు గంటల తరబడి నిలబడాల్సి రావడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కేయూ ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్ పోలీసు సిబ్బంది సహాయంతో రక్షణ చర్యలు చేపట్టి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చేశారు..

కేయూ క్యాంపస్‌లో...

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్‌లో వరద బీభత్సం సృష్టించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు కుండపోత వర్షానికి కేయూ కకావికలమైంది. మెస్‌లు, వంటశాలల్లోకి నీరు చేరింది. వంటపాత్రలు కొట్టుకుతున్నాయి. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లోకి నీళ్లు చేరాయి. డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో నీరు వర్సిటీ క్యాంపస్‌లోని లోతట్టు ప్రాంతాలకు చేరుతోంది. గణపతిదేవా-2 హాస్టల్ రూంలోకి నీరు చేరింది. క్యాంపస్‌లో అడుగుతీసి అడుగుపెట్టే పరిస్థితి లేదు.

తుఫాన్‌తో అన్నదాత ఆగమాగం



ఎల్కతుర్తి మండలం దండేపల్లిలో నీట మునిగిన ధాన్యం

వేల ఎకరాల్లో నేల వాలిన వరిపైర్లు

నీట మునిగిన వరి ధాన్యపు రాశులు

ఎల్కతుర్తి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఎల్కతుర్తి మండల పరిధిలో బుధవారం ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురుస్తుంది. కోత కొచ్చిన వరి పంటలు పూర్తిగా నేల వాలడంతో పాటు విక్రయానికి సిద్ధంగా ఉన్న ధాన్యపు రాశులు పూర్తిగా నీట మునిగి తీవ్ర నష్టం వాటిల్లింది. వరి కోతల సమయంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పంట చేతికందే సమయంలో పైర్లు పూర్తిగా నేల వారి భారీ నష్టం వాటిల్లింది. అలాగే వరి కోసి కళ్లాల వద్ద, కొనుగోలు కేంద్రాల వద్ద వరి ధాన్యాన్ని ఆరబోసిన రైతులకు కన్నీరేమిగిలింది. ధాన్యపు రాశులు పూర్తిగా నీట మునిగాయి. కొనుగోలు కేంద్రాలు పేరుకే ప్రారంభించినప్పటికీ ధాన్యాన్ని మాత్రం ఇప్పటి వరకు కొనుగోలు చేయడం లేదని రైతులు ఆరోపిసున్నారు.

ధర్మసాగర్ మండలంలో...

ధర్మసాగర్ : మొంథా తుఫాన్‌తో ధర్మసాగర్ మండలంలోని 19.గ్రామాలలో ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండటంతో జనం ఇళ్లలో నుంచి బయటికి రాలేదు. వర్షం నీరు ఇళ్లలోకి చేరడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. ధర్మసాగర్ మండలం ముప్పారం చెరువు మత్తడి పడింది. ముప్పారం గ్రామం నుంచి వేలేరు ప్రైయివేట్ పాఠశాలకు వెళ్లిన విద్యార్థులు ముప్పారం తాళ్ళ వద్ద ఉన్న వడ్డోని వాగు, ఎస్సీకాలనీ సమీపంలో ఉన్న వాగుల బండా వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో వేలేరు నుంచి వస్తున్న ముప్పారం ఎస్సీ కాలనీకి చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, డ్రైవర్ కాలనీకి చేరుకోకుండా ముప్పారంలో ఓ ఇంట్లోనే ఉండిపోయారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

దామెర : మొంథా తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై కొంక అశోక్ తెలిపారు. బుధవారం మండల కేంద్రం పోలీస్ స్టేషన్‌లోని తన ఛాంబర్‌లో ఎస్సై కొంక అశోక్ మాట్లాడారు. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఎవరూ కూడా బయటికి రావద్దని, అత్యవసరమైతేనే బయటికి వెళ్లాలని సూచించారు. ఇప్పటికే పలు గ్రామాల్లోని చెరువులు, కుంటలు పూర్తి స్థాయిలో నిండి మత్తడి పోసే స్థాయికి చేరుకున్నాయని తెలిపారు. అలాగే రోడ్లపై ప్రయాణం చేసే సమయంలో గుంతలను గమనించాలని కోరారు. ప్రజా సంక్షేమమే పోలీసు బాధ్యత అని స్పష్టం చేశారు. ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100కు ఫోన్ చేయాలని ఎస్సై అశోక్ తెలిపారు.

సహాయక చర్యలు చేపట్టాలి : ఎంపీడీవో

దామెర : మొంథా తుఫాన్ కారణంగా ఎక్కడైనా నిర్మాణాలు, కట్టడాలతో ప్రజలకు అంతరాయం ఏర్పడితే సత్వరమే సహాయక చర్యలు చేపట్టాలని ఎంపీడీవో గుమ్మడి కల్పన సూచించారు. బుధవారం మండలంలోని ఊరుగొండ-పసరుగొండ రోడ్డులోని శిథిలావస్థలో ఉండి, వర్షపు నీరు పారుతున్న కల్వర్టును ఎంపీడీవో కల్పన తమ అధికారులతో కలిసి పరిశీలించారు. భారీ వర్షాలతో కల్వర్టుపై నుంచి వెళుతున్న నీటి ప్రవాహంతో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఇందులో ఎంపీవో కె.వి.రంగాచారి, జీపీ సెక్రటరీ రామ్మూర్తి పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారులు జాగ్రత్తలు పాటించాలి

దామెర : మండల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు, రైతులు విద్యుత్ వినియోగం పట్ల జాగ్రత్తలు పాటించాలని విద్యుత్ ఏఈ గుర్రం రమేష్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. మొంథా తుఫాన్ కారణంగా భారీగా కురుస్తున్న వర్షాలతో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే రైతులు తమ పంట పొలాల వద్ద విద్యుత్ సమస్యలు ఉన్నట్లయితే విద్యుత్ సిబ్బందికి లేదా విద్యుత్ సబ్ స్టేషన్‌కు గానీ విద్యుత్ ఏఈకి గానీ తెలియ చేయాలని కోరారు.

కంఠాత్మకూర్‌లో రాకపోకలు బంద్

నడికూడ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ వల్ల మండలంలోని కంఠాత్మకూర్ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో పరకాల-హనుమకొండకి రాకపోకలు నిలిచిపోయాయి. బుధవారం తెల్లవారుఝాము నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి వాగు ప్రమాదకరంగా మారింది. అంబాల మీదుగా హనుమకొండకి ప్రయాణించే వాహనదారుల భద్రత దృష్ట్యా రోడ్డుపై బారీకేడ్లు ఏర్పాటుచేశారు. పరకాల నుండి అంబాల మీదుగా హనుమకొండకి వెళ్లాలంటే నడికూడ, శనిగరం, మాదన్నపేట, గూనిపర్తి మీదుగా ప్రయాణాలు చేసుకోవాలని, ప్రమాదాలు జరిగే అవకాశాలున్నందున వాగు పరిసరాలకు ప్రజలు వెళ్లరాదని పోలీసులు హెచ్చరించారు.



కంఠాత్మకూర్‌లో ప్రజలు నడవకుండా బారికేడ్ల ఏర్పాటు

అవినీతి రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం

పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా డీజీఎం రాములు



మాట్లాడుతున్న పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ డీజీఎం ఆర్.రాములు

దామెర, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక్కరూ అవినీతి రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా కృషి చేయాలని పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ డీజీఎం ఆర్.రాములు కోరారు. బుధవారం దామెర మండలం ఒగ్లాపూర్ గ్రామంలోని పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో హ నుమకొండలోని పబ్లిక్ గార్డెన్స్‌లో 'విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్' కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా "జాగరూకత మన అందరి బాధ్యత" అనే నినాదంతో చేపట్టిన వాక్‌థాన్ కార్యక్రమంలో డీజీఎం రాములు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. అవినీతి రహిత, బాధ్యతాయుత సమాజ నిర్మాణం కోసం అందరూ అంకిత భావంతో కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో నిజాయితీ, పారదర్శకత, బాధ్యత విలువలను పోత్సహించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.కార్యక్రమంలో పవర్‌గ్రిడ్ సంస్థ మేనేజర్ కె.సూర్యప్రకాశ్, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

విద్యార్థి జీవితంలో ఇంటర్ విద్య కీలకం

మోషన్ కాలేజీ చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్



విద్యార్థినిని మెమెంటో ఇస్తున్న మోషన్ కాలేజీ చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్, తదితరులు

హనుమకొండ టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి జీవితంలో ఇంటర్ విద్య కీలకమని మోషన్ ఐఐటీ, నీట్ జూనియర్ కళాశాల చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ అన్నారు. హనుమకొండ నయీంనగర్ బ్లీస్ కన్వెన్షన్ హాల్‌లో కోటా రాజస్థాన్ మోషన్ జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థి గొప్ప లక్ష్యాన్ని ఎంచుకొని లక్ష్య సాధన కోసం నిరంతర కృషి చేస్తేనే జీవితంలో విజయం సాధిస్తారని అన్నారు. మోషన్ కాలేజీ మొదటి బ్యాచ్‌లో మెడిసిన్, ఐఐటీ సాధించిన ఐదుగురు విద్యార్థులను ఘనంగా సన్మానించి మెమోంటోతో పాటు ప్రతి ఒక్కరికి రూ.5వేల నగదును యాజమాన్యం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ పెరుమాండ్ల అనిల్‌గౌడ్, ప్రిన్సిపాల్ ముత్యాల సురేష్, కోటా అధ్యాపకులు అనుజికపూర్, ప్రదీప్ ఎపారక్, సురేందర్ సాహూ, మిథున్, ఇంటర్ అధ్యాపకులు శ్రీనివాస్‌రెడ్డి, లాండిగ రమేష్, కాలేజీ స్టాఫ్ తాళ్లపెల్లి రమేష్, మండల రాజు, లక్ష్మణ్, శనిగరపు సుమన్, రచ్చ కుమార్, అరుణ, మౌనిక, కడారి అనిల్, మధు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు ఫిజియోథెరపీ?

కౌన్సెలింగ్

డాక్టర్! ఫిజియోథెరపీ సుఖ ప్రసవానికి తోడ్పడుతుందనీ, ప్రసవం తదనంతర ఆరోగ్యానికి కూడా సహాయపడుతుందనీ వైద్యులు అంటున్నారు. ఇదెంతవరకూ నిజం? గర్భిణులు ఫిజియోథెరపీ చేయవచ్చా?

- ఓ సోదరి, హైదరాబాద్.

గర్భిణిగా ఉన్న సమయంలో, ప్రసవానికి ముందు, ప్రసవ సమయంలో, ప్రసవం తర్వాత కలిగే శారీరక ఇబ్బందు



లను ఎదుర్కోవటానికి, వాటిని అదుపులోకి తెచ్చుకోవటానికి ఫిజియోథెరపీ ఎంతో ఉపయోగపడుతుంది.


- గర్భం దాల్చినప్పుడు శరీరంలో ఎన్నో మార్పులొస్తాయి. వెన్ను, నడుము నొప్పి, కాళ్ల వాపులు లాంటి ఇబ్బందులు ప్రారంభంలో ఉంటాయి. మూత్రాశయం మీద ఒత్తిడి పెరిగి మూత్రం ఆపుకోలేకపోవటం (యూరినరీ ఇన్‌కాంటినెన్స్) లాంటి సమస్య మొదలవుతుంది. ఇలాంటి వాటికి వేడి, చల్లని కాపడం పెట్టడం, స్ట్రెచెస్ చేయించటం లాంటి వ్యాయామాలు ఉపయోగపడతాయి
- మూత్రాన్ని అదుపు చేయగలిగే కటి కండరాలను బలపరిచే వ్యాయామాలు చేయాల్సి ఉంటుంది
- కొందరికి ఆరో నెలలోనే ఎనిమిది నెలల గర్భంలా పొట్ట ఎత్తుగా తయారవుతుంది. ఇందుకు కారణం వాళ్ల శరీరాకృతిని సరిగా అనుసరించకపోవటమే! ఇలాంటి శరీరాకృతి సమస్యల వల్ల కండరాల మీద ఒత్తిడి పెరిగి నొప్పులు మొదలవుతాయి. ఈ నొప్పులు రాకుండా ఉండాలంటే ఫిజియోథెరపిస్టులను సంప్రదించి శరీర భంగిమలను సరిదిద్దుకోవాలి
- సుఖ ప్రసవం జరగాలంటే నడుములోని కండరాలు బలంగా కలిగి ఉండాలి. ఇందుకోసం క్రమం తప్పకుండా కొన్ని వ్యాయామాలను చేయాల్సి ఉంటుంది. అలాగే ప్రసవ సమయంలో ఎంతో ఆందోళనకు, ఒత్తిడికి లోనవుతూ ఉంటారు. ఇలాంటప్పుడు ఊపిరి ఎలా తీసుకోవాలి? ఎప్పుడు రిలాక్స్ అవ్వాలి? ఎప్పుడు గాలి లోపలికి తీసుకుని ప్రసవం జరిగేలా పుషింగ్ బ్రీతింగ్ చేయాలి? అన్నది ఫిజియోథెరపిస్టులు సూచిస్తారు
- ప్రసవం తర్వాత వదులైన కండరాలను తిరిగి బిగుతుగా చేసుకోగలిగే వ్యాయామాల విషయంలో కూడా ఫిజియోథెరపిస్టుల సహాయంతో చేయాలి.
- ప్రసవం జరిగిన తీరును బట్టి త్వరగా కోలుకోవటానికి అనుసరించవలసిన పద్ధతులు, పాలిచ్చే విధానం, నొప్పిని అదుపులోకి తెచ్చుకోగలిగే పద్ధతులను కూడా ఫిజియోథెరపీలో తెలుసుకోవచ్చు.

- డాక్టర్ మానస,
సీనియర్ ఫిజియోథెరపిస్ట్, హైదరాబాద్.

హాయిగా నిద్ర పట్టాలంటే...

ఎలాంటి ఆలోచనలు, ఒత్తిడి, ఆందోళన లేకుండా ప్రశాంతంగా నిద్రపోవడం వల్ల ఆరోగ్య సమస్యలు దరిచేరవని నిపుణులు సూచిస్తున్నారు. అలా హాయిగా నిద్ర రావాలంటే పడుకునేముందు ఏ జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం...

- చాలామంది పడుకునేముందు కుటుంబ సమస్యలు, ఆర్థిక వ్యవహారాలు, ఆఫీసు పని తదితరాల గురించి ఆలోచిస్తుంటారు. ఇలాచేయడం వల్ల మనసంతా ఆందోళనలతో నిండి నిద్ర కరవవుతుంది. అలాకాకుండా పడుకునే ముందు ఆ రోజు జరిగిన సంతోషకరమైన సంఘటనలను లేదా జీవితంలో సాధించిన విజయాలను ఒకసారి గుర్తు చేసుకుంటే మనసంతా సంతోషంతో నిండుతుంది. వెంటనే నిద్ర వచ్చేస్తుంది కూడా.



- పడుకునేముందు సామాజిక మాధ్యమాల్లో గడపడం వల్ల తెలియకుండానే సమయం మించిపోతుంటుంది. దీనివల్ల నిద్ర సరిపోక కళ్ల మండడం, తలనొప్పి, అలసట తీరకపోవడం లాంటి సమస్యలు వస్తుంటాయి. రాత్రి పడుకోవడానికి గంట ముందు నుంచే ఫోన్, టీవీలను చూడడం మానేయాలి. సాధ్యమైనంత వరకూ స్క్రీన్ సమయాన్ని తగ్గించుకునే ప్రయత్నం చేయడం మంచిది.
- రాత్రి భోజనాన్ని త్వరగా ముగించాలి. నూనె పదార్థాలు, మసాలాలతో నిండిన ఆహారం కాకుండా తేలికగా జీర్ణమయ్యే వాటిని మాత్రమే మితంగా తినాలి. కడుపులో తేలికగా ఉంటే హాయిగా నిద్ర పడుతుంది. పడుకోవడానికి అరగంట ముందు గోరువెచ్చని పాలు తాగితే వెంటనే నిద్ర ముంచుకొస్తుంది.
- పడక గది ప్రశాంతంగా ఆహ్లాదకరంగా ఉండేలా చూసుకోవాలి. సాధ్యమైనంతవరకూ ఎక్కువ వెలుతురు లేకుండా గదిని చీకటిగా ఉంచుకుంటే చక్కగా నిద్ర పడుతుంది. పడకగదిలో ఫోన్‌కు బదులు గడియారంలో అలారం సెట్‌చేసుకోవడం మంచిది.
- రోజూ ఒకే సమయానికి పడుకోవడం, లేవడం అలవాటు చేసుకుంటే రోజంతా ఉల్లాసంగా ఉంటుంది.

సంకల్పం





దశాబ్దాలుగా జీవన స్రవంతిలో మిళితమై... ఒక వెలుగు వెలిగిన 'ముగ, ఎరి' పట్టు... తెరమరుగైపోవడం ఆమెను కలవర పెట్టింది. ఈ వారసత్వ కళకు పూర్వ వైభవం తెచ్చి... భావి తరాలకు అందించాలన్న సంకల్పం ఆమెను మరో అడుగు ముందుకు వేయించింది. అదే... గృహహింస బాధితులైన గ్రామీణ మహిళలకు ఉపాధి మార్గమైంది. వారిని సాధికారత వైపు నడిపించి... గౌరవప్రదమైన జీవితాన్ని అందించి... సంప్రదాయ పట్టుకు ఎనలేని ఆదరణ కల్పిస్తున్నారు **జాగృతి**. ఆమె అంతరంగం ఇది.

సంప్రదాయ పట్టుకు పునరుజ్జీవం

"అసోం రాష్ట్రం... బ్రహ్మపుత్ర నదీ తీరం... ధెమాజి పట్టణం... సూర్యోదయం వేళ ఆ ప్రాంతంలో అడుగు పెడితే... మగ్గం శబ్దాలు లయబద్ధంగా వినిపిస్తుంటాయి. ఆ మగ్గాలపై ముగా పట్టు బంగారు దారాలు చక్కని ఆకారంలో ఒదిగిపోతుంటాయి. అక్కడే పుట్టి పెరిగిన నాకు అదంతా ఒక సుమధుర గీతంలా అనిపించేది. మనసుకు ఎంతో ఆహ్లాదంగా ఉండేది. పండుగలు, పెళ్లిళ్లప్పుడు ఆ వస్త్రాలు ధరించి... హొయలు పోయిన జ్ఞాపకాలు ఎన్నో. కానీ నేను పెరిగే క్రమంలో ఆ పట్టు వస్త్రాలు కనుమరుగవుతూ వచ్చాయి.

నా గుండె చప్పుడు...

మాది కూడా నేత కుటుంబమే. నిద్రలేచి, కళ్లు తెరిచే సరికి అమ్మ మగ్గం మీద చీరలు నేస్తూ కనిపించేది. వెంటనే వెళ్లి అమ్మ పక్కన కూర్చొని... ఆ కళాత్మకమైన పనితనాన్ని ఆస్వాదించేదాన్ని. ఎంతలా అంటే... ఆ మగ్గాల కదలికలు నా గుండె చప్పుడులా మారాయి. అయితే యంత్రాల రాకతో... కుప్పలు తెప్పలుగా వచ్చిపడుతున్న ఆధునిక దుస్తులతో మా ప్రాంత నేతన్నలకు పని తగ్గుతూ వచ్చింది. కొన్నేళ్లకు దాన్ని నమ్ముకున్న వారికి ఉపాధి కూడా కష్టమైంది. ఇది నన్ను కలవరపెట్టింది.

అందరిలా నేనూ...

'నిఫ్ట్'లో ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సు చేసి, తిరిగి మా ఊరు వెళ్లి, సొంతంగా ఒక డిజైనింగ్ స్టూడియో పెట్టాలనేది నా కల. అనుకున్నట్టే ఢిల్లీ వెళ్లి 'నిఫ్ట్'లో కోర్సు పూర్తి చేశాను. మా ఊరు వచ్చాను. అందరు డిజైనింగ్ గ్రాడ్యుయేట్స్‌లా నేను కూడా సృజనకు రెక్కలు తొడిగి, ఫ్యాషన్ పరిశ్రమలో వినూత్న వస్త్ర శ్రేణులను ఆవిష్కరించాలని ఆరాటపడ్డాను. కానీ అందులో దిగాక తెలిసింది... సృజనాత్మక స్వేచ్ఛ పేరుతో ఎంతటి విధ్వంసానికి పాల్పడుతున్నామో! అవసరానికి మించి ఉత్పత్తి, విచ్చలవిడిగా రసాయనాల వినియోగం, తద్వారా విడుదలయ్యే కాలుష్యం, దాని వల్ల పర్యావరణానికి కలిగే హాని... ఇవన్నీ అనుభవంలోకి వచ్చాయి. అన్నిటికీ మించి 'ముగ, ఎరి' పట్టు వస్త్రాలు రూపొందిస్తూ, వారసత్వ కళను నమ్ముకొని జీవిస్తున్న కళాకారులకు జీవనోపాధిని దూరం చేస్తున్నామని తెలిసినప్పుడు ఎంతో బాధ కలిగింది. ఇది కాదు నేను కోరుకున్నది.

'వే ఆఫ్ లివింగ్'...

ఒకప్పుడు మా ప్రాంతంలో ఇళ్లన్నీ మగ్గాల చప్పుళ్లతో... వెలిగిపోతున్న నేతన్నల మోములతో కళకళలాడేవి. కానీ నేను తిరిగి వచ్చేనాటికి ఊళ్లో మగ్గాలు మోగబోయాయి. తరతరాలుగా వస్తున్న వారసత్వ కళ అవసాన దశలో ఉంది. అద్భుతమైన 'ముగ, ఎరి' పట్టుకు పూర్వ వైభవం తేవాలని ఆ క్షణమే సంకల్పించాను. దాని కోసం నాలుగేళ్ల కిందట మా ధెమాజి పట్టణంలో 'వే ఆఫ్



లింగ్ స్టూడియో' నెలకొల్పాను. దాని ద్వారా కనుమరుగు అవుతున్న కళను బతికించే ప్రయత్నం ప్రారంభించాను.

స్టూడియో మాత్రమే కాదు..

కళకు పునరుజ్జీవం కోసమే కాకుండా... మా స్టూడియోను అటు నేతన్నకు, ఇటు గ్రామీణ మహిళలకు ఒక చక్కని వేదికగా మార్చాలని అనుకున్నాను. అందులో భాగంగా తొలుత కళాకారులను కలిసి చర్చించాను. వారి అనుభవాలు, సూచనల నుంచి, మా ప్రాంత రమణీయత నుంచి స్ఫూర్తి పొంది... సంప్రదాయ 'ముగ, ఎరి' పట్టుకు ఆధునికత జోడించి, విభిన్న వస్త్ర శ్రేణులను తీసుకువచ్చాను. అదే సమయంలో పర్యావరణానికి ఎలాంటి హాని కలిగించకుండా, నాణ్యతలో రాజీ పడకుండా, నేటి తరానికి నచ్చేలా చీరలు, స్కార్ఫ్‌లతో పాటు ట్రెండీ దుస్తులను రూపొందిస్తున్నాం.

అంత కంటే ఎక్కువ...

ముఖ్యంగా ముగ పట్టు పురుగులు చాలా అరుదు. ఏమాత్రం కాలుష్యం లేని ప్రాంతాల్లో మాత్రమే జీవించగలుగుతాయి. అవి ఆవాసం ఏర్పరచుకున్నాయంటే అర్థం... అక్కడ పర్యావరణ సమతుల్యత ఉందని. నేలకు, చెట్లకు, మనుషులకు మధ్య సామరస్యం కుదిరిందని. అందుకే ముగ... మా అసోం ప్రజలకు ఒక పట్టు వస్త్రమే కాదు... అది మా గుర్తింపు. రాష్ట్రంలో అతి పెద్ద పండుగైన బిహూకు ముగ పట్టు ధరించడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. దాని మెరిసే దారాలు మా వారసత్వ సంపదకు సజీవ చిహ్నం. అలాగే ఎరి పట్టు కూడా అస్సామీల జీవన గమనంలో ఒక భాగం. ఈ నేపథ్యంలోనే అంతరించిపోతున్న ఈ పట్టును భావి తరాలకు అందించాలని అనుకున్నాను.

మహిళలకు సాధికారత...

మా సంస్థ ఆధ్వర్యంలో 'ముగ, ఎరి' పట్టు పురుగుల పెంపకం చేపట్టాం. దాని కోసం గ్రామీణ మహిళలకు శిక్షణ ఇచ్చాను. మగ్గం పని కూడా నేర్పించాను. ముఖ్యంగా గృహహింసకు బాధితులైన ఒంటరి మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాను. ఇప్పుడు ఎంతోమంది మహిళలు ఒకరిపై ఆధారపడకుండా గౌరవప్రదంగా జీవించగలుగుతున్నారు. కొందరు ఇంటి వద్ద నుంచే పని చేస్తూ, తమ పిల్లలను పోషించుకోగలుగుతున్నారు. సాధికారత వైపు అడుగులు వేస్తున్నారు. రైతులు, నేతన్నలు, వారిని నమ్ముకున్నవారు... ఇక్కడ మా అందరిదీ ఒకే కుటుంబం. అందుకే నాకు లాభాలు, వ్యాపార దృక్పథం కంటే మానవ సంబంధాలు, విలువలే ప్రధానం."

వందమందికి పైనే...

ప్రస్తుతం మా 'వే ఆఫ్ లివింగ్ స్టూడియో' రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ కేంద్రంలో పద్నాలుగు మగ్గాలు ఉన్నాయి. ఒక్కో మగ్గంపై ఎనిమిది మంది కళాకారులు పని చేస్తారు. ప్రత్యక్షంగా దాదాపు వందమందికి పైగానే రైతులు, కళాకారులు ఉపాధి పొందుతున్నారు. మార్కెటింగ్, ఇంటింటికీ వెళ్లి పట్టు దారాలు సేకరించేవారు... ఇలా దాదాపు మరో యాభై మంది సంస్థపై ఆధారపడి జీవిస్తున్నారు. వీరిలో తొంభై శాతంమంది మహిళలే. వీరందరి కృషితో మా స్టూడియోకు మంచి ఆదరణ లభించింది. స్మిత గోద్రెజ్, జాన్వి నిలేకని, రోషినీ నాడార్ లాంటి ప్రముఖుల చొరవతో ప్రపంచ వ్యాప్త గుర్తింపు దక్కింది. ఒక అంతర్జాతీయ సంస్థ మాతో కలిసి పని చేసేందుకు ముందుకు వచ్చింది. అంతిమంగా నా కృషికి తగిన ఫలితం కనిపిస్తోంది. అంతరించిపోతున్న పట్టుకు పూర్వ వైభవం లభిస్తున్నందుకు ఎంతో సంతోషంగా, సంతృప్తిగా ఉంది.

స్ఫూర్తి



ఈ అంధ ప్రొఫెసర్...

19 ఏళ్లకే కంటిచూపు కోల్పోతే అక్కడితో జీవితం ముగిసిపోయిందని నిరుత్సాహ పడలేదు, చదువును ఆపేయలేదు. రెట్టింపు పట్టుదలతో అంచెలంచెలుగా విద్యార్హతలు పెంచుకుంటూ దివ్యాంగ మహిళల గుర్తింపు కోసం కృషికి తోడ్పడే ప్రాజెక్టును సొంతం చేసుకుంది పంజాబ్‌కు చెందిన **కిరణ్**. ఆమె గురించిన మరిన్ని ఆసక్తికరమైన విశేషాలు...

దివ్యాంగ విద్యార్థుల మార్గదర్శి

ఇండియన్ కౌన్సెల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ (ఐసిఎస్ఎస్ఆర్) పాటియాలా... పంజాబ్ యూనివర్శిటీకి చెందిన దృష్టి లోపం కలిగిన మహిళా ప్రొఫెసర్‌కు ఒక ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్టును ప్రదానం చేసింది. దీనికిగాను విద్యా మంత్రిత్వ శాఖ 15 లక్షల గ్రాంటును మంజూరు చేయడం విశేషం.

15 లక్షల గ్రాంట్‌తో...

పంజాబ్‌లో దివ్యాంగ మహిళల గుర్తింపుపై మీడియా, సంస్కృతుల ప్రభావాన్ని అధ్యయనం చేయడమే ఈ ప్రాజెక్టు లక్ష్యం. దృష్టి లోపంతో అనుభవపూర్వకంగా తానెదుర్కొన్న ఇబ్బందులు, అవరోధాలను సాటి దివ్యాంగ మహిళలు ఎదుర్కోకూడదనే ఆలోచనతో, వారి పట్ల మీడియా, సంస్కృతుల దృక్పథాన్ని మార్చాలనే సంకల్పంతో, పంజాబ్‌కు చెందిన కిరణ్ నడుం బిగించింది. కిరణ్... ఈ ప్రాజెక్టు గురించి వివరిస్తూ, భారత దేశ విద్యా మంత్రిత్వ శాఖ మొదటి ఇన్‌స్టాల్‌మెంట్‌లో భాగంగా ఇప్పటికే 40 శాతం గ్రాంట్‌ను విడుదల చేసిందనీ, దివ్యాంగ మహిళల పురోగతికి తన అధ్యయనం ఎంతో బాగా తోడ్పడుతుందనీ అంటోంది. సాటి దివ్యాంగుల జీవన ప్రమాణాలను మెరుగు పరచాలనే ఆలోచనతో కిరణ్ ఈ ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్టుకు పూనుకోవడం వెనక ఒక బలమైన కారణం ఉంది. అదేంటంటే...

దివ్యాంగుల కోసం ప్రత్యేక కేంద్రం

బిఎస్‌సి నర్సింగ్ చదువుతున్న సమయంలో కిరణ్, ఒక వ్యాధి కారణంగా కంటి చూపు కోల్పోయింది. కానీ అంతటితో జీవితం ముగిసిపోయిందని ఆమె భావించలేదు. బ్రెయిలీలో ఇంగ్లీష్ స్టెనోగ్రఫీ చదివి, చండీఘర్, పంజాబ్ యూనివర్శిటీ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసింది. ఆ తర్వాత సోషియాలజీలో మాస్టర్స్‌లో, విశ్వవిద్యాలయంలో రెండో ర్యాంకుతో ఉత్తీర్ణత సాధించింది. అక్కడితో ఆగిపోకుండా యుజిసి నెట్‌లో ఉత్తీర్ణురాలై, అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా మారింది. ఆ తర్వాత దృష్టి లోపంస్పెషలైజేషన్‌తో పిహెచ్‌డి కూడా పూర్తి చేసింది. అలా కిరణ్, యూనివర్శిటీలోని సోషల్ సైన్సెస్ డిపార్ట్‌మెంట్‌లో ఫ్యాకల్టీ మెంబర్‌గా మారింది. సోషియాలజీ, ఆంత్రొపాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా కూడా పని చేసింది. అలాగే అదే యూనివర్శిటీలో, సెంటర్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ డిజబిలిటీస్‌కు డైరెక్టర్‌గా బాధ్యతలు కూడా నిర్వహించింది. 2018లో పంజాబ్ ప్రభుత్వ వికలాంగుల సలహా బోర్డులో సభ్యురాలిగా నామినేట్ అయినప్పుడు, అవయవలోపాల మూలంగా ఇబ్బందులను ఎదుర్కొనే విద్యార్థులు స్వయంస్వావలంబన సాధించేలా, విశ్వవిద్యాలయ ఆవరణలోనే ఒక ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదించింది. అలా 2021లో, ఆ ప్రతిపాదనను అంగీకరించిన ప్రభుత్వం, పంజాబ్ విశ్వవిద్యాలయ ప్రాంగణంలోనే ఒక ప్రత్యేక కేంద్రాన్ని నెలకొల్పడం విశేషం.

> 2018లో పంజాబ్ ప్రభుత్వ వికలాంగుల సలహా బోర్డులో సభ్యురాలిగా కిరణ్ నామినేట్ అయినప్పుడు, అవయవలోపాల మూలంగా ఇబ్బందులను ఎదుర్కొనే విద్యార్థులు స్వయంస్వావలంబన సాధించేలా, విశ్వవిద్యాలయ ఆవరణలోనే ఒక ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదించింది.

అవయవ లోపాలు కలిగిన వ్యక్తులు, ఉన్నత విద్యను అభ్యసించడానికి పుష్కలమైన మార్గాలను కలిగి ఉండడంతో పాటు, మెరుగైన మార్గనిర్దేశాన్ని పొందడం కూడా అవసరమే! కిరణ్ తాజా ప్రాజెక్టు, దివ్యాంగుల విద్యార్హతల పెంపుదలకూ, జీవన ప్రమాణాల మెరుగుదలకూ తోడ్పడాలని కోరుకుందాం!

జంక్ ఫుడ్‌తో పెను ప్రమాదం

ప్రస్తుతం పిల్లలు జంక్ ఫుడ్ తినడానికే ఎక్కువగా ఇష్టపడుతున్నారు. పండ్లు, కూరగాయలతో కూడిన పోషకాహారాన్ని ఆమడ దూరం పెట్టేస్తున్నారు. దీనివల్ల పిల్లల్లో అధిక బరువు, ఊబకాయం, మధుమేహం, బీపీ, నిద్రలేమి, కీళ్ల నొప్పులు, గుండె జబ్బులు లాంటి అనారోగ్య సమస్యలు పెరుగుతున్నాయని యునిసెఫ్ హెచ్చరిస్తోంది. అలాగే గత ఇరవయ్యేళ్ళుగా పిల్లలు ఎలా ఆరోగ్యాన్ని కోల్పోతున్నారో వివరిస్తూ ఓ నివేదికను కూడా విడుదల చేసింది. 'ఫీడింగ్ ప్రాఫిట్: హౌ ఫుడ్ ఎన్విరాన్‌మెంట్స్ ఆర్ ఫెయిలింగ్ చిల్డ్రన్' అనే ఈ నివేదిక.. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉన్న పిల్లలు ఎంతటి ప్రమాదం అంచున ఉన్నారో తెలియజేస్తోంది.



నివేదికలో ఏముంది?

- దాదాపు 190కి పైగా దేశాల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా యునిసెఫ్ ఈ నివేదికను రూపొందించింది. దీని ప్రకారం బాల్యం, కౌమార దశలు అంటే అయిదు నుంచి పంతొమ్మిది ఏళ్లలోపు వయసున్న పిల్లల్లో ఊబకాయం సమస్య మూడు రెట్లు పెరిగింది. ఇలా ఊబకాయంతో బాధపడే పిల్లల్లో ఇన్సులిన్ నిరోధకత పెరిగి రక్తపోటు, టైప్ 2 డయాబెటిస్, గుండె సంబంధిత వ్యాధులు వస్తాయి. సగటు కుటుంబాలు కూడా విద్య, వైద్యం, రవాణా, తృణధాన్యాలు, కూరగాయలు, పాల ఉత్పత్తుల కంటే అధికంగా... ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాల కోసం ఖర్చు చేయడం ఆశ్చర్యాన్ని కలిగించే అంశం.
- బిస్కెట్లు, చిప్స్, జ్యూస్‌లు, శీతల పానీయాల వినియోగం అంచనాలకు మించి పెరిగింది. దీనివల్ల పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యం తీవ్రంగా ప్రభావితమవుతోంది. కాబట్టి ప్రభుత్వాలు ఆహార చట్టాలను కఠినతరం చేయాలని నివేదిక పేర్కొంది.
- అధిక మోతాదులో చక్కెర, ఉప్పు, అతిగా శుద్ధి చేసిన పిండి, అనారోగ్యకరమైన కొవ్వులు కలిపి తయారుచేసే అల్ట్రా ప్రాసెస్డ్ ఆహార పదార్థాలను పిల్లలు, యువతీ యువకులు ఇష్టంగా తింటున్నారు. డిజిటల్ మార్కెటింగ్ ద్వారా కూడా ఇవి అందరికీ అందుబాటులో ఉంటున్నాయి. పండ్లు, కూరగాయలు, ఇంట్లో వండిన భోజనం కంటే జంక్ ఫుడ్ తినడమే సౌలభ్యంగా ఉందనే భావన ప్రతిఒక్కరిలో పెరుగుతోంది. ఇది మంచి పరిణామం కాదు. జంక్ ఫుడ్ ఉత్పత్తి, మార్కెటింగ్‌లపై పరిమితులు విధిస్తూ అధిక పన్ను విధానాలను అమలు చేయడం సత్ఫలితాలను ఇస్తుందని యునిసెఫ్ అభిప్రాయపడింది.

జంక్ ఫుడ్‌కు వ్యతిరేకంగా...

ఇప్పటికే సర్వత్రా జంక్ ఫుడ్‌కు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. 'ఫిట్ ఇండియా', 'ఈట్ రైట్ ఇండియా' పేరిట ప్రచారాలు జరుగుతున్నాయి. అధికంగా చక్కెర తీసుకోవడం వల్ల కలిగే అనర్థాల గురించి పిల్లలకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వివరించి చెబుతున్నారు. జంక్ ఫుడ్, శీతల పానీయాల్లో ఉండే చక్కెర, కొవ్వుల మోతాదు తెలియజేసే బోర్డులను పాఠశాలల్లో ఏర్పాటు చేయాలని యాజమాన్యాలకు పలువురు సూచిస్తున్నారు. భవిష్యత్తులో భారతదేశానికి ఊబకాయం పెద్ద సమస్యగా పరిణమిస్తుందని, ప్రతి కుటుంబం వంట నూనె వాడకాన్ని తగ్గించాలని ఇటీవల ప్రధానమంత్రి మోదీ పిలుపునివ్వడం గమనార్హం.

ఇండోర్ ప్లాంట్స్ ఇలా...

ఇంటి అందాన్ని పెంచడంలో ఇండోర్ ప్లాంట్స్ ప్రధాన పాత్ర పోషిస్తుంటాయి. అందుకే చాలామంది వీటిని ఇష్టంగా పెంచుకుంటూ ఉంటారు. చలికాలంలో ఇండోర్ ప్లాంట్స్‌కు ప్రత్యేక సంరక్షణ అవసరమని నిపుణులు చెబుతున్నారు. ఆ వివరాలు...

- చలికాలంలో ఇండోర్ ప్లాంట్స్‌కు రోజూ నీళ్ల పోయనవసరం లేదు. కుండీలోని మట్టి పొడిబారినప్పుడు మాత్రమే కొద్దిగా నీళ్లు చిలకరించాలి. మొక్క తత్వాన్ని అనుసరించి నీళ్లు పోయాలి. అవసరానికి మించి నీళ్లు పోస్తే మొక్కలకు తెగుళ్లు వచ్చే ప్రమాదం ఏర్పడుతుంది.
- చలికాలంలో గాలి చాలా పొడిగా ఉంటుంది. దీనివల్ల మొక్కలు తేమను కోల్పోతూ ఉంటాయి. కుండీలో చిన్న నీళ్ల గిన్నెను ఉంచితే నీరు ఆవిరిగా మారి చుట్టూ ఉన్న గాలిలో తేమను పెంచుతుంది. దీంతో మొక్కలు కూడా ఆరోగ్యంగా పెరుగుతాయి.
- రోజూ కుండీలను కొద్దిసేపు ఎండలో ఉంచడం మంచిది. ఎండ రాని రోజుల్లో ఇంట్లో గ్రో లైట్లను



వేయడం వల్ల మొక్క అవసరాలు తీరతాయి.

- చలికాలంలో మొక్కల ఎదుగుదల తక్కువగా ఉంటుంది. కాబట్టి వాటికి ఎరువులు అందించనవసరం లేదు. ఒకవేళ ఎరువులు వేసినప్పటికీ మొక్కలు పోషకాలను గ్రహించలేవు. కాబట్టి చలికాలమంతా మొక్కలను విశ్రాంతిగా ఉంచడం మేలు.
- ఆకుల మీద దుమ్ము, ధూళి పేరుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వారానికి రెండుసార్లు ఆకులను తడిగుడ్డతో తుడవడం మంచిది.
- పండిన, ఎండిన ఆకులను ఎప్పటికప్పుడు తొలగిస్తూ ఉండాలి. అదనంగా పెరిగిన కొమ్మలను కత్తిరిస్తే మొక్క శక్తి సద్వినియోగమవుతుంది.
- చలికాలంలో మొక్కలకు కుండీలను మార్చకూడదు. అలాచేస్తే మొక్కలు బలహీనమవుతాయి. దానికి బదులు కొత్త కుండీలో కొత్త విత్తనాలు చల్లుకోవచ్చు.

ప్రభుత్వ మహిళా ఉద్యోగి ఆత్మహత్య

▸ అప్పు ఇచ్చిన వ్యక్తి వేధింపులే కారణం


నీలిమ (ఫైల్)

వనపర్తి రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : అప్పు ఇచ్చిన వ్యక్తి వేధింపులకు తాళలేక ఓ మహిళా ప్రభుత్వ ఉద్యోగి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం బుసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ వెంకటేష్ నాయుడు భార్య నీలిమ (38) గోపాల్‌పేట మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. కొంతకాలంగా వనపర్తిలోని ఎన్టీఆర్ నగర్‌లో ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి చంద్రయ్య ఇంట్లో భార్యాభర్తలు అద్దెకు ఉంటున్నారు. ఇంటి యజమాని చంద్రయ్య దగ్గర నీలిమ తన భర్తకు తెలియకుండా దాదాపు రూ. 20 లక్షల అప్పు అధిక వడ్డీకి తీసుకున్నారు. మొత్తం డబ్బులు తిరిగి చెల్లించాలని కొన్ని రోజులుగా అప్పు ఇచ్చిన చంద్రయ్య ఆమెను వేధించాడు. ఈ విషయం భర్తకు కూడా తెలిసింది. ఈ తరుణంలో ప్రతీ రోజు మాదిరిగానే విధులకు హాజరైన నీలిమ మంగళవారం సాయంత్రం ఇంటికి వచ్చి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు మృతదేహాన్ని జిల్లా ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పు ఇచ్చిన వారి వేధింపులతో నీలిమ ఆత్మహత్య చేసుకున్నట్లు భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. కాగా, మంత్రి జూపల్లి కృష్ణారావు ఏరియా ఆసుపత్రికి వెళ్లి నీలిమ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

42 శాతం రిజర్వేషన్ల సాధనకై నేడు బీసీ సంఘాల కీలక సమావేశం

రాంనగర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు సాధించే లక్ష్యంతో తెలంగాణ బీసీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో గురువారం నాడు కీలక సమావేశం జరగనుంది. ఈ సమావేశం ఉదయం 10 గంటలకు లక్డీకాపుల్‌లోని హోటల్ అశోకలో నిర్వహించనున్నారు. ఇందులో 25 బీసీ సంఘాలతో పాటు 130 బీసీ కుల సంఘాల ప్రతినిధులు పాల్గొంటారని బీసీ సంఘాల జేఏసీ చైర్మన్, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య తెలిపారు. బుధవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఆయన మాట్లాడుతూ, రిజర్వేషన్లను పార్టీపరంగా కాకుండా చట్ట, రాజ్యాంగ, న్యాయపరంగా సాధించుకోవడమే లక్ష్యంగా ముందుకెళ్తామన్నారు. జనాభా ప్రాతిపదికన 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని స్పష్టం చేశారు. సమావేశానికి రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి బీసీ, కుల సంఘాల ప్రముఖులను ఆహ్వానించామని తెలిపారు. ఈ సమావేశంలో అందరి అభిప్రాయాలను సేకరించి ఉద్యమ కార్యాచరణ ప్రణాళికను ప్రకటిస్తామని ఆర్.కృష్ణయ్య వెల్లడించారు.

ఆర్‌టీఓ చలాన్ పేరుతో మాల్వేర్

▸ వాట్సాప్‌లో ఓపెన్ చేస్తే మొబైల్ హ్యాంగ్

విశాఖపట్నం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): విశాఖలో వాట్సాప్ గ్రూపుల ద్వారా 'ఆర్‌టీఓ చలాన్' పేరుతో ఒక మెసేజ్ వైరల్ అవుతోంది. "మీ వాహనంపై ఈ-చలాన్ జనరేట్ అయింది. వెంటనే చెక్ చేసుకోండి. లేదంటే మీపై కోర్టులో ఎఫ్ఐఆర్ నమోదు అవుతుంది. దీంతో పాటు వచ్చిన 'ఆర్‌టీఓ ఏపీకే'(ఆండ్రాయిడ్ అప్లికేషన్ ప్యాకేజ్) ఇన్‌స్టాల్ చేసుకొని చలానా చెక్ చేసుకోండి... ఫ్రమ్, ఆర్‌టీఓ ఆఫీస్" అంటూ మెసేజ్ వస్తోంది. దాంతో పాటే 'ఈ-చలాన్ ఆర్‌టీఓ... ఏపీకే' అని వస్తోంది. చలానా ఎక్కడ పడింది?, ఎంత వేశారు?... తెలుసుకోవాలన్న ఆత్రంతో పొరపాటున ఆ అప్లికేషన్ ఓపెన్ చేస్తే ప్రమాదమే. అది అనేక పర్మిషన్లు అడుగుతుంది. అవన్నీ ఓకే చేసుకుంటూ పోతే...'వలంటీర్స్ గ్రూపు' అని ఒకటి ఆటోమేటిక్‌గా మొబైల్‌లో జనరేట్ అవుతోంది. అందులో కూడా ఇదే అప్లికేషన్ వస్తోంది. అది ఆ మొబైల్ నుంచి ఇతర వ్యక్తులకు పంపించకుండానే ఫార్వర్డ్ అవుతోంది.

ఈ- కేవైసీ లేకపోతే గ్యాస్ సబ్సిడీ పథకం నిలిపివేత!

▸ వినియోగదారులకు ఆధార్ బయోమెట్రిక్ తప్పనిసరి
▸ ఉజ్వల లబ్ధిదారులు ప్రతియేటా కేవైసీ చేయాల్సిందే
▸ పంపిణీదారులకు లక్ష్యాలు విధించిన ఆయిల్ కంపెనీలు

హైదరాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గృహావసరాలకు వంట గ్యాస్ ఉపయోగిస్తున్న వినియోగదారులకు ఆధార్ బయోమెట్రిక్ తప్పనిసరి చేశారు. ముఖ్యంగా ప్రధానమంత్రి ఉజ్వల యోజన (పీఎంయూవై) పథకం లబ్ధిదారులు ప్రతియేటా మార్చి 31 లోపు ఈ- కేవైసీ సమర్పించాలని కేంద్ర సర్కారు నిబంధన విధించింది. లేకపోతే సబ్సిడీ పథకాలు నిలిపివేస్తామని కేంద్ర పెట్రోలియం, సహజవాయువుల మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీచేసింది. ఈమేరకు ఆయిల్ కంపెనీలు డిస్ట్రిబ్యూటర్లకు టార్గెట్లు పెట్టి ఈ- కేవైసీ చేయిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 1.50 కోట్ల గృహ గ్యాస్ వినియోగదారులు ఉండగా ఇప్పటి వరకు 60 శాతం మంది మాత్రమే స్పందించారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐవోసీఎల్), భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(బీపీసీఎల్), హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(హెచ్‌పీసీఎల్) కంపెనీలు గృహ, వాణిజ్య గ్యాస్ సిలిండర్లు వినియోగదారులకు సరఫరా చేస్తున్న విషయం విదితమే. ఈ సంస్థలు కేంద్ర పెట్రోలియం, సహజవాయువుల మంత్రిత్వ శాఖ నిబంధనలకు అనుగుణంగా సబ్సిడీ పథకాలను అమలుచేస్తున్నాయి. ఉజ్వల పథకం లబ్ధిదారులు ప్రతియేటా ఒకసారి ఈ- కేవైసీ ఇవ్వకపోతే... ఏడాదిలో వారికిచ్చే 8వ, 9వ సిలిండర్ల సబ్సిడీ నిలిపివేస్తామని ఆయిల్ కంపెనీలు జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నాయి. బయోమెట్రిక్ ధృవీకరణ మార్చి 31 లోపు పూర్తికాకపోతే... ఈ సంవత్సరానికి సంబంధించి నిలిపివేసిన సబ్సిడీని శాశ్వతంగా రద్దుచేస్తామని స్పష్టంచేశారు. అయితే సబ్సిడీ రాకపోయినా గ్యాస్ సరఫరా, రీఫిల్ బుకింగ్‌కు అంతరాయం ఉండదని, మొత్తం ధర చెల్లించి సిలిండరు తీసుకోవాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఎక్కడైనా చేయొచ్చు

వినియోగదారులు మొబైల్ యాప్ ద్వారా బయోమెట్రిక్ ఆధార్ ధృవీకరణ చేసుకునే అవకాశం కల్పించారు. క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి మొబైల్ ద్వారా చేసుకోవచ్చు. సంబంధిత ఏరియా పంపిణీకేంద్రానికి వెళ్లి చేసుకోవచ్చు. గ్యాస్ సిలిండర్ తీసుకొచ్చే డెలివరీ సిబ్బంది కూడా ఈ- కేవైసీ నమోదు చేస్తున్నారు. వినియోగదారుల నుంచి స్పందన సరిగాలేదని ఆశించిన స్థాయిలో పూర్తికావటం లేదని పంపిణీదారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో వినియోగదారుల నుంచి ఈ- కేవైసీ తీసుకోకపోతే జరిమానా వేస్తామని డిస్ట్రిబ్యూటర్లకు ఆయిల్ కంపెనీలు హెచ్చరికలు జారీ చేశాయి. వినియోగదారులతో పలు సమస్యలు ఎదురవుతున్నాయని, ఆయిల్‌కంపెనీలు పంపిణీదారులపై ఒత్తిడి చేయటం సరైన చర్యకాదని అఖిల భారత గ్యాస్ డీలర్ల సంఘం జాతీయ అధ్యక్షులు వెంకటేశ్వరరావు అన్నారు.

వైద్యవిద్యలో పీజీ చేసినా.. 50% మంది సర్జరీ చేయలేరు

(మొదటి పేజీ తరువాయి)

చెప్పడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఇండియాలో వైద్య విద్య ప్రమాణాలు, మెడికల్ కాలేజీల్లో మౌలిక సదుపాయాలు, మెడికోల మానసిక ఆరోగ్యంపై 'ఫెడరేషన్ ఆఫ్ ఆలిండియా మెడికల్ అసోసియేషన్' (ఫైమా) నిర్వహించిన రివ్యూ మెడికల్ సిస్టమ్(ఆర్ఎమ్ఎస్) సర్వే -2025లో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాలు, యూనియన్ టెరిటరీలకు చెందిన 2,000 మందికి పైగా మెడికల్ విద్యార్థులు, పీజీ రెసిడెంట్లు, ఫ్యాకల్టీని ఈ సర్వేలో భాగంగా ప్రశ్నించారు. సర్వే నివేదికను ఫైమా బుధవారం జాతీయ వైద్య కమిషన్(ఎన్ఎమ్‌సీ) చైర్మన్‌కు అందజేసింది. విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని.. వైద్య విద్యలో తక్షణ సంస్కరణలను అమలు చేయాలని విజ్ఞప్తి చేసింది.

వసతుల లేమి..

కొత్తగా ఏర్పాటవుతున్న వైద్య కళాశాలల్లో ఎన్ఎంసీ నిబంధనల మేరకు మౌలిక సదుపాయాలు ఉండట్లేదని ఫైమా సర్వేలో వెల్లడైంది. ప్రధానంగా తాగునీరు, లైబ్రరీలు, ల్యాబ్‌లు, హాస్టళ్లు, తగినంత మంది భద్రతా సిబ్బంది లేనట్టు తేలింది. అలాగే ఆసుపత్రుల్లో పడకలు, పర్యవేక్షణ సిబ్బంది, పేషెంట్ ఎక్స్‌పోజర్ సరిపోకపోవడం వల్ల.. మెడికల్ కోర్సులు నామమాత్రం అవుతున్నాయనే అభిప్రాయం విద్యార్థుల్లో వ్యక్తమైంది. అత్యధిక వైద్య కళాశాలల్లో విద్యార్థులకు పేషెంట్ ఎక్స్‌పోజర్ లేకపోవడంతో.. శస్త్రచికిత్స చేయడానికి వారు భయపడుతున్నట్టు వెల్లడైంది. ఈ నేపథ్యంలో "యూనిఫామ్ స్కిల్ అక్విజిషన్ ప్రోగ్రామ్"ను అన్ని కాలేజీల్లో తప్పనిసరి చేయాలని ఫైమా సూచించింది.

ప్రమాదంలో మెడికోల మానసిక ఆరోగ్యం

దేశవ్యాప్తంగా చాలా కాలేజీలు యాంటి ర్యాగింగ్ నిబంధనలు పాటించడం లేదు. అలాగే మెడికోలకు కౌన్సెలింగ్ సౌకర్యాలు లేవు. వారికి మానసిక ఆరోగ్యంపై సాయమందించే వ్యవస్థ లేదని ఫైమా సర్వేలో వెల్లడైంది. సర్వే ప్రకారం ఇలా 54.4 శాతం మంది మెడికల్ విద్యార్థులకు మానసిక ఆరోగ్య సహాయం అందడం లేదు. ప్రతి కాలేజీలో మెంటల్ హెల్త్ కమిటీ, 24 గంటల హెల్ప్‌లైన్, ప్రతి 500 మందికి 2 మంది కౌన్సిలర్లు, తప్పనిసరిగా ఉండాలని ఫైమా సూచించింది.

కుంగదీస్తున్న పనివేళలు..

పీజీ, రెసిడెంట్లపై పని భారం ప్రమాదకరస్థాయిలో ఉందని ఫైమా రిపోర్ట్ వెల్లడించింది. 70.5 శాతం మందికి ఫిక్స్‌డ్ డ్యూటీ అవర్స్ (నిర్దిష్ట పనివేళలు) లేవు. 73.8% మందిని క్లరికల్ పనుల్లో ఉపయోగిస్తున్నారు. చాలాసార్లు 24 గంటలకుపైగా హాస్పిటల్లో డ్యూటీలు వేస్తున్నారు. దీంతో నిద్ర లేక.. ఒత్తిడికి గురికావడం, ఆత్మవిశ్వాసం తగ్గడం వంటి మానసిక సమస్యలు బాగా పెరుగుతున్నాయని రిపోర్ట్ పేర్కొంది. అలాగే సర్వేలో 62.1 శాతం మంది విద్యార్థులు తమకు స్టైపెండ్ సమయానికి రావడం లేదని వెల్లడించారు. ప్రైవేట్, ప్రభుత్వ కాలేజీల్లో భారీ తేడాలు ఉండటంతో అందరికీ యూనిఫాం పే స్కేల్ అమలు చేయాలని మెడికోలు కోరుతున్నట్లు సర్వేలో వెల్లడైంది.

సర్వేలో వెల్లడైన మరికొన్ని ముఖ్యాంశాలు

కేవలం మెడికల్ కాలేజీల ఏర్పాటు, సీట్లు పెంచడంపైనే దృష్టి పెడుతున్నారని.. కళాశాల్లో మౌలిక సదుపాయాలు అడుగుంటుతున్నాయని సర్వే పేర్కొంది.

- తమ కాలేజీల్లో పూర్తిస్థాయి గ్రంథాలయం లేదని 50 శాతం మంది విద్యార్థులు తెలిపారు.
- ప్రమాణాలకు తగిన క్లినికల్ ప్రయోగశాలలు లేవని 47.6 శాతం మంది వెల్లడించారు.
- శరీర నిర్మాణం గురించి తెలుసుకునేందుకు అవసరమైన మృతదేహాల లభ్యత పరిమితంగా ఉందని 52.2 శాతం మంది పేర్కొన్నారు.
- తగినంత మంది నర్సింగ్ సిబ్బంది, మానవ వనరులు లేక రోగుల వైద్య సేవలపై తీవ్ర ప్రభావం పడుతున్నట్లు 72.9%మంది మెడికోలు తెలిపారు.

..ఈ సర్వేలో పాల్గొన్న వారిలో 90.3% మంది ప్రభుత్వ మెడికల్ కాలేజీలో చదివేవారు కాగా, 7.8 శాతం ప్రైవేటు మెడికల్ కాలేజీలు, మిగిలిన వారు గవర్నమెంట్ ఎయిడెడ్ కాలేజీలకుచెందిన వారున్నారు. ఇక 61 శాతం మంది యూజీలు కాగా, 29.9 శాతం పీజీలు సర్వేలో పాల్గొన్నారు. మిగిలిన వారంతా సీనియర్ రెసిడెంట్స్, అధ్యాపకులు.

నేర్చుకోవాలనే తపనే ఉండట్లేదు



ఈ తరం వైద్య విద్యార్థుల్లో నేర్చుకోవాలనే తపన ఉండాలి. అది లేకుంటే ఉపయోగం ఉండదు. గతంలో ఎంబీబీఎస్ చేసిన వారు సొంతంగా క్లినిక్‌లు పెట్టుకుని సర్జరీలు చేసేవారు. నేటి తరం వారి ఆలోచనలు కూడా భిన్నంగా ఉంటున్నాయి. కొద్దిపాటి పని గంటలకే తీవ్ర ఒత్తిడికి గురి అవుతున్నారు. దీంతో అధ్యాపకులు కూడా కఠినంగా వ్యవహరించలేకపోతున్నారు. ప్రొఫెసర్ కఠినంగా ఉంటే పేరెంట్స్ ఒప్పుకోవట్లేదు. ప్రధానంగా వైద్యంలో కమర్షియల్ ఎలిమెంట్స్ వచ్చిన తర్వాత ఇటువంటి పరిణామాలే చోటుచేసుకుంటాయి. వైద్య విద్యార్థుల్లో కమిట్‌మెంట్ ఉండాలి. మెడిసిన్‌ను స్టేటస్ సింబల్‌గా చూడవద్దు. అదోక సేవా వృత్తిగా భావించాలి.

\- డాక్టర్ రాజారావు, ప్రిన్సిపాల్, ఉస్మానియా మెడికల్ కాలేజీ, హైదరాబాద్

హైటెక్‌సిటీలో మెక్‌డొనాల్డ్స్ గ్లోబల్ ఆఫీస్

(మొదటి పేజీ తరువాయి)

చేసేందుకు ముందుకొచ్చిన 'మెక్‌డొనాల్డ్స్ గ్లోబల్ లీడర్షిప్'కు మంత్రి శ్రీధర్‌బాబు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. మెక్‌డోనాల్డ్స్ అంటే గ్లోబలైజేషన్‌కు నిలువెత్తు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. "హైదరాబాద్ 'గ్లోబల్ జీసీసీ' హబ్ యావత్ ప్రపంచం దృష్టినీ ఆకర్షిస్తోంది. కేవలం టెక్నాలజీకి సంబంధించిన జీసీసీలనే కాక.. అన్ని రంగాల జీసీసీలనూ హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు అంతర్జాతీయ, జాతీయ దిగ్గజ సంస్థలు తెలంగాణ వైపు చూస్తున్నాయి. హాస్పిటాలిటీ రంగ దిగ్గజ సంస్థ 'మారియట్' తన మొదటి జీసీసీని ప్రారంభించేందుకు హైదరాబాద్‌ను ఎంచుకుంది. 'రైజింగ్ తెలంగాణ' లక్ష్య సాధనకు మా ప్రభుత్వం మెక్‌డోనాల్డ్స్ లాంటి అంతర్జాతీయ సంస్థలతో కలిసి పనిచేసేందుకు ప్రాధాన్యమిస్తోంది." అని ఆయన వివరించారు. ఇక.. హైదరాబాద్ నగరం జీసీసీలకు రాజధానిగా నిలుస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణ ప్రతిభపై విశ్వాసం, పరిపాలనపై నమ్మకానికి మెక్‌డోనాల్డ్స్ గ్లోబల్ ఆఫీస్ ఒక ప్రతీక అని ఆయన వ్యాఖ్యానించారు. గత రెండు దశాబ్దాలలో హైదరాబాద్ ఇటువంటి సెంటర్లకు రాజధానిగా మారిందని, వందలాది గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు ఇక్కణ్నుంచీ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని ఆయన గుర్తుచేశారు. "ఇవి కేవలం బ్యాక్ ఆఫీసులు కావు.. ప్రపంచ ఆవిష్కరణలకు నాడులు" అని డిప్యూటీ సీఎం అభిప్రాయపడ్డారు. ఇవి షికాగోను చార్మినార్‌తో, బోస్టన్‌ను బంజారాహిల్స్‌తో, లండన్‌ను లింగంపల్లితో కలుపుతున్నాయని.. వెరసి హైదరాబాద్‌ను ప్రపంచ కమాండ్ సెంటర్‌గా మార్చుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మెక్‌డోనాల్డ్స్ కంపెనీ ప్రతినిధులు మిస్ స్కై ఆండర్సన్, దేశాంత్ కైలా తదితరులు పాల్గొన్నారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

నన్ను టార్గెట్ చేశారు



సోషల్‌మీడియాలో తనపై దుష్ప్రచారం చేస్తున్నారంటూ హీరో చిరంజీవి బుధవారం మరోసారి సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. తనపై అభ్యంతకర పోస్టులు పెడుతూ, దుర్భాలాషలాడుతున్న కొన్ని ఎక్స్ హ్యాండిల్ ప్రొఫైల్స్‌పై ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా దయాచౌదరి అనే వ్యక్తి తనను లక్ష్యంగా చేసుకొని దూషణకు పాల్పడుతున్నాడనీ, అతనిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని చిరంజీవి పోలీసులను కోరారు. కొందరు తన ఫొటోలను మార్ఫింగ్ చేసి డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లపై వైరల్ చేస్తున్నారని ఇటీవలే చిరంజీవి పోలీసులకు ఫిర్యాదు చేశారు. చిరంజీవి పేరు, ఫొటోలు, గొంతును ఆయన అనుమతి లేకుండా ఎవరూ ఉపయోగించకూడదని సిటీ సివిల్‌కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.


హీరోయిన్‌గా మహేశ్‌బాబు మేనకోడలు

● కథానాయికగా మంజుల కుమార్తె జాన్వీ స్వరూప్



సూపర్ స్టార్ కృష్ణ ఫ్యామిలీ నుంచి మరో వారసురాలు తెలుగు చిత్రపరిశ్రమకు పరిచయమవనున్నారు. కృష్ణ మనవరాలు, మహేశ్‌బాబు మేనకోడలు, మంజుల కుమార్తె జాన్వీ స్వరూప్ కథానాయికగా తెరంగేట్రం చేయనున్నారు. బుధవారం జాన్వీ పుట్టినరోజు సందర్భంగా ఈ విషయాన్ని మంజుల ప్రకటించారు. తన కుమార్తె హీరోయిన్‌గా టాలీవుడ్‌లో అరంగేట్రం చేయబోతున్నందుకు ఎంతో ఆనందంగా ఉందని మంజుల తెలిపారు. 'నన్ను అడ్డుకున్న వారే ఇప్పుడు జాన్వీ కోసం ప్రార్థిస్తున్నారు. ఆమె చిరునవ్వు నా ప్రార్థనలకు సమాధానం' అని స్పందించారు. ఆమె నటించబోయే సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలు త్వరలోనే ప్రకటించనున్నారు. ఘట్టమనేని కుటుంబం నుంచి పరిచయం కానున్న తొలి హీరోయిన్ జాన్వీనే కావడం విశేషం. మంజుల తెరకెక్కించిన 'మనసుకు నచ్చింది' సినిమాలో జాన్వీ బాలనటిగా నటించారు.

సైనికుడి శౌర్యం



అమితాబ్ బచ్చన్ మనవడు అగస్త్య నంద కథానాయకుడిగా దర్శకుడు శ్రీరామ్ రాఘవన్ తెరకెక్కిస్తున్న బాలీవుడ్ చిత్రం 'ఇక్కీస్'. 'ద అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ సెకండ్ లెఫ్టినెంట్ అరుణ్ కేతర్‌పాల్'. దేశంలోనే అతి పిన్న వయసులోనే పరమ వీర చక్ర పురస్కారం (మరణానంతరం) పొందిన యుద్ధ వీరుడు అరుణ్ కేతర్‌పాల్ జీవితం ఆధారంగా ఈ తెరకెక్కిన చిత్రమిది. ధర్మేంద్ర కీలకపాత్ర పోషించారు. డిసెంబరులో విడుదల కానుంది. తాజాగా ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్ దేశభక్తి, ధైర్యం, భావోద్వేగాలు, ప్రేమ, యాక్షన్ తదితర అంశాలతో నిండిన ఈ ట్రైలర్ ఆకట్టుకుంటోంది. ఈ చిత్రానికి దినేశ్ విజన్ నిర్మాత.



బ్రహ్మానందంకు సూర్యకాంతం స్మారక పురస్కారం

ప్రముఖ నటీమణి, స్వర్గీయ సూర్యకాంతం శతజయంతి పురస్కారాల ముగింపు ఉత్సవం బుధవారం హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఈ వేడుకలో సూర్యకాంతం స్మారక పురస్కారాన్ని నటుడు బ్రహ్మానందం అందుకున్నారు. డాక్టర్ సూర్యకాంతం శతజయంతి కమిటీతో కలసి కిన్నెర ఆర్ట్స్ థియేటర్ ఈ వేడుకను నిర్వహించింది. సూర్యకాంతం కుమారుడు అనంత పద్మనాభమూర్తి, ఆమె మనవడు, మనవరాలు కూడా ఈ వేడుకలో పాల్గొన్నారు. 2023లో సూర్యకాంతం శతజయంతి వేడుకలు మొదలయ్యాయి. ఈ కార్యక్రమంలో నటుడు మురళీమోహన్, దర్శకుడు రేలంగి నరసింహా రావు, నటుడు తనికెళ్ల భరణి, అలీ తదితరులు పాల్గొన్నారు. సూర్యకాంతంపై సినీ జర్నలిస్ట్ ఎస్‌వీ రామారావు తెరకెక్కించిన 'అత్తగారు జిందాబాద్' లఘు చిత్రాన్ని ఈ సందర్భంగా ప్రదర్శించారు.

టైటిల్‌కు తగ్గ కథతో వస్తున్నాం

భాను భోగవరపు



'మాస్ జాతరలో మాస్ అంశాలు పుష్కలంగా చూపిస్తూనే ఓ కొత్త పాయింట్‌ను చెప్పబోతున్నాం. ఈ చిత్రానికి టైటిల్‌ను రవితేజ గారే సూచించారు. థియేటర్‌లో ప్రేక్షకులను ఆశ్చర్యపరిచే సన్నివేశాలు ఈ చిత్రంలో చాలా ఉన్నాయి' అని దర్శకుడు భాను భోగవరపు అన్నారు. రవితేజ, శ్రీలీల జంటగా ఆయన తెరకెక్కించిన చిత్రం 'మాస్ జాతర'. సితార ఎంటర్టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మించారు. ఈ నెల 31న సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు భాను భోగవరపు. 'రైల్వే పోలీస్ నేపథ్యంలో జరిగే ఈ కథలో క్రైమ్ సీక్వెన్స్ కొత్తగా ఉంటుంది. కథను రాసే క్రమంలో చాలా పరిశోధన చేశాను. పలువురు రైల్వే అధికారులను కలసి చాలా వివరాలు తెలుసుకున్నాను. ఇది రవితేజగారి 75వ చిత్రం కావడంతో నా బాధ్యత మరింత పెరిగింది. అయితే, ఎటువంటి ఒత్తిడి పెట్టుకోకుండా కూల్‌గా సినిమా చేయమని రవితేజ ప్రోత్సహించారు. ఇందులో శివుడి పాత్ర ఎంతో కీలకం. నవీన్‌చంద్రగారు ఈ పాత్రకు ప్రాణం పోశారు. సినిమా విడుదలయ్యాక ఆయన నటనకు అద్భుతమైన ఆదరణ దక్కుతుంది. తులసి అనే అమ్మాయిగా శ్రీలీల కనిపిస్తారు. గత చిత్రాలతో పోలిస్తే ఆమె ఇందులో కొత్తగా కనిపిస్తారు. రవితేజగారు, శ్రీలీల మధ్య వచ్చే సన్నివేశాలు 'గ్యాంగ్ లీడర్' సినిమాలో చిరంజీవి, విజయశాంతిల జంటను గుర్తు చేస్తాయి. ఈ చిత్రంలో వినోదానికి పెద్దపీట వేశాము. మాస్ అంశాలతో కూడిన ఈ విభిన్న చిత్రం అందరినీ ఆకట్టుకుంటుందనే నమ్మకముంది' అని చెప్పారు.


సుదూర బాటసారి



నిహాల్ కోధాటి, సూర్య శ్రీనివాస్ హీరోలుగా అక్కి విశ్వనాథరెడ్డి దర్శకత్వంలో రూపొందిన స్పై డ్రామా 'చైనా పీస్'. కమల్ కామరాజు, రఘుబాబు కీలకపాత్రలు పోషించారు. మూన్ లైట్ డ్రీమ్స్ నిర్మించిన ఈ చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. బుధవారం మేకర్స్ 'గూఢచారి సుదూర బాటసారి' అంటూ సాగే గీతాన్ని విడుదల చేశారు. దినేశ్ కాకర్ల సాహిత్యం అందించగా, కార్తీక్ రోడ్రిగ్జ్ స్వరపరిచారు. స్ఫూర్తి జితేందర్, హారికా నారాయణ్ ఆలపించారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'కొత్త తరహా కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది' అని చెప్పారు. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని మేకర్స్ తెలిపారు. సినిమాటోగ్రఫీ: సురేశ్ రగుతు, ఎడిటర్: కే వెంకటేశ్

ఆర్‌ఎక్స్ 100 చిత్రంలా గుర్తుండిపోతుంది

వేణు ఊడుగుల



అఖిల్, తేజస్విని జంటగా సాయిలు కంపాటి తెరకెక్కించిన చిత్రం 'రాజు వెడ్స్ రాంబాయి'. 'నీది నాది ఒకే కథ', 'విరాట పర్వం' చిత్రాలతో దర్శకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న వేణు ఊడుగుల, రాహుల్ మోపిదేవి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. డా.నాగేశ్వర రావు పూజారి సమర్పిస్తున్నారు. నవంబర్ 21న బన్నీవాస్ వర్క్స్, నందిపాటి ఎంటర్టైన్‌మెంట్స్‌పై బన్నీ వాసు, వంశీ నందిపాటి విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో బన్నీవాస్ మాట్లాడుతూ 'రాజు వెడ్స్ రాంబాయి' సినిమా చూశాను. నా మనసుకు హత్తుకుంది. సినిమా చూసి బయటకు వచ్చే ప్రేక్షకులు ఒక భావోద్వేగంతో బయటకు వస్తారు' అని అన్నారు. 'ఖమ్మం, వరంగల్ నగరాల్లో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా దర్శకుడు సాయిలు కంపాటి ఈ కథ రాసుకున్నారు. ఈ విషాదభరితమైన ప్రేమ కథ నన్ను కదిలించింది. '7జీ బృందావన్ కాలనీ', 'ప్రేమిస్తే', 'ఆర్‌ఎక్స్ 100', 'బేబి' లాంటి చిత్రాల్లా తెలుగు ప్రేక్షకులు ఈ సినిమాను ఎప్పటికీ గుర్తుపెట్టుకుంటారు' అని చెప్పారు. 'ఈ సినిమా కథను ఒకే సిట్టింగ్‌లో వేణు అన్న అంగీకరించారు. ఈ సినిమా విజయంపై పూర్తి నమ్మకముంది' అని సాయిలు కంపాటి తెలిపారు.

కాగ్నిజెంట్‌లో ఫ్రెషర్ల నియామకాలు

15,000-20,000

సెప్టెంబరు త్రైమాసిక ఆదాయం 540 కోట్ల డాలర్లు

న్యూఢిల్లీ: అమెరికా కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్నప్పటికీ, భారత కార్యాలయాల్లోనే అధిక శాతం ఉద్యోగులున్న ఐటీ కంపెనీ కాగ్నిజెంట్ ఆదాయం సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో 7.3 శాతం పెరిగి 541.5 కోట్ల డాలర్లకు చేరుకుంది. నికర ఆదాయం మాత్రం 53 శాతం తగ్గి 27.4 కోట్ల డాలర్లకు పరిమితమైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (జనవరి-డిసెంబరు) మొత్తానికి ఆదాయ అంచనాను 2,015-2,110 కోట్ల డాలర్లకు మెరుగు పరిచింది. గడిచిన మూడు నెలల్లో కంపెనీ ఉద్యోగుల సంఖ్య నికరంగా 6,000 పెరిగి 3,49,800కు చేరుకుంది. కొత్త నియామకాల్లో అధిక శాతం ఫ్రెషర్లేనని కంపెనీ స్పష్టం చేసింది. ఈ ఏడాదిలో మొత్తం 15,000-20,000 మందిని ఫ్రెషర్లను నియమించుకోనున్నట్లు సంస్థ తెలిపింది. అంతేకాదు, ఈ నవంబరు 1 నుంచి అమలులోకి వచ్చేలా 80 శాతం ఉద్యోగులకు వేతనాలు పెంచినట్లు కాగ్నిజెంట్ వెల్లడించింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



30వ తేదీ			
హైదరాబాద్	570	విజయవాడ	575
వరంగల్	572	గోదావరి	580
చిత్తూరు	593	విశాఖపట్నం	570
		దజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	117	విజయవాడ	123
వరంగల్	117	గుంటూరు	126
కరీంనగర్	117	ఒంగోలు	126
మహబూబ్‌నగర్	117	చిత్తూరు	114
కర్నూలు	117	నెల్లూరు	119
విశాఖపట్నం	119	అనంతపురం	119
గోదావరి	123		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,21,580 ▼	1,11,450 ▼	1,66,000 ▲
విజయవాడ	1,25,500 ▲	1,19,000 ▲	1,51,000 ▲
విశాఖపట్నం	1,24,720 ▲	1,12,200 ▼	1,66,000 ▲
రాజమండ్రి	1,21,580 ▲	1,11,450 ▲	1,50,000 ▲
ప్రొద్దుటూరు	1,18,500 ▼	1,09,020 ▼	1,50,000 ▲
ముంబై	1,20,628 ▲	1,10,495 ▲	1,46,633 ▲

యూనియన్ బ్యాంక్‌తో బీఓఐ విలీనం!



- ఇండియన్ బ్యాంక్‌తో ఐఓబీ మెర్జర్
- బీఓఎం, పీ అండ్ ఎస్‌బీ ప్రైవేటీకరణ
- ప్రభుత్వ బ్యాంకింగ్ రంగంలో మరో విడత సంస్కరణలకు కేంద్ర ప్రభుత్వం కసరత్తు

న్యూఢిల్లీ: ప్రభుత్వ బ్యాంకింగ్ రంగంలో మరో విడత విలీనాలకు కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ)తో బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ)ను విలీనం చేసే ఆలోచనలో ఉన్నట్లు ఈ విషయంతో సంబంధం ఉన్న అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ విలీనం జరిగితే, భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) తర్వాత దేశంలో రెండో అతిపెద్ద ప్రభుత్వ బ్యాంక్ (పీఎస్‌బీ)గా అవతరించనుంది. ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకలన్నింటిలో నాలుగో అతిపెద్ద బ్యాంక్‌గా మారనుంది. ప్రస్తుతం పీఎస్‌బీల్లో రెండో స్థానంలో ఉన్న బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) మొత్తం ఆస్తుల విలువ ఈ జూన్ 30నాటికి రూ.18.62 లక్షల కోట్లుగా ఉంది. యూబీఐ-బీఓఐ విలీనం ద్వారా ఏర్పడే బ్యాంక్ మొత్తం ఆస్తుల విలువ రూ.25.67 లక్షల కోట్లకు చేరనుంది.

దేశీయ బ్యాంకింగ్ రంగంలో ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తర్వాత మూడో స్థానంలో ఉన్న ఐసీఐసీఐ బ్యాంక్ ప్రస్తుత ఆస్తులు రూ.26.42 లక్షల కోట్లకు విలీన బ్యాంక్ ఆస్తుల విలువ చేరువ కానుంది.

చెన్నై కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐఓబీ), ఇండియన్ బ్యాంక్‌లను సైతం ఒక్కటి చేయాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. అంతేకాదు, మిగతా పీఎస్‌బీలతో పోలిస్తే తక్కువ ఆస్తులు కలిగిన పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్ (పీ అండ్ ఎస్‌బీ), బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (బీఓఎం)ను భవిష్యత్‌లో ప్రైవేటీకరించే ఆలోచన కూడా ఉన్నట్లు తెలిసింది.

డజను పీఎస్‌బీలు

చివరిసారి 2020లో మోదీ ప్రభుత్వం పీఎస్‌బీల విలీనాలను చేపట్టింది. దీంతో పీఎస్‌బీల సంఖ్య 27 నుంచి 12కు తగ్గింది. ఈ మార్చి నాటికి ఈ డజను పీఎస్‌బీల ఆస్తుల మొత్తం విలువ దాదాపు 1.95 లక్షల కోట్ల డాలర్లు. అంటే, మన కరెన్సీలో సుమారు రూ.171 లక్షల కోట్లు. దేశీయ బ్యాంకింగ్ రంగ మొత్తం ఆస్తుల్లో 55 శాతానికి సమానమిది.

వికసిత్ భారత్ లక్ష్యాల్లో భాగంగానే..

ఆస్తుల విలువపరంగా ప్రస్తుతం ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మాత్రమే ప్రపంచంలోని 100 అతిపెద్ద బ్యాంకుల జాబితాలో ఉన్నాయి. వీటి తరహాలో మరో 3-4 మెగా పీఎస్‌బీలను ఏర్పాటు చేయడమే లక్ష్యంగా ఈసారి విలీనాలను చేపట్టనున్నట్లు సమాచారం. వికసిత్ భారత్ లక్ష్యాల సాధనకు దేశంలో మరిన్ని ప్రపంచ స్థాయి బ్యాంక్‌ల ఏర్పాటు అవసరమని మోదీ సర్కారు భావిస్తోంది. అంతేకాదు, మలి విడత సంస్కరణల్లో భాగంగా పీఎస్‌బీల్లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) పరిమితిని 49 శాతానికి పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది. పీఎస్‌బీల్లో విదేశీ పెట్టుబడుల ప్రస్తుత పరిమితి 20 శాతంగా ఉంది. ప్రైవేట్ రంగ బ్యాంక్‌ల్లో 74 శాతం వరకు విదేశీ పెట్టుబడులకు అనుమతి ఉంది.

ఐదేళ్లలో మార్కెట్లోకి 8 కొత్త ఎస్‌యూవీలు



మారుతి సుజుకీ ప్రణాళిక

టోక్యో: రాబోయే ఐదేళ్ల కాలంలో ఎనిమిది కొత్త ఎస్‌యూవీలను మార్కెట్లోకి తీసుకురానున్నట్లు దేశీయ కార్ల తయారీ దిగ్గజం మారుతి సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ) ప్రకటించింది. ఈ కొత్త ఎస్‌యూవీలతో కంపెనీకి చెందిన ఎస్‌యూవీల సంఖ్య 28కి చేరుతుంది. భారత మార్కెట్లో 50% మార్కెట్ వాటా తిరిగి సాధించాలన్నది తమ ధ్యేయమని, ఇందుకు అది సహాయకారి అవుతుందని సుజుకీ మోటార్ కార్పొరేషన్ రిప్రెజెంటేటివ్ డైరెక్టర్, ప్రెసిడెంట్ తొషిహిరో సుజుకీ అన్నారు. అయితే తీవ్రమైన పోటీ నెలకొన్న భారత మార్కెట్లో ఆ లక్ష్యాన్ని చేరడం అంత తేలికైన పని కాదని జపాన్ మొబిలిటీ షో సందర్భంగా భారతీయ విలేకరులతో మాట్లాడుతూ ఆయన వ్యాఖ్యానించారు. మారుతి సుజుకీలో సుజుకీ మోటార్ కార్పొరేషన్‌కు 58% వాటా ఉంది. సుమారు 43 లక్షల వాహనాల సామర్థ్యం గల భారత మార్కెట్లో ఏప్రిల్-సెప్టెంబరు మధ్య కాలంలో మారుతి సుజుకీ వాటా 39 శాతానికి తగ్గింది. రాబోయే కాలంలో 50% మార్కెట్ వాటా తిరిగి సాధించడంతో పాటు విద్యుత్ కార్ల ఉత్పత్తి, ఎగుమతుల్లో నంబర్ వన్ కావాలనుకుంటున్నట్టు సుజుకీ చెప్పారు. కాగా, 2030-31 నాటికి దేశంలో రూ.70 వేల కోట్ల పెట్టుబడులు పెడుతున్నట్టు మారుతి సుజుకీ ఇప్పటికే ప్రకటించింది.

మరిన్ని ఎస్‌యూవీలు తెస్తాం: హోండా కార్స్

భారత మార్కెట్లోకి మరిన్ని ఎస్‌యూవీలు తీసుకురావాలని భావిస్తున్నట్టు హోండా కార్స్ ఇండియా తెలిపింది. కంపెనీ ప్రెసిడెంట్, సీఈఓ తకాషి నకజిమా మాట్లాడుతూ.. అమెరికా, జపాన్‌తో పాటు భవిష్యత్ వృద్ధికి తమకు భారత్ కీలక మార్కెట్ అని అన్నారు. భారత మార్కెట్లో ఎస్‌యూవీల అమ్మకాలు జోరుగా ఉన్నాయని, భవిష్యత్తులో కూడా ఇదే ధోరణి కొనసాగుతుందని ఆయన చెప్పారు. భారత్‌లో తమ టూవీలర్ విభాగం ఇప్పటికే అతిపెద్ద వ్యాపారమని, బ్రాండ్, అమ్మకాలు రెండూ పెంచడం ద్వారా కార్ల మార్కెట్లో కూడా అదే తరహాలో బలం పుంజుకోవాలనుకుంటున్నామని అన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో మూడు కొత్త ఎస్‌యూవీలు ప్రవేశపెట్టాలనుకుంటున్నామంటూ వాటిలో హైబ్రిడ్, బ్యాటరీ మోడళ్లుంటాయని తకాషి తెలిపారు.

కొత్తతరం ఈవీ 'ఓపీ ఆల్ఫా' ఆవిష్కారం



హోండా మోటార్ 'హోండా ఓపీ ఆల్ఫా' పేరిట కొత్త తరం ఎలక్ట్రిక్ ఎస్‌యూవీని ఆవిష్కరించింది. 2027లో భారత్‌లో ఈ కారు అమ్మకాలు ప్రారంభించాలని యోచిస్తోంది. ఇది అటు పట్టణ, ఇటు పల్లె వాతావరణాలు రెండింటిలోనూ నడపదగ్గదని తెలుపుతూ, భారత్‌లో ఇది తమ తొలి బ్యాటరీ విద్యుత్ కారు అని తకాషి చెప్పారు.

ఎన్‌విడియా @ 5 లక్షల కోట్ల డాలర్లు

ప్రపంచంలో ఈ స్థాయి మార్కెట్ విలువ కలిగిన ఏకైక సంస్థ

భారత్, జపాన్, యూకే జీడీపీ కంటే అధికం



న్యూయార్క్: కృత్రిమ మేధ (ఏఐ) చిప్‌ల తయారీ దిగ్గజం ఎన్‌విడియా సరికొత్త రికార్డు సృష్టించింది. అమెరికా స్టాక్ మార్కెట్లో కంపెనీ షేరు బుధవారం నాడు ఒక దశలో 5.17 శాతం పెరిగి 211.43 డాలర్లకు చేరింది. దాంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ 5.13 లక్షల కోట్ల డాలర్లకు ఎగబాకింది. ప్రపంచంలో 5 ట్రిలియన్ డాలర్ల మార్కెట్ విలువకు చేరుకున్న ఏకైక, తొలి కంపెనీ ఇదే. భారత్, జపాన్, యూకే జీడీపీల కంటే అధికమిది. కంపెనీకి 50,000 కోట్ల డాలర్ల విలువైన ఏఐ చిప్‌ల ఆర్డర్లు లభించాయని, అమెరికా ప్రభుత్వం కోసం 7 కొత్త సూపర్ కంప్యూటర్లను అభివృద్ధి చేయనున్నట్లు ఎన్‌విడియా సీఈఓ జెన్సెన్ హువాంగ్ ప్రకటించడం తాజా ర్యాలీకి దోహదపడింది. అలాగే, 6జీ సెల్యులార్ టెక్నాలజీ అభివృద్ధి కోసం నోకియాలో 100 కోట్ల డాలర్ల పెట్టుబడులు పెడుతున్నట్లు కంపెనీ ప్రకటించడం కూడా ఇందుకు తోడ్పడింది. మంగళవారం ట్రేడింగ్‌లోనూ కంపెనీ షేరు 5% మేర లాభపడింది. ప్రపంచంలో అత్యంత విలువైన కంపెనీల జాబితాలో ఎన్‌విడియా తర్వాత ఐఫోన్ల తయారీ సంస్థ యాపిల్, మైక్రోసాఫ్ట్ 4 లక్షల కోట్ల డాలర్లకు పైగా మార్కెట్ విలువతో వరుసగా 2,3 స్థానాల్లో ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఏఐ సేవలకు, చిప్‌లకు డిమాండ్ శరవేగంగా పెరుగుతుండటంతో ఎన్‌విడియా షేరు కూడా అంతే వేగంగా పెరుగుతూ వచ్చింది. ఈ ఏడాదిలో ఇప్పటికే 50% పైగా పుంజుకుంది.

ఎన్‌విడియా ప్రస్థానంలో కీలక మైలురాళ్లు

- వీడియో గేమ్ ప్రాసెసర్ల తయారీతో తన ప్రస్థానాన్ని ప్రారంభించిన ఎన్‌విడియా.. ప్రస్తుత ఏఐ బూమ్‌లో అత్యంత కీలక కంపెనీగా ఎదిగింది.
- 1999లో సంస్థ పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)కు వచ్చింది. 12 డాలర్ల వద్ద కంపెనీ షేరు మార్కెట్లో నమోదైంది. ఆ సమయంలో సంస్థ మార్కెట్ విలువ 100 కోట్ల డాలర్ల కంటే తక్కువే.
- ఈ ఏడాది జూలై 10న ఎన్‌విడియా 4 లక్షల కోట్ల మార్కెట్ విలువ కలిగిన తొలి సంస్థగా అవతరించింది.
- 100 బిలియన్ డాలర్ల నుంచి 4 ట్రిలియన్ డాలర్ల మార్కెట్ విలువను సాధించేందుకు కంపెనీకి 26 ఏళ్లు పట్టగా.. ఆ తర్వాత కేవలం మూడు నెలలకు పైగా కాలంలోనే మరో లక్ష కోట్ల డాలర్ల మార్కెట్ విలువను సాధించడం విశేషం.
- కంపెనీ మార్కెట్ విలువ 2023లో తొలి లక్ష కోట్ల డాలర్ల మైలురాయికి చేరింది. గడిచిన రెండేళ్లలో 4 లక్షల కోట్ల వృద్ధిని సాధించడం మరో విశేషం.

మార్చి నాటికి హైదరాబాద్ మెట్రోకు గుడ్‌బై

ఎల్ అండ్ టీ ప్రెసిడెంట్ శంకర్ రామన్

న్యూఢిల్లీ: హైదరాబాద్ మెట్రో నుంచి పెట్టుబడుల ఉపసంహరణ ప్రస్తుత త్రైమాసికం లేదా రాబోయే త్రైమాసికాని (జనవరి-మార్చి)కి మధ్యలో ఏ సమయంలో అయినా జరగవచ్చని ఎల్ అండ్ టీ ప్రెసిడెంట్, హోల్‌టైమ్ డైరెక్టర్ ఆర్ శంకర్ రామన్ చెప్పారు. ఎల్ అండ్ టీ సెప్టెంబరు (క్యూ2) త్రైమాసిక ఫలితాల అనంతరం ఇన్వెస్టర్ కాల్‌లో ఆయన మాట్లాడుతూ.. తాము ఇప్పటికే ఈ విషయం ఎక్స్ఛేంజీలకు, మార్కెట్లకు తెలియచేశామని, పెట్టుబడుల ఉపసంహరణ విధివిధానాలపై ప్రభుత్వంతో సవివరంగా చర్చిస్తున్నట్లు వెల్లడించారు. ఈ లావాదేవీకి సంబంధించిన పత్రాల విషయంలో కొన్ని లోపాలు జరిగి ఉండవచ్చని, అందుకే వచ్చే త్రైమాసికం నాటికి అది పూర్తి కావచ్చన్న అభిప్రాయం తాను ప్రకటించానని ఆయన వివరించారు. ఎంత తొందరగా పూర్తయితే అంత మంచిది అయినప్పటికీ గడువును నిర్ణయించడంలో తాము ఒక్కరే భాగం కాదన్న విషయం ఆయన గుర్తు చేశారు.

క్యూ2 లాభంలో 15.6% వృద్ధి: ఎల్ అండ్ టీ సెప్టెంబరు త్రైమాసికంలో రూ.3,926.09 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.3,395.29 కోట్లతో పోల్చితే లాభం 15.6% పెరిగింది.

మళ్లీ 26,000 పైకి నిఫ్టీ

ఇంట్రాడేలో 85,000 ఎగువకు సెన్సెక్స్

ముంబై: అమెరికా ఫెడ్ రిజర్వ్ ప్రామాణిక వడ్డీ రేట్లను మరింత తగ్గించనుందన్న అంచనాలతో అంతర్జాతీయ మార్కెట్లు ర్యాలీ తీసిన నేపథ్యంలో దేశీయ సూచీలూ బుధవారం లాభాల్లో పయనించాయి. సెన్సెక్స్ ఒకదశలో 477.67 పాయింట్లు ఎగబాకి 85,105.83 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి సూచీ 368.97 పాయింట్ల లాభంతో 84,997.13 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 117.70 పాయింట్లు బలపడి 26,053.90 వద్ద ముగిసింది.

బోట్ రూ.1,500 కోట్ల ఐపీఓ: బోట్ బ్రాండ్‌నేమ్‌తో వేరబుల్ గ్యాడ్జెట్లను విక్రయిస్తున్న ఇమాజిన్ మార్కెటింగ్.. ఐపీఓ ద్వారా రూ.1,500 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఐపీఓలో భాగంగా రూ.500 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రమోటర్లు, ఇన్వెస్టర్లకు చెందిన రూ.1,000 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతిన విక్రయించనుంది.

స్పోర్ట్స్

రోహిత్@1



- కెరీర్‌లో తొలిసారి టాప్ ర్యాంక్ సొంతం
- ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్

దుబాయ్: కెరీర్‌లో తొలిసారి రోహిత్ శర్మ ఐసీసీ వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో నిలిచాడు. ఇటీవలే ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్ మూడో మ్యాచ్‌లో అజేయంగా 121 పరుగులతో అదరగొట్టిన రోహిత్.. రెండు స్థానాలు మెరుగుపర్చుకొని నెం:1 ర్యాంక్‌ను కైవసం చేసుకొన్నాడు. శుభ్‌మన్ గిల్ మూడో స్థానానికి పడిపోయాడు. సుదీర్ఘ కెరీర్‌లో ఎప్పుడూ టాప్-10లోనే నిలిచిన 38 ఏళ్ల రోహిత్ చరమాంకంలో కెరీర్ బెస్ట్‌ను సొంతం చేసుకోవడం విశేషం. ఆల్‌రౌండర్ల విభాగంలో అక్షర్ పటేల్ నాలుగు మెట్లెక్కి ఎనిమిదో ర్యాంక్‌ను సొంతం చేసుకున్నాడు.

పోరాడి ఓడిన టైటాన్స్

- క్వాలిఫయర్-2లో పుణెరి పల్టన్ విజయం
- ఫైనల్లో దబాంగ్ ఢిల్లీతో అమీతుమీ

న్యూఢిల్లీ: ప్రొ కబడ్డీ లీగ్‌లో తెలుగు టైటాన్స్ కథ ముగిసింది. బుధవారం హోరాహోరీగా జరిగిన క్వాలిఫయర్-2లో టైటాన్స్ 45-50తో పుణెరి పల్టన్ చేతిలో పరాజయం పాలైంది. చివరి 3 నిమిషాల్లో స్టార్ రైడర్ ఆదిత్య షిండే ఐదు పాయింట్ల సూపర్ రైడ్‌తో మ్యాచ్‌ను పల్టన్‌వైపు తిప్పాడు. ఈ మ్యాచ్‌లో గెలిచిన పుణెరి పల్టన్ శుక్రవారం జరిగే టైటిల్ పోరులో దబాంగ్ ఢిల్లీతో తాడోపేడో తేల్చుకోనుంది. టైటాన్స్ ప్లేయర్ భరత్ 23 పాయింట్లతో టాప్ స్కోరర్‌గా నిలిచినా జట్టును గెలిపించలేక పోయాడు. ఫస్టాఫ్ చివరికి టైటాన్స్ 24-20తో పైచేయిగా నిలిచింది.

లక్ష్యసేన్ ముందంజ

- శ్రీకాంత్ అవుట్
- హైలో ఓపెన్

జార్‌బ్రుకెన్ (జర్మనీ): కిడాంబి శ్రీకాంత్‌కు హైలో ఓపెన్ సూపర్ 500 బ్యాడ్మింటన్ ఈవెంట్‌లో చుక్కెదురైంది. ఆరంభ రౌండ్లో భారత్‌కే చెందిన కిరణ్ జార్జ్ 21-19, 21-11తో ప్రపంచ మాజీ నెంబర్‌వన్ శ్రీకాంత్‌ను చిత్తుచేసి ప్రీక్వార్టర్స్‌కు దూసుకెళ్లాడు. కాగా లక్ష్యసేన్ 21-16, 22-20తో ఐదో సీడ్ క్రిస్టో పొపోవ్ (ఫ్రాన్స్)కు షాకిచ్చి రెండోరౌండ్‌కు చేరాడు. ప్రీక్వార్టర్స్‌లో సహచర షట్లర్ శంకర్ ముత్తుసామితో లక్ష్య తలపడనున్నాడు. మహిళల సింగిల్స్‌లో రైజింగ్ స్టార్ శ్రియాంశి వలిశెట్టి ముందంజ వేసింది.

ఫైనల్లో సఫారీలు



- సెంచరీతో కదం తొక్కిన కెప్టెన్ లారా వోల్వార్ట్
- మరిజానెకు ఐదు వికెట్లు
- చిత్తుగా ఓడిన ఇంగ్లండ్

గువాహటి: ప్రతిష్ఠాత్మక ప్రపంచ కప్‌ను సొంతం చేసుకొనేందుకు దక్షిణాఫ్రికా మహిళలు అడుగు దూరంలో నిలిచారు. బుధవారం జరిగిన తొలి సెమీఫైనల్లో సఫారీలు ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టారు. 125 పరుగుల తేడాతో మాజీ చాంపియన్ ఇంగ్లండ్‌ను చిత్తు చేసి ఫైనల్లో అడుగుపెట్టారు. మొదట బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా 50 ఓవర్లలో ఏడు వికెట్లకు 319 పరుగులు చేసింది. కెప్టెన్ లారా వోల్వార్ట్ (169) సెంచరీతో కదం తొక్కింది. తజ్మిన్ బ్రిట్స్ (45), మరిజానె కాప్ (42), ట్రయాన్ (33) రాణించారు. స్పిన్నర్ ఎకిల్‌స్టోన్ నాలుగు వికెట్లు పడగొట్టింది. భారీ ఛేదనలో పేసర్ కాప్ (5/20) ధాటికి ఇంగ్లండ్ 42.3 ఓవర్లలో 194 పరుగులకే కుప్పకూలింది. కెప్టెన్ బ్రంట్ (64), కాప్సీ (50) హాఫ్ సెంచరీలు చేశారు. డిక్లెర్క్ రెండు వికెట్లు కైవసం చేసుకుంది. వోల్వార్ట్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచింది.

దక్షిణాఫ్రికా: 50 ఓవర్లలో 319/7 (వోల్వార్ట్ 169, బ్రిట్స్ 45, కాప్ 42, ట్రయన్ 33 నాటౌట్, ఎకిల్‌స్టోన్ 4/44, లారెన్ బెల్ 2/55)
ఇంగ్లండ్: 42.3 ఓవర్లలో 194 ఆలౌట్ (బ్రంట్ 64, కాప్సీ 50, డానీ వ్యాట్ 34, లస్సీ స్మిత్ 27, కాప్ 5/20, డి క్లెర్క్ 2/24).

ఆ ఇద్దరూ ఆడకుంటే..: ఛేదనలో కాప్ వణికించడంతో ఇంగ్లండ్ ఒక పరుగుకే మూడు వికెట్లు చేజార్చుకుంది. ఈ దశలో బ్రంట్, కాప్సీ నాలుగో వికెట్‌కు 107 పరుగులు జత చేయడంతో ఇంగ్లండ్ పరువు దక్కించుకుంది. ఆపై దక్షిణాఫ్రికా బౌలర్లు మళ్లీ విజృంభించడంతో ఇంగ్లండ్ కనీసం 200 పరుగులు కూడా చేయలేకపోయింది.

వోల్వార్ట్ ఒంటి చేత్తో..: కెప్టెన్ ఆట ఎలా ఉండాలో నిరూపిస్తూ వోల్వార్ట్ ఒంటిచేత్తో సౌతాఫ్రికా ఇన్నింగ్స్‌ను నడిపించింది. మరో ఓపెనర్ బ్రిట్స్ జతగా మొదటి వికెట్‌కు వోల్వార్ట్ 116 పరుగులు జోడించింది. కానీ 23వ ఓవర్లో బ్రిట్స్, బాష్ (0) బౌల్డ్ చేసిన స్పిన్నర్ ఎకిల్‌స్టోన్ సఫారీలకు షాకిచ్చింది. కానీ కాప్ జతగా నాలుగో వికెట్‌కు 72 పరుగులు జత చేసిన లారా ఆపై, ట్రయాన్ జతగా ఏడో వికెట్‌కు 89 పరుగులు జోడించి జట్టును ఆదుకుంది.

అమ్మాయిలకు అగ్నిపరీక్ష

మ. 3 గంటల నుంచి



ప్రాక్టీస్‌లో ఆసీస్ క్రికెటర్లు

నేడు ఆస్ట్రేలియాతో భారత్ సెమీస్

వన్డే వరల్డ్ కప్



జట్లు (అంచనా)

భారత్: హర్మన్ ప్రీత్ (కెప్టెన్), స్మృతీ మంధాన, హర్లీన్, షఫాలీ, దీప్తిశర్మ, జెమీమా, స్నేహ్ రాణా, శ్రీచరణి, రేణుకా సింగ్, రిచా ఘోష్ (కీపర్), క్రాంతి గౌడ్.
ఆస్ట్రేలియా: అలిసా హీలీ (కెప్టెన్), గార్డ్‌నర్, కిమ్ గార్త్, అలనా కింగ్, లిచ్‌ఫీల్డ్, మెక్‌గ్రాత్, మోలినెక్స్, బేత్ మూనీ (కీపర్), పెర్రీ, షూట్, సదర్లాండ్.

వాతావరణం

గురువారం వర్షం కురిసే అవకాశం 25 శాతం మేర ఉంది. కనీసం 20 ఓవర్లు సాధ్యపడకపోతే మ్యాచ్ నిలిచిపోయిన దగ్గరనుంచి శుక్రవారం రిజర్వ్‌డే నాడు మిగతా ఆట కొనసాగుతుంది. ఒక వేళ రిజర్వ్‌డే రోజు కూడా ఫలితం రాకపోతే గ్రూప్ దశలో భారత్‌కంటే అత్యధిక విజయాలున్న ఆస్ట్రేలియా ఫైనల్‌కు వెళ్తుంది.

నవీ ముంబై: కొంచెం కష్టానికి మరికొంత అదృష్టం కలిసొచ్చి వరల్డ్ కప్‌లో సెమీఫైనల్‌కు చేరిన భారత జట్టు ఇప్పుడిక అసలు సిసలు సవాలుకు సిద్ధమైంది. గురువారం జరిగే రెండో సెమీఫైనల్లో పటిష్ఠమైన ఆస్ట్రేలియాతో తలపడనుంది. ఈ సందర్భంగా డెర్బీలో జరిగిన 2017 ప్రపంచ కప్ సెమీఫైనల్లో ఆస్ట్రేలియా జట్టుపైనే ప్రస్తుత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ చేసిన అసామాన ప్రదర్శన గుర్తు చేసుకోవాలి. ఆ మ్యాచ్‌లో ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకు పడిన కౌర్ కేవలం 115 బంతులలో అజేయంగా 171 పరుగులు చేసి భారత్‌కు అపురూప విజయం అందించింది. మరి..ఈసారి సెమీఫైనల్లోనూ కౌర్ సారథ్యంలోని మన అమ్మాయిలు ఆ మ్యాచ్ ఫలితాన్ని పునరావృతం చేస్తారేమో చూడాలి. కానీ ఈసారి టోర్నీలో హర్మన్ సేన నిలకడైన ప్రదర్శన కనబర్చలేకపోయింది. వరుసగా మూడు పరాజయాలు చవిచూడడమే అందుకు ఉదాహరణ.


జట్టు కూర్పు ఆసక్తికరం..

సెమీస్‌కు ముందు కీలక బ్యాటర్ ప్రతీక రావల్ గాయంతో వైదొలగడం భారత్‌కు పెద్ద దెబ్బ. దాంతో దూకుడైన బ్యాటింగ్ చేసే షఫాలీ వర్మను ప్రతీక స్థానంలో తీసుకున్నారు. ఆస్ట్రేలియాపై ఒత్తిడి తెచ్చే ఉద్దేశంతో..మంధానతో కలిసి షఫాలీని ఓపెనింగ్ చేయిస్తారా? లేదంటే ఆరో బౌలర్‌కు చోటు కల్పించేందుకు హర్లీన్ డియోల్‌ను ఓపెనర్‌గా పంపుతారా.. అనేది చూడాలి. అలాగే..బంగ్లాదేశ్‌పై గత మ్యాచ్‌లో పదునైన బౌలింగ్‌తోపాటు చురుకైన ఫీల్డింగ్‌తో ఆకట్టుకున్న స్పిన్నర్ రాధా యాదవ్‌ను కొనసాగిస్తారా అనేదీ ఆసక్తికరం. ఈ సారి టోర్నమెంట్‌లో స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోయిన కెప్టెన్ కౌర్..ఎనిమిదేళ్ల నాటి సెమీస్ ఇన్నింగ్స్ స్ఫూర్తిగా ఆస్ట్రేలియాపై మరోసారి విరుచుకు పడాలన్నది అభిమానుల ఆకాంక్ష. మరోవైపు ఇప్పటికే ఒక సెంచరీ, రెండు హాఫ్ సెంచరీలతో సూపర్ ఫామ్‌లో ఉన్న మంధాన అదే జోరు కొనసాగించాల్సి ఉంటుంది. అయితే బౌలర్లు ధారాళంగా పరుగులిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ఈనేపథ్యంలో పటిష్ఠమైన ఆస్ట్రేలియా బ్యాటర్లను నిలువరించాలంటే మన బౌలర్లు శక్తికి మించి సత్తా చాటాల్సిందే.

హీలీ ఓకే..

ఈసారి పలు మ్యాచ్‌ల్లో క్లిష్ట సమయాల్లో పుంజుకొన్న తీరు ఆస్ట్రేలియా పోరాట పటిమను తెలియజేస్తుంది. కాగా.. కండర గాయంతో చివరి రెండు లీగ్ మ్యాచ్‌లకు దూరమైన కెప్టెన్ హీలీ ఫిట్‌నెస్ టెస్ట్‌లో నెగ్గడం సెమీస్‌కు ముందు ఆసీస్ జట్టుకు అత్యంత సానుకూలాంశం.

సూర్య ప్రతాపంపై నీళ్లు



సూర్యకుమార్ (39 నాటౌట్)

- వరుణుడిదే పైచేయి
- ఆసీస్-భారత్ తొలి టీ20 రద్దు

కాన్‌బెర్రా: చాన్నాళ్ల తర్వాత ఫామ్ దొరకబుచ్చుకున్న టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (24 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 39 నాటౌట్) జోష్‌పై వరుణుడు నీళ్లు కుమ్మరించాడు. ఎడతెగని వర్షం కారణంగా ఆస్ట్రేలియా-భారత్ జట్ల మధ్య తొలి టీ20 అర్ధంతరంగా రద్దయింది. టాస్ కోల్పోయి తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత్ ఆట నిలిచే సమయానికి 9.4 ఓవర్లలో 97/1 స్కోరు చేసింది. ఓపెనర్ శుభ్‌మన్ గిల్ (20 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 37 నాటౌట్), సూర్య రెండో వికెట్‌కు 35 బంతుల్లో 62 పరుగులు జోడించారు. అంతకుముందు 5 ఓవర్లు పూర్తవగానే సుమారు 40 నిమిషాలపాటు వాన ఆటంకం కలిగించడంతో మ్యాచ్‌ను 18 ఓవర్లకు కుదించారు. కానీ ఆ తర్వాత మరోసారి మొదలైన వర్షం ఆగకపోవడంతో అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. రెండో టీ20 శుక్రవారం మెల్‌బోర్న్‌లో జరగనుంది.

అభిషేక్ విఫలం: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు అభిషేక్ శర్మ (14 బంతుల్లో 4 ఫోర్లతో 19) అదిరే ఆరంభాన్ని అందించలేక పోయాడు. 4వ ఓవర్‌లో ఎల్లిస్ బౌలింగ్‌లో గిల్ 2 ఫోర్లతో జోరు చూపినా.. పేలవ షాట్ ఆడిన అభిషేక్ మిడాన్‌లో డేవిడ్‌కు క్యాచిచ్చాడు. దీంతో తొలి వికెట్‌కు 35 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అయితే, వన్‌డౌన్‌లో వచ్చిన సూర్య ఐదో ఓవర్‌లో హాజెల్‌వుడ్ బౌలింగ్‌లో 92 మీటర్ల దూరంలో భారీ సిక్స్ బాది స్టేడియంలో జోష్ తీసుకొచ్చాడు. బార్ట్‌లెట్ బౌలింగ్‌లో ఫిలిప్స్ క్యాచ్ చేజార్చడంతో సూర్యకు లైఫ్ లభించింది. ఇక, పదో ఓవర్‌లో ఎల్లిస్ బౌలింగ్‌లో రెండు బౌండ్రీలు, ఓ సిక్స్ సాధించాడు. అతడి దూకుడు చేస్తే భారీ స్కోరు ఖాయమనుకొంటున్న తరుణంలో వర్షం అడ్డుపడింది.

స్కోరుబోర్డు

భారత్: అభిషేక్ (సి) డేవిడ్ (బి) ఎల్లిస్ 19, గిల్ (నాటౌట్) 37, సూర్యకుమార్ (నాటౌట్) 39; **ఎక్స్‌ట్రాలు: 2; మొత్తం: 9.4 ఓవర్లలో 97/1; వికెట్ పతనం:** 1-35; **బౌలింగ్:** హాజెల్‌వుడ్ 3-0-24-0, బార్ట్‌లెట్ 2-0-16-0, ఎల్లిస్ 1.4-0-25-1, స్టొయినిస్ 1-0-10-0, కునేమన్ 2-0-22-0.

1 — **టీ20ల్లో** అత్యంత వేగంగా 150 సిక్స్‌లు బాదిన బ్యాటర్‌గా సూర్యకుమార్. 86 ఇన్నింగ్స్‌లో 1649 బంతుల్లో సై.. ఈ మైలురాయిని అందుకొన్నాడు. యూఏఈ ఆటగాడు వసీం 66 ఇన్నింగ్స్‌లో 1543 బంతుల్లోనే 150 సిక్స్‌ల మార్క్‌ను చేరాడు. కానీ, అతడి రికార్డును అసోసియేట్ మెంబర్‌గా ఐసీసీ నమోదు చేసింది. ఓవరాల్‌గా 150, అంతకంటే ఎక్కువ సిక్స్‌లు కొట్టిన జాబితాలో రోహిత్ (205 ఇన్నింగ్స్), వసీం (187), గప్టిల్ (173), బట్లర్ (172) సూర్య కంటే ముందున్నారు.


నితీశ్‌కు మెడ నొప్పి



తొలి మూడు టీ20లకు దూరం

కాన్‌బెర్రా: టీమిండియా ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్‌ను గాయాలు వెంటాడుతున్నాయి. తాజాగా మెడనొప్పి కారణంగా అతడు ఆస్ట్రేలియాతో తొలి మూడు టీ20లకు దూరమయ్యాడు. కాగా, ఆసీస్‌తో అడిలైడ్‌లో జరిగిన రెండో వన్డేలో అతడికి తొడ కండర గాయమైంది. దీంతో మూడో వన్డేకు కూడా అందుబాటులో లేకుండా పోయాడు. అతడి ఆరోగ్య పరిస్థితిని మెడికల్ టీమ్ పర్యవేక్షిస్తోందని బీసీసీఐ ఓ ప్రకటనలో తెలిపింది.

హరీశ్‌కు ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణ పరామర్శ



హైదరాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావును, ఆయన కుటుంబ సభ్యులను ఏబీఎన్-ఆంధ్రజ్యోతి సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ పరామర్శించారు. మంగళవారం హరీశ్‌రావు తండ్రి సత్యనారాయణ మరణించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం ఆయన నివాసానికి వెళ్లిన రాధాకృష్ణ.. సత్యనారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి హరీశ్‌రావును, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. హరీశ్ నివాసానికి వెళ్లిన టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్, పార్టీ సీనియర్ నేత కేవీపీ, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్యనాయక్, బీజేపీ ఎమ్మెల్యే పాయల్‌శంకర్‌లు ఆయనను పరామర్శించారు.

విదేశీ విద్యకు భరోసా

(మొదటిపేజీ తరువాయి)

సూచించారు. ఆర్థిక స్తోమత లేక, ఉన్నత చదువులు చదవాలన్న ఆలోచనతో చాలామంది పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలు ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లతో విదేశాలకు వెళ్లారు. కొంత కాలంగా వారికి అవి అందడం లేదు. మరోవైపు అమెరికా, యునైటెడ్ కింగ్‌డమ్‌లలో విధిస్తున్న రకరకాల ఆంక్షలతో ఆ విద్యార్థులపై మానసిక ఒత్తిడి పెరుగుతోంది. గతంలో మాదిరిగా చదువుకుంటూ ఉద్యోగాలు చేసుకునే పరిస్థితి లేదు. మరోవైపు బ్యాంకుల్లో తీసుకున్న విద్యా రుణాల భారం పెరుగుతోంది. ఈ పరిస్థితులను అవగాహన చేసుకున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పెండింగ్‌లో ఉన్న ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌ల మొత్తాన్ని ఒకేసారి క్లియర్ చేయాలంటూ ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారని డిప్యూటీ సీఎం కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

3,752 ఈవీ చార్జింగ్ కేంద్రాలు

(మొదటిపేజీ తరువాయి)

చార్జింగ్ కేంద్రాలు పెట్టుకోవడానికి 3,752 ప్రాంతాలు అనువుగా ఉన్నాయని తేల్చారు. నాలు గు కేటగిరీల్లో ఈవీ చార్జింగ్ కేంద్రాలు పెట్టడానికి వీలుగా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల పరిధిలో ఏ కేటగిరీలో, నగరాలతో పాటు హైవేలను బీ, పట్టణాలు, వీధులు, షాపింగ్ మాల్స్, మార్కెట్ కాంప్లెక్స్‌లను సీ, బ్యాట రీ స్వాపింగ్ కేంద్రాలు/బ్యాటరీ చార్జింగ్ కేంద్రాలను ఎక్కడైనా పెట్టుకుంటే డీ కేటగిరీ కింద పరిగణనలోకి తీసుకున్నారు. ఇందులో ఏ కేటగిరీ కింద 1,991, బీలో 294, సీలో 1,467 ప్రాంతాలు అనువుగా ఉన్నాయని గుర్తించారు.



రక్తదానం చేస్తున్న డీజీపీ శివధర్‌రెడ్డి, అదనపు డీజీపీ మహేశ్ భగవత్, ఐజీలు చంద్రశేఖర్‌రెడ్డి, రమేశ్

ఒక యూనిట్ రక్తదానంతో ముగ్గురి ప్రాణాలు కాపాడవచ్చు: డీజీపీ

హైదరాబాద్, అక్టోబర్ 29 (ఆంధ్రజ్యోతి): రక్తదానం వల్ల ఆపదలో ఉన్నవారి ప్రాణాలు కాపాడే అవకాశం లభిస్తుందని, ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని రాష్ట్ర ప్రజలకు డీజీపీ శివధర్‌రెడ్డి సూచించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా బుధవారం డీజీపీ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. డీజీపీ శివధర్‌రెడ్డి, అదనపు డీజీపీ మహేశ్ భగవత్, ఐజీలు చంద్రశేఖర్‌రెడ్డి, రమేశ్‌తో పాటు మరో 134 మంది పోలీసులు రక్తదానం చేశారు. వీరందరి నుంచి రెడ్ క్రాస్ సొసైటీ సిబ్బంది రక్తాన్ని సేకరించారు. ఒక యూనిట్ రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడడంతో పాటు, రక్తంలోని ప్లాస్మా, ప్లేట్‌లెట్స్ వంటి వాటితో మరో ముగ్గురికి ప్రాణదానం చేసే అవకాశం ఉంటుందని డీజీపీ అన్నారు.

20% తేమ ఉన్నా పత్తి కొనుగోలు చేయండి

- కేంద్రానికి తుమ్మల, మల్లు రవి లేఖలు

న్యూఢిల్లీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాల వల్ల పత్తిలో తేమశాతం పెరిగే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో 20% తేమ ఉన్నా పత్తిని పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని కేంద్రమంత్రులకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ మల్లు రవి లేఖలు రాశారు. కేంద్రమంత్రులు జేపీ నడ్డా, శివరాజ్ సింగ్ చౌహాన్, గిరిరాజ్ సింగ్‌లతోపాటు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు తాము రాసిన లేఖలను సంబంధిత కార్యాలయాల్లో అందించిన తర్వాత తెలంగాణ భవన్‌లో మల్లు రవి మీడియాకు వివరాలు వెల్లడించారు. గత సీజన్‌లో యూరియా కొరత రైతులను తీవ్రంగా వేధించిందని, ఈ రబీ సీజన్‌లో ఆ ఇబ్బంది తలెత్తకుండా చూడాలని కోరినట్లు తెలిపారు.

లైంగికదాడి నిందితుడికి హైకోర్టులో ఎదురుదెబ్బ

హైదరాబాద్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): సైదాబాద్ జువెనైల్ హోంలో ఉన్న బాలురపై లైంగికదాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితుడు రెహమాన్(27)కు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. రెహమాన్‌ను కోర్టులో ప్రవేశపెట్టేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ అతడి బంధువులు దాఖలు చేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. నిందితుడిపై ఉన్న అభియోగాలు అత్యంత దారుణమైనవని, ఇప్పటికే జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపినందున ఎలాంటి ఉత్తర్వులు జారీచేయాల్సిన అవసరం లేదని జస్టిస్ మౌషుమి భట్టాచార్య, జస్టిస్ గాడి ప్రవీణ్‌కుమార్ ధర్మాసనం స్పష్టం చేసింది.

కేవలం బ్రీత్ ఎనలైజర్ టెస్ట్ సరిపోదు

ఒక ఉద్యోగి మద్యం సేవించాడని బ్రీత్ ఎనలైజర్ టెస్ట్ ద్వారా నిర్ధారణకు వచ్చి అతడిని సర్వీసు నుంచి తొలగించడం సమంజసం కాదని హైకోర్టు తెలిపింది. సదరు వ్యక్తి మద్యం సేవించాడనడానికి ఇతర రక్త, మూత్ర పరీక్షల ఫలితాలు కూడా ఉండాలని తెలిపింది. ఖమ్మం జిల్లా మధిర డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ వెంకటి మద్యం తాగి.. ఇతర ఉద్యోగులతో కలిసి ధర్నాలో పాల్గొన్నాడని ఆరోపిస్తూ ఆర్టీసీ యాజమాన్యం సర్వీసు నుంచి తొలగించింది. దీన్ని సవాల్ చేస్తూ పిటిషనర్ హైకోర్టును ఆశ్రయించగా.. తొలగింపు ఉత్తర్వులను హైకోర్టు కొట్టేసింది. పిటిషనర్‌ను సర్వీసులోకి తీసుకోవాలని ఆదేశిస్తూ తీర్పు జారీచేసింది.

పోలవరం, దేవాదుల, ఇందిరమ్మ వరద కాలువపై ప్రధాని 'ప్రగతి' భేటీ రద్దు

హైదరాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లోని పోలవరం, దేవాదుల ఎత్తిపోతల, ఇందిరమ్మ వరద కాలువ ప్రాజెక్టులపై ప్రధాని నరేంద్ర మోదీ 'ప్రగతి' పేరుతో బుధవారం నిర్వహించతలపెట్టిన సమీక్ష సమావేశం రద్దయింది. మరోవైపు నవంబరు 7న హైదరాబాద్‌లోని కృష్ణా-గోదావరి భవన్‌లో పోలవరం ప్రాజెక్టు అథారిటీ సమావేశం జరుగనుంది. ప్రాజెక్టు పనుల పురోగతితో పాటు, కేంద్ర పర్యావరణ అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వశాఖ అనుమతులు తదితర అంశాలపై అధికారులు ఈ సమావేశంలో చర్చించనున్నారు.

గాజుల పరిశ్రమలో బాల కార్మికులు

- ఇద్దరు యజమానులకు 14 ఏళ్ల జైలు
- రంగారెడ్డి జిల్లా కోర్టు సంచలన తీర్పు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రమాదకర ప్రదేశాల్లో బాల కార్మికులతో పనిచేయిస్తున్న ఇద్దరు గాజుల పరిశ్రమ యజమానులకు రంగారెడ్డి జిల్లా కోర్టు షాక్ ఇచ్చింది. నిందితులకు 14 ఏళ్ల జైలు శిక్షతోపాటు రూ.1,000 జరిమానా విధిస్తూ మంగళవారం సంచలన తీర్పు వెలువరించింది. పోలీసులు, చైల్డ్‌లైన్ అధికారులు 2022 జూన్ 18న బాలాపూర్ పరిధిలోని వెంకటాపూర్ క్రాస్ రోడ్స్‌లో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న గాజుల తయారీ పరిశ్రమపై దాడి చేశారు. అక్కడ ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేస్తున్న ఐదుగురు బాల కార్మికులను కాపాడి పునరావాస గృహానికి తరలించారు. బాల కార్మికులతో రోజుకు 10గంటలు పనిచేయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. కార్ఖానా యజమానులు మహ్మద్ అతీక్, మహ్మద్ అకీల్‌తో పాటు ఇంటి యజమాని సయ్యద్ పాషాపై కేసులు నమోదు చేశారు. కేసు విచారణలో ఉండగా బాల కార్మికుల తల్లిదండ్రులు బిహార్ నుంచి వచ్చి తమ పిల్లలను తమకు అప్పగించాలంటూ కోర్టులో పిటిషన్ వేసి.. తీసుకెళ్లారు. గాజుల కార్ఖానా యజమానులతో పాటు బాల కార్మికులు కూడా బిహార్‌కు చెందినవారే. ఈ నేపథ్యంలో బాల కార్మికుల కుటుంబాలతో యజమానులు ఒప్పందం కుదుర్చుకున్నారు. దీంతో బాల కార్మికులు, వారి తల్లిదండ్రులు విచారణకు హాజరు కావడం లేదు. పోలీసులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు కలిసి బిహార్‌లోని సంబంధిత జిల్లా కోర్టును ఆశ్రయించారు. ఆ కోర్టు నుంచి బాధితులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరయ్యేలా చూశారు. కేసు విచారించిన రంగారెడ్డి జిల్లా 7వ ఏడీజే కోర్టు నిందితులు అతీక్, అకీల్‌కు 14 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చింది. నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకున్న విచారణ అధికారి బీ శ్రీకాంత్, ఏపీపీలు పద్మజారెడ్డి, గంగారెడ్డితో పాటు సిబ్బందిని సీపీ జీ సుధీర్‌బాబు అభినందించారు. కాగా, బాల కార్మికులను పనిలో పెట్టుకున్న యజమానులకు వ్యతిరేకంగా ఎవరూ సాక్ష్యం చెప్పకపోవడం వల్ల చాలా కేసులు వీగిపోతుంటాయని ఏపీపీ గంగారెడ్డి తెలిపారు.

అన్నదాతకు దెబ్బ మీద దెబ్బ!

ఖరీఫ్‌లో అతివృష్టి, అకాల వర్షాలతో ఆగమాగం.. సాధారణం కంటే 34 శాతం అధిక వర్షపాతం



ఖమ్మం జిల్లా రఘునాథపాలెంలో దెబ్బతిన్న పత్తి

హైదరాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఈ వానాకాలం పంటల సాగు మొదలైనప్పటి నుంచి అన్నదాతలపై దెబ్బ మీద దెబ్బ పడుతోంది. తొలుత అనావృష్టి, తర్వాత అతివృష్టి, ఇప్పుడు అకాల వర్షాలు... రైతులను అతలాకుతలం చేస్తున్నాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు నీటి పాలయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. ఒకవైపు ప్రభుత్వం పంటల కొనుగోళ్లకు కేంద్రాలు ఏర్పాటుచేయగా.. మరోవైపు అకాల వర్షాలతో ధాన్యం, పత్తి, మొక్కజొన్న తదితర పంట ఉత్పత్తులు తడిసిపోవటం, తేమ సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మొంథా తుఫాన్ ప్రభావం కూడా రాష్ట్రంపై ఎక్కువగా ఉండటం ఆందోళనకరంగా మారింది. రాష్ట్రంలో ఏడాది సగటు వర్షపాతం 923.8 మి.మీ. అయితే... నైరుతి రుతుపవనాలతో(జూన్-సెప్టెంబరు వరకు) 740.6 మి.మీ, ఈశాన్య రుతుపవనాలతో 110.2 మి.మీ వర్షపాతం కురిస్తే లెక్క సరిపోతుంది. కానీ ఇప్పటివరకు రాష్ట్రంలో 1,109 మి.మీ వర్షపాతం నమోదైంది. గత సంవత్సరం మొత్తం కలిపి 1,023 మి.మీ వర్షపాతం నమోదైతే.. ఈసారి ఐదు నెలల్లోనే 1,109 మి.మీ వర్షపాతం నమోదు కావటం గమనార్హం. సాధారణ వర్షపాతంతో పోలిస్తే 34 శాతం అధికంగా నమోదైంది. అయితే వానాకాలం సీజన్ ప్రారంభ దశలో జూన్‌లో 20% లోటు వర్షపాతం నమోదైంది. రైతులు విత్తనాలు వేయటానికి కూడా వెనకా ముందూ ఆలోచించారు. జూలైలోనూ అంతంతమాత్రంగానే వర్షాలు పడ్డాయి. ఈ రెండు నెలలు కూడా రైతులు వర్షాభావ పరిస్థితులతో ఇబ్బందులు పడ్డారు. ఆగస్టు వచ్చేసరికి నైరుతి రుతుపవనాలు విజృంభించాయి. ఆ నెలలో 378.5 మి.మీ (75% అధికం), సెప్టెంబరులో 267.7 మి.మీ (60% అధికం) వర్షపాతం నమోదైంది. నైరుతి రుతుపవనాలు నిష్క్రమించి, ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించిన తర్వాత అక్టోబరులో 120.4 మి.మీ వర్షపాతం నమోదైంది. బుధవారం కూడా రాష్ట్రవ్యాప్తంగా కుండపోత వర్షం కురిసింది. దీంతో వర్షపాతం మరింత పెరిగింది.

తొలుత వర్షాభావం.. తర్వాత అతివృష్టి

వానాకాలం మొదలై 5 నెలలు అయ్యింది. జూన్, జూలై నెలల్లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరులో వానలు దంచికొడుతున్నాయి. ఆవర్తన ద్రోణులు, అల్పపీడనాల ప్రభావంతో రెండు నెలలు కుండపోత వర్షాలు కురిశాయి. ఇప్పుడేమో మొంథా తుఫాన్ తోడైంది. రైతులకు, పంటలకు వానలు అవసరంలేని పరిస్థితుల్లో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా కొన్ని ప్రాంతాల్లో 300 మి.మీ.కు మించి వర్షపాతం నమోదుకావటం గమనార్హం. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడలో 348.3 మి.మీ, నెక్కొండ మండలం రెడ్లవాడలో 301.8 మి.మీ రికార్డు స్థాయి వర్షపాతం నమోదైంది. వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్దిపేట, కరీంనగర్, మహబూబాబాద్, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాల్లో బుధవారం కుండపోత వర్షం కురిసింది. చేతికొచ్చిన పంటలు దెబ్బతింటున్నాయి. దీంతో రైతులకు ఏంచేయాలో తోచటంలేదు. వరదనీటి ప్రవాహానికి పంట ఉత్పత్తులు కొట్టుకపోతున్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండల కేంద్రానికి చెందిన పల్కపల్లి అలీ అనే రైతు ఒకటిన్నర ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేశారు. దీపావళి రోజు మొక్కజొన్న కోతకోసి కంకులు ఆరబెట్టారు. తేమ తగ్గిన తర్వాత కొనుగోలు కేంద్రంలో అమ్ముదామనుకుంటే.. బుధవారం కురిసిన వర్షం, వరద తాకిడికి ఒక్క మొక్కజొన్న కంకి కూడా మిగలకుండా మొత్తం కొట్టుకుపోయాయి. దాదాపు 30 క్వింటాళ్ల మక్కలు నీటిపాలయ్యాయని అలీ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో దాదాపు ఇలాంటి పరిస్థితులే నెలకొన్నాయి. కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకొచ్చిన ధాన్యం, పత్తి, మొక్కజొన్న పంటలు నీటిపాలయ్యాయి. చేతికొచ్చిన పంటలు కళ్ల ముందు వరద నీటిలో కొట్టుకపోతుంటే రైతులు నిస్సహాయులుగా చూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

'తేమ'తో సమస్యలు

ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం, పత్తి, మొక్కజొన్న, సోయాబీన్ కొనుగోలు కేంద్రాలు తెరిచారు. ప్రభుత్వం కనీస మద్దతు ధరకు ఈ పంట ఉత్పత్తులను సేకరిస్తోంది. అయితే వరి కోతలు, పత్తి తీత, మొక్కజొన్న కోతలకు వర్షాలు అడ్డంకిగా మారాయి. వరి ధాన్యం 17 శాతానికి మించి తేమ ఉంటే కొనే పరిస్థితిలేదు. పత్తి 8 శాతం నుంచి 12 శాతం వరకు తేమ ఉంటే పర్వాలేదు. అంతకుమించి ఉంటే సీసీఐ కొనడం లేదు. మొక్కజొన్న, సోయాబీన్ ఉత్పత్తులను మార్క్‌ఫెడ్ సేకరిస్తోంది. మొక్కజొన్న 14 శాతం, సోయాబీన్ 12 శాతానికి మించి తేమ ఉంటే సెంటర్లలో కాంటా పెట్టడంలేదు. ఎండలు కాస్తే తేమ తగ్గేది. ఎండలు, పొడి వాతావరణం లేకపోగా... వర్షాలు కుండపోతగా పడుతుండటంతో తేమ శాతం విపరీతంగా పెరుగుతోంది. ఏ పంటను చూసినా 20 శాతానికి మించి తేమ ఉండటంతో కొనుగోళ్లు ఇబ్బందికరంగా మారాయి. ప్రైవేటు ట్రేడర్లు ఇదే అదనుగా భావించి ధరలు విపరీతంగా తగ్గించారు. పంట ఉత్పత్తులను సకాలంలో అమ్ముకునే పరిస్థితి లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పంట నష్టంపై ప్రాథమిక నివేదిక

అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన ప్రాంతాల్లో వ్యవసాయ శాఖ అధికారులు పర్యటించాలని, ప్రాథమిక నివేదిక తయారుచేసి డైరెక్టరేట్‌కు పంపించాలని బుధవారం క్షేత్రస్థాయికి ఆదేశాలు వెళ్లాయి. ఏఈవోలు, ఏఈవోలతోపాటు ఏడీఏలు కూడా క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించాలని, పంట నష్టం అంచనా వేయాలని సూచించారు. వరద నీటి ప్రవాహం తగ్గిన తర్వాత పంటల పరిస్థితి ఏమిటి? తేలిన తర్వాత కోలుకుంటాయా? లేకపోతే పూర్తిగా నష్టపోయినట్లేనా? పంట నష్టం ఎంత శాతం జరిగింది? అనే అంశాలపై నివేదిక ఇవ్వాలని వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు గురువారం నుంచి క్షేత్రస్థాయిలో పంటల పరిశీలన చేస్తామని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.

ప్రభుత్వ బడుల్లో కార్పొరేట్ సౌకర్యాలు

విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఐడీ కార్డులు

- కంప్యూటర్, సైన్స్ ల్యాబ్‌లు, గ్రంథాలయాలు
- రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల అభివృద్ధిపై సర్కారు దృష్టి
- ప్రయోగాత్మకంగా తొలుత కొడంగల్ నియోజకవర్గంలో పనులు
- సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు



హైదరాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు మెరుగుపరిచి, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. ఇందులో భాగంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గాన్ని ప్రత్యేక యూనిట్‌గా తీసుకొని.. అక్కడి పాఠశాలల్లో సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించి, అవసరమైన వసతులు కల్పించనుంది. ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం కొడంగల్‌లో తొలుత ప్రయోగాత్మకంగా చేపట్టనున్నారు. ఆ తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయనున్నారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను సీఎం రేవంత్ రెడ్డి బుధవారం జారీ చేశారు. కాగా, పాఠశాలల అభివృద్ధి ప్రణాళికలో భాగంగా బడుల్లో సకల సదుపాయాలు కల్పనకు ప్రభుత్వం 13 అంశాలపై ప్రధానంగా దృష్టి సారిస్తుంది. వాటి ఆధారంగా పాఠశాలల్లో మరమ్మతులు సహా వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనుంది.

పాఠశాలల్లో ప్రభుత్వం చేపట్టనున్న పనులు ఇవే..

- కంప్యూటర్ ల్యాబ్‌లఏర్పాటు, ఇంటర్నెట్ సదుపాయం
- ల్యాబ్ ఫర్నీచర్, సైన్స్ ల్యాబ్‌ల ఏర్పాటు
- అన్ని ఉన్నత, మాధ్యమిక పాఠశాలల్లో గ్రంథాలయాల ఏర్పాటు
- ప్రతి పాఠశాలలో కనీసం రెండు క్రీడా మైదానాలు
- స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లు ఏర్పాటు
- విద్యార్థులకు ఒక జత షూ, 2 జతల సాక్స్‌ల పంపిణీ
- విద్యార్థులు, సిబ్బందికి ఐడీ కార్డులు
- పాఠశాలల్లో సీసీ కెమెరాలు, కలెక్టర్, డీఈఓ కార్యాలయాల్లో మినీ విజిల్ సిస్టమ్
- ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక సెక్షన్లు
- ఉన్నత పాఠశాలల్లో ఒకేషనల్ ఎడ్యుకేషన్
- 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ఐఐటీ, నీట్ ఫౌండేషన్ మెటీరియల్
- పాఠశాల భవనాలకు మరమ్మతులు

కొడంగల్‌లో పూర్తయిన సర్వే

సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్‌లో సర్కా రు పాఠశాలల అభివృద్ధికి సంబంధించిన సర్వే ఇప్పటికే పూర్తయింది. ఈ నియోజకవర్గంలో నారాయణపేట, వికారాబాద్ జిల్లాల పరిధిలో మొత్తం 295 పాఠశాలలుండగా 25,469 మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులో నారాయణపేట జిల్లాలో 126 స్థానిక సంస్థల పాఠశాలలుండగా 11,441 మంది విద్యార్థులు ఉన్నారు. రెండు కేజీబీవీల్లో కలిపి 578, ఒక మోడల్ స్కూల్‌లో 558 మంది విద్యార్థులున్నారు. వికారాబాద్ జిల్లాలో 163 స్థానిక సంస్థల బడుల్లో 12,013 మంది విద్యార్థులు ఉండగా, 3 కేజీబీవీల్లో 879 మంది ఉన్నారు. ఈ పాఠశాలల్లో కల్పించాల్సిన వసతులపై చేసిన అధ్యయనం పూర్తయింది. దాని ప్రకారం మొత్తం 57బడుల్లో బాలురు, 29 బడు ల్లో బాలికల మరుగుదొడ్ల అవసరం కాగా 31 చోట్ల మరమ్మతులు అవసరం. 22బడులకు విద్యుత్ సౌకర్యం కల్పించాల్సి ఉంది. 163 బడులకు ప్రహరీగోడ, 30 పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్‌లు, 144చోట్ల అదనపు తరగతి గదులు, 23 బడుల్లో ప్రధానోపాధ్యాయుల గదుల నిర్మాణం అవసరం ఉందని గుర్తించారు. 121 బడుల క్రీడా మైదానాలను అభివృద్ధి చేయాల్సి ఉంది.



శంషాబాద్‌లో సీఎస్ రామకృష్ణారావు కుమారుడు సిద్దార్థ చంద్ర వివాహ రిసెప్షన్‌లో సీఎం రేవంత్ దంపతులు

సేవల రంగంలో తెలంగాణ జోష్

దక్షిణాది రాష్ట్రాల్లోనే మెరుగైన వృద్ధి

- 'రాష్ట్ర జీవీఏ'లో సేవల రంగానికి 55% పైగా ఉన్న రాష్ట్రాల్లో స్థానం
- జాతీయ జీవీఏలో 5.22 శాతం వాటాతో 8వ స్థానంలో రాష్ట్రం
- 'నీతి ఆయోగ్' నివేదికలో వెల్లడి
- ద్వితీయ, తృతీయ స్థాయి పట్టణాలను ఇన్నోవేషన్ జోన్లుగా వృద్ధి చేయాలని సూచన

హైదరాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సేవల (సర్వీసెస్) రంగంలో తెలంగాణ దూకుడుగా ముందుకు వెళుతోందని నీతి ఆయోగ్ పేర్కొంది. దేశంలో 'రాష్ట్ర స్థూల విలువ జోడింపు (జీఎస్‌వీఏ)'లో సేవల రంగం వాటా 55శాతానికిపైగా ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటని వెల్లడించింది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ), ఫైనాన్స్, వృత్తిపరమైన సేవలు, డిజిటల్ సర్వీసులలో దక్షిణాది రాష్ట్రాల్లోనే తెలంగాణ గణనీయ వృద్ధి సాధిస్తోందని తెలిపింది. 'భారత సేవల రంగం: స్థూల విలువ జోడింపు (జీవీఏ) ధోరణులు, రాష్ట్ర స్థాయి క్రియాశీలత' పేరిట తాజాగా నీతి ఆయోగ్ విడుదల చేసిన నివేదికలో ఈ వివరాలను వెల్లడించింది. సేవా రంగంలో దక్షిణాది రాష్ట్రాలు, మహారాష్ట్ర ముందంజలో ఉన్నాయని తెలిపింది. 2023-24లో తెలంగాణతో పాటు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రల నుంచే దేశ సేవారంగానికి 40 శాతం వాటా సమకూరిందని వివరించింది. రాష్ట్రాల వారీగా చూస్తే సేవల రంగానికి మహారాష్ట్ర అత్యధికంగా 15.52 శాతంవాటాను అందించింది. కర్ణాటక (10.47 శాతం), తమిళనాడు (8.72), ఉత్తరప్రదేశ్ (7.78 శాతం) వాటాతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. 5.22 శాతం వాటాతో తెలంగాణ 8వ స్థానంలో నిలిచింది. ఐటీ, ఫైనాన్స్, ప్రొఫెషనల్ సర్వీసులు, డిజిటల్ ప్లాట్‌ఫారాలు వంటి విలువైన, ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ ఉన్న సేవా కేంద్రాలను అభివృద్ధి చేయడం వల్లే దక్షిణాది మూడు రాష్ట్రాలు వేగంగా పురోగమిస్తున్నాయని నీతి ఆయోగ్ ప్రశంసించింది.

సేవల రంగం వాటా ఆధారంగా నాలుగు కేటగిరీలు..

రాష్ట్ర స్థూల విలువ జోడింపు (జీఎస్‌వీఏ)లో సేవల రంగం వాటా ఆధారంగా రాష్ట్రాలను నాలుగు కేటగిరీలు చేసినట్టు నీతి ఆయోగ్ తెలిపింది. సేవల రంగం 55 శాతానికిపైగా ఉన్న రాష్ట్రాలు, 50-55 శాతం మధ్య ఉన్నవి, 40-50 శాతం మధ్య ఉన్నవి, 40 శాతానికంటే తక్కువ వాటా ఉన్నవిగా వర్గీకరించినట్టు తెలిపింది. 55 శాతానికిపైగా వాటా ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఢిల్లీ ఉన్నాయని వెల్లడించింది. ఈ రాష్ట్రాల్లోని ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాలను ఇన్నోవేషన్ జోన్లుగా అభివృద్ధి చేయాలని.. పరిశోధన, అభివృద్ధికి అనుసంధానమైన సేవలకు ఊతమివ్వాలని సూచించింది. 2024-25లో మొత్తంగా దేశ స్థూల విలువ జోడింపు(జీవీఏ)లో సేవల రంగం 55శాతం వాటాను అందించిందని నీతి ఆయోగ్ తెలిపింది. ఇది వ్యవసాయం వంటి ప్రాథమిక రంగం (16.7%), మాన్యుఫ్యాక్చరింగ్ వంటి ద్వితీయ రంగం (28.8%) వాటాల కంటే చాలా ఎక్కువని తెలిపింది. ఉపాధి కల్పనలో ఈ సేవల రంగం 30 శాతం వాటాను కలిగి ఉందని పేర్కొంది.

అగ్నిమాపక శాఖ ఆధునికీకరణకు సహకారం

- హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సీవీ ఆనంద్

హైదరాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): విపత్కర పరిస్థితుల్లో అగ్నిమాపక శాఖ అందిస్తున్న సేవల్ని హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సీవీ ఆనంద్ అభినందించారు. నానక్‌రాంగూడలోని అగ్నిమాపక శాఖ ప్రధాన కార్యాలయాన్ని ఆయన బుధవారం సందర్శించారు. ఈ కార్యాలయంతో పాటు కమాండ్ కంట్రోల్ సెంటర్ పనితీరు గురించి, అగ్ని ప్రమాదాలు, వరద ప్రభావిత ప్రాంతాల్లో, ఇతర అత్యవసర పరిస్థితుల్లో అగ్నిమాపకశాఖ స్పందిస్తున్న తీరు గురించి తెలుసుకున్నారు. దీనిని మరింతగా ఆధునికీకరించేందుకు ప్రభుత్వపరంగా సహకరిస్తామని సీవీ ఆనంద్ హామీ ఇచ్చారు. గత పదేళ్లలో ఈశాఖ సాధించిన విజయాలు, సేవల గురించి డీజీ విక్రంసింగ్‌మాన్ ఆనంద్‌కు వివరించారు.


వరంగల్ రైల్వే స్టేషన్‌లో నిలిచిన నీరు, ఆగిన రైలు


మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం అమ్మాపురం శివారు అచ్చుతండలో నీట మునిగిన వరి

మొంథా మోత

(మొదటిపేజీ తరువాయి)

మండలం బిలిజపూర్‌లో 15.9 సెం.మీ, నల్లగొండ జిల్లా శాలిగౌరారంలో 11.7 సెం.మీ, జనగామ జిల్లా పాలకుర్తి మండలం గూడూరులో 23.5 సెం.మీ వర్షపాతం నమోదైంది. యాదాద్రి జిల్లా వలిగొండ మండలం సంగెం-బొల్లెపల్లి, బీబీ నగర్ మండలం రుద్రవల్లి-జూలూరు లోలెవల్ వంతెనలపై నుంచి నాలుగు అడుగుల ఎత్తులో మూసీ వరవళ్లు తొక్కుతోంది. భువనగిరి, బీబీనగర్, వలిగొండ, చౌటుప్పల్ మండలాల్లోని పలు గ్రామాలకు మూడు రోజులుగా రాకపోకలు నిలిచిపోయాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. ఏడుచోట్ల 20-30 సెం.మీ మేర వర్షపాతం నమోదైంది. జనగామ జిల్లా జనగామ-హుస్నాబాద్ మార్గంలో గానుగపహాడ్ వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక వంతెన వరద తీవ్రతకు కొట్టుకుపోయింది. కరీంనగర్ రూరల్ మండలంలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడిసిపోయింది. ఖమ్మం జిల్లాలో మున్నేరు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో శివారు కాలనీల్లోని ప్రజలను పునరావాస శిబిరాలకు తరలిస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని దుందుభి, చంద్రసాగర్ నదులు ఉప్పొంగి ప్రవహించడంతో దాదాపు 20 గ్రామాలకు రవాణా స్తంభించిపోయింది. శ్రీశైలం- హైదరాబాద్ జాతీయ రహదారిలోని లత్తిపూర్ సమీపంలోని డిండి ప్రాజెక్టు అలుగు వద్ద వంతెన కోతకు గురైంది. ఆ వంతెనపై రాకపోకలు నిలిపివేశారు. హైదరాబాద్‌లోని జంట జలాశయాలకు వరద పెరగడంతో దిగువకు నీళ్లు వదిలారు. హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ నుంచి మొత్తంగా 6,203 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. హైదరాబాద్‌లో రోజంతా వర్షం పడింది. కొన్నిచోట్ల రోడ్ల మీద పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. మూసీకి ప్రవాహం పెరుగుతుండటంతో పరీవాహక ప్రాంతవాసులను హైడ్రా, జీహెచ్ఎంసీ అధికారులు అప్రమత్తం చేశారు. చాదర్‌ఘాట్ వంతెనకు దాదాపు అనుకుంటూ వరద ప్రవహిస్తోంది. మలకపేట ఆర్‌యూబీ వద్ద భారీగా నీరు చేరడంతో మోటార్లు పెట్టి నీటిని తోడేస్తున్నారు. భారీ వర్షాల నేపథ్యంలో ఆర్‌అండ్‌బీ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆ శాఖ మంత్రి కోమటిరెడ్డి ఆదేశించారు.


కోతకు గురైన నాగర్‌కర్నూలు జిల్లా ఉప్పునుంతల మండలం డిండి ప్రాజెక్టు అలుగుపై ఏర్పాటు చేసిన బ్రిడ్జి

రైళ్ల రద్దు.. దారి మళ్లింపు

భారీ వర్షాలు, వరదల కారణంగా సికింద్రాబాద్, విజయవాడ, విశాఖపట్నం రూట్లలో పలు రైళ్లను రద్దు చేసినట్లు.. కొన్ని రైళ్లను దారి మళ్లించినట్లు రైల్వే అధికారులు పేర్కొన్నారు. ఇంటర్‌సిటీ, ఈస్ట్‌కోస్ట్ రైళ్లను వరంగల్ రైల్వే స్టేషన్‌లో నిలిపివేశారు. కృష్ణా ఎక్స్‌ప్రెస్‌ను మహబూబాబాద్ రైల్వే స్టేషన్‌లో, గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌ను డోర్నకల్ రైల్వేస్టేషన్‌లో నిలిపివేశారు. (12705 /06) గుంటూరు-సికింద్రాబాద్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, అప్ అండ్ డౌన్ (6778) విజయవాడ-డోర్నకల్ ప్యాసింజర్, (67766) డోర్నకల్-కాజీపేట, (07001) చర్లపల్లి-తిరుపతి అప్‌అండ్ డౌన్, రైళ్లు బుధ, గురువారాల్లో రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. (12131) దాదర్ -సాయినగర్‌ల మధ్య షిర్డీ ఎక్స్‌ప్రెస్‌ను కాజీపేటలో నిలిపివేసి తిరిగి సికింద్రాబాద్ పంపించారు. కాజీపేట రైల్వే స్టేషన్‌లో రైల్వే ప్రయాణికుల కోసం హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్‌లోని కొర్లకుంట(మారెమ్మకుంట), బ్రాహ్మణకుంటలను పూడ్చి వాటిలో వెంచర్లు వేయడంతో వర్షపునీరు బయటకు పోయే దారిలేక రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫాం, రైల్వే యార్డుల మీదుగా వరద నీరు ప్రవహించింది. సిక్ వ్యాగన్‌షెడ్డులోకి వరదనీరు చేరడంతో పనులు నిలిచిపోయాయి. రైల్వేస్టేషన్‌లో పట్టాలు నీట మునగడంతో గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌ను స్టేషన్‌లోనే రైల్వే అధికారులు గంటల తరబడి నిలిపివేశారు. ఫలితంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ రైల్వే లైన్‌పై ప్లాట్‌ఫాం ఎత్తు వరకు వరదనీరు చేరడంతో ఆ ప్రాంతమంతా చెరువును తలపించింది. డోర్నకల్, గుండ్రాతిమడుగు, మహబూబాబాద్, తాళ్లపూసపల్లి స్టేషన్‌లలో రైళ్లు గంటలతరబడి నిలిపివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రయాణికులకు పోలీసులు నీళ్ల సీసాలు, బిస్కెట్ ప్యాకెట్లు, పులిహోర పొట్లాలు అందజేశారు. మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో ఆగిన కృష్ణ ఎక్స్‌ప్రెస్, గుండ్రాతిమడుగు స్టేషన్‌లో నిలిచిన కోణార్క్ ఎక్స్‌ప్రెస్ సాయంత్రం మళ్లీ వెనక్కి మళ్లించారు. ముఖ్యమైన 25 స్టేషన్లలో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేశారు. అవసరమైతే తప్ప రైలు ప్రయాణాలను రద్దు చేసుకోవాలని ద.మ రైల్వే అధికారులు సూచించారు.

గురుకుల విద్యార్థులకు ఎంత కష్టమో!

నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం కొమ్మేపల్లి ఎస్టీ గురుకుల పాఠశాల జల దిగ్బంధంలో చిక్కుకుంది. కొమ్మేపల్లి గురుకుల పాఠశాల లోతట్టు ప్రాంతం, పొలాల మధ్యన ఉండటంతో పాఠశాల ఆవరణలోకి భారీగా వర్షపు నీరు వచ్చి చేరింది. విద్యార్థులను వరద నీరు మధ్యలో నుంచే తాడు సాయంతో దాటించి, ప్రత్యేక వాహనాల్లో పెంచికల్‌పహడ్ బీసీ, మైనారిటీ గురుకుల పాఠశాలలోకి తరలించారు.

రాష్ట్రంలో 250 మిల్లీమీటర్ల వర్షపాతం దాటిన ప్రాంతాలు

జిల్లా	ప్రాంతం	వర్షపాతం
హనుమకొండ	భీమదేవరపల్లె	41.2
వరంగల్	కల్లెడ	38.2
వరంగల్	వరంగల్ ఉర్సు	33.6
వరంగల్	రెడ్లవాడ	33.3
హనుమకొండ	ధర్మసాగర్	32.3
వరంగల్	కాపులకనపర్తి	32.2
వరంగల్	వర్ధన్నపేట్	30.2
వరంగల్	సంగెం	29.7
సిద్దిపేట్	హుస్నాబాద్	29.4
జనగాం	గూడూరు	27.3
వరంగల్	పైడిపల్లి (ఏఆర్ఎస్)	26.4
హనుమకొండ	చింతగట్టు	26.3
సిద్దిపేట్	కట్కూర్	26.0
జనగాం	జఫర్‌గఢ్	25.5
వరంగల్	గొర్రెకుంట	25.4
జనగాం	మల్కాపూర్	25.2


నాగర్‌కర్నూలు జిల్లా లింగాల మండలం అవుసలి కుంట వాగులో కొట్టుకుపోయిన కారు


జనగామ-హుస్నాబాద్ మార్గంలో గానుగుపహాడ్ వద్ద తెగిన తాత్కాలిక బ్రిడ్జి

విమాన సర్వీసుల రద్దు

భారీ వర్షాల కారణంగా శంషాబాద్ విమానాశ్రయం నుంచి విజయవాడ, వైజాగ్ వెళ్లాల్సిన విమాన సర్వీసులను రద్దు చేశారు. శంషాబాద్ నుంచి ఉదయం 7గంటలకు బయల్దేరిన ఐఎక్స్ 2885 ఎయిరిండియా విమానం వైజాగ్‌లో వాతావరణం అనుకూలించకపోవడంతో శంషాబాద్‌కు తిరిగి హైదరాబాద్‌కు వచ్చింది. మళ్లీ వెళ్లడానికి వాతావరణం అనుకూలించకపోవడంతో విమానాన్ని రద్దు చేసినట్లు ఎయిర్‌లైన్స్ అధికారులు తెలిపారు. విజయవాడ వెళ్లాల్సిన 6ఈ7401 విమానం శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరేందుకు సిద్ధమైనా.. విజయవాడలో వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో విమానాన్ని రద్దు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. మరిన్ని కొన్ని విమాన సర్వీసులు ఆలస్యంగా నడిచాయి. ఫలితంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు.


శ్రీశైలం డ్యాంసైట్ వద్ద రోడ్డుపై విరిగిపడిన కొండచరియలు తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

'శ్రీశైలం' రాకపోకలకు అంతరాయం

శ్రీశైలం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా శ్రీశైలం నుంచి హైదరాబాద్ వెళ్లే రహదారిపై లింగాలగట్టు వద్ద బుధవారం తెల్లవారుజామున కొండచరియలు విరిగి రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. దీనితో శ్రీశైలం నుంచి తెలంగాణ వైపు బయల్దేరిన వాహనాలన్నీ చిక్కుకుపోయాయి. పోలీసులు గంటల తరబడి కష్టపడి భారీ రాళ్లు, మట్టిని తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. మరోవైపు భారీ వర్షాల కారణంగా శ్రీశైలం నుంచి తెలంగాణ, ఏపీ వైపు వెళ్లేందుకు రోడ్ క్లియరెన్స్ లేకపోవడంతో అటవీ అధికారులు బుధవారం ఉదయం నుంచి రాకపోకలను నిలిపివేశారు. అప్పటికే వసతి గదులు ఖాళీ చేసి తిరుగుముఖం పట్టిన యాత్రికుల వాహనాలు టోల్‌గేట్ వద్ద బారులు దీరాయి. బస్సులు నడవకపోవడంతో వందలాది మంది యాత్రికులు బస్టాండ్‌లోనే ఉండిపోయారు. దేవస్థానం ఈవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనాల్లో అల్పాహారం, మంచినీరు, పాలు, బిస్కెట్లను బస్టాండ్, ఔటర్ రింగ్‌రోడ్డు, శిఖరం ఫారెస్ట్ చెక్‌పోస్టు వద్దకు తరలించి యాత్రికులకు అందించారు. కొన్ని గంటల తర్వాత అధికారులు వాహనాలను అనుమతించారు. ఇక ఫారెస్ట్ చెక్‌పోస్టు వద్ద కొండలపై నుంచి రాళ్లు జారిపడ్డాయి. రోడ్డుకు ఆనుకుని ఉన్న ఇళ్లు, మూడు షాపులు ధ్వంసమయ్యాయి. పోలీసులు పరిశీలించి రాళ్లను తొలగించేలా చర్యలు తీసుకున్నారు సున్నిపెంట పూర్ణానంద ఆశ్రమం ప్రాంతంలోనూ పలు కాలనీలను వాన నీరు ముంచెత్తింది. ఆరో వార్డులోని ఒక రేషన్ షాపులో సుమారు 72 క్వింటాళ్ల బియ్యం తడిసిపోయింది.


నెల్లికుదురు-మహబూబాబాద్ మార్గంలో అడ్డంగా పడిన చెట్టును తొలగిస్తున్న 108 సిబ్బంది

గర్భిణిని వాగు దాటించిన 108 సిబ్బంది

నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం మడమడక గ్రామానికి చెందిన దేవి అనే గర్భిణికి పురిటి నొప్పులు రావటంతో కుటుంబసభ్యులు 108కు సమాచారం అందించారు. 108 సిబ్బంది మడమడక నుంచి దేవరకొండకు బయలుదేరారు. మైనంపల్లి వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటతో రాకపోకలు నిలిచిపోయాయి. 108 సిబ్బంది రవినాయక్, సైదులు గర్భిణిని స్ట్రెచర్‌పై వాగు దాటించి రోడ్డుపైకి తీసుకువచ్చారు. ఆమెను అక్కడి నుంచి మరొక వాహనంలో దేవరకొండ ప్రాంతీయ ఆస్పత్రికి తీసుకువెళ్లారు.

చెట్టుపడి వ్యక్తి మృతి

సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం చందుపట్ల శివారులో ద్విచక్ర వాహనంపై వెళుతున్న మెడికల్ దుకాణం యజమాని లక్ష్మీనారాయణ(45)పై చెట్టు విరిగి పడటంతో అక్కడికక్కడే మృతిచెందారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం సత్యతండాలో ఇంట్లోకి చేరిన వాన నీటిలో జారిపడి జువ్వల రోషమ్మ (70) అనే వృద్ధురాలు మృతి చెందారు. భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట మండలం మారుతినగర్‌కు చెందిన మురళీకృష్ణ (30) వాగు ఉధృతికి వ్యాన్‌తో సహా కొట్టుకుపోయారు. వికారాబాద్ జిల్లా తాండూరు మండలం వీరశెట్టిపల్లి శివారులోని వాగులో నర్సయ్య అనే వ్యక్తి జారిపడి కొట్టుకుపోగా.. స్థానికులు తాళ్ల సాయంతో బయటకు తీశారు. నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు, పెద్దకొత్తపల్లి మండలాల్లో దాదాపు 70 గొర్రెలు మృతి చెందాయి.


ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలంలోని ఏన్కూరువాగులో కొట్టుకుపోతున్న వ్యాను

బలహీనపడిన మొంథా

తెలంగాణ మీదుగా ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లో ప్రవేశం .. కోస్తాలో కొనసాగిన వర్షాలు

- అత్యధికంగా ఒంగోలులో 25 సెం.మీ. వాన
- నేడూ దక్షిణ, ఉత్తర కోస్తాకు వర్ష సూచన
- ఓడరేవుల్లో మూడో నం. ప్రమాద హెచ్చరిక
- నేడు తెలంగాణలోనూ భారీ వర్షాలు

విశాఖపట్నం/అమరావతి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కోస్తాంధ్రను వణికించిన మొంథా తీవ్ర తుఫాన్ మంగళవారం రాత్రి తీరం దాటిన తరువాత ఉత్తర వాయవ్యంగా పయనించింది. గంటకు 15 కి.మీ. వేగంతో ప్రయాణిస్తూ బుధవారం తెల్లవారుజామున తుఫాన్‌గా, ఉదయానికి తీవ్ర వాయుగుండంగా బలహీనపడి తెలంగాణ మీదుగా దక్షిణ ఒడిశా, దక్షిణ ఛత్తీస్‌గఢ్‌లోకి ప్రవేశించింది. మధ్యాహ్నానికి భద్రాచలానికి 20కి.మీ. తూర్పుగా, ఒడిశాలోని మల్కన్‌గిరికి 110 కి.మీ. నైరుతిగా, ఛత్తీస్‌గఢ్‌లోని జగదల్‌పూర్‌కు 180 కి.మీ. దక్షిణ నైరుతిగా కేంద్రీకృతమై ఉంది. ఇది ఉత్తర వాయవ్యంగా పయనించి రాత్రికి మరింత బలహీనపడి వాయుగుండంగా మారనుంది. తీవ్ర తుఫాన్ బలహీనపడి పొరుగు రాష్ట్రాల వైపు పయనించినా బంగాళాఖాతం నుంచి తేమగాలులు కోస్తాంధ్ర వైపుగా వస్తున్నాయి. దీంతో బుధవారం తెల్లవారుజాము నుంచి అనేకచోట్ల ముసురు వాతావరణం నెలకొంది. అనేకచోట్ల తేలిక పాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. తీరానికి ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో బలమైన గాలులు వీచాయి. మంగళవారం ఉదయం 8నుంచి బుధవారం ఉదయం 8గంటల వరకు ఒంగోలులో 25, చీమకుర్తిలో 24, కందుకూరు, కావలి, పొదిలి, సింగరాయకొండ, పర్చూరుల్లో 22, దర్శి చినగంజాం, చిలకపాడుల్లో 21 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. గురువారం దక్షిణ కోస్తాలో అనేకచోట్ల, ఉత్తర కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు, ఉత్తర కోస్తాలో అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. సముద్రం అల్లకల్లోలంగా మారడంతో మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించింది. గురువారం శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, విశాఖపట్నం, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో మోస్తరు వర్షాలు, మిగతా జిల్లాల్లో తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. తీవ్ర తుఫాన్ తీరం దాటడంతో బుధవారం ఓడరేవుల్లో మూడో నంబరు ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. గురువారం ఉదయం ఈ హెచ్చరికలను ఉపసంహరిస్తామని వాతావరణ శాఖ పేర్కొంది. ఇదిలాఉండగా, తుఫాను ప్రభావంతో గురువారం తెలంగాణలోని ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొన్నిచోట్ల, ఆదిలాబాద్, కొమరం భీం, ఆసిఫాబాద్, మంచిర్యాల, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు, మిగిలిన జిల్లాల్లో ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.


పశ్చిమగోదావరి జిల్లా చినలంక నల్లిక్రీక్ వద్ద పడ్డ గండి


బాపట్ల జిల్లా పర్చూరులో వరద నీటిలో చిక్కుకున్న 25 మందిని రక్షిస్తున్న దృశ్యం

మొంథాతో జాగ్రత్త!

అధికారులు అప్రమత్తంగా ఉండాలి.. రైతాంగం నష్టపోకుండా చూడాలి

- అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు
- జనజీవనానికి ఆటంకం లేకుండా చూడండి
- విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి



హైదరాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో రైతులు నష్టపోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వరికోతల సమయమైనందున.. పలుచోట్ల రైతులు ధాన్యం ఆరబోశారని, వారికి నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాల్లో తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. రాష్ట్రంలో తుఫాన్ తీవ్రతపై బుధవారం సీఎం ఆరా తీశారు. హైదరాబాద్ సహా ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్లగొండ జిల్లాల్లో తుఫాన్ తీవ్రత అధికంగా ఉందని, అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు సమన్వయం చేసుకోవాలని, కలెక్టర్లు ఆయా బృందాలకు తగిన మార్గదర్శకత్వం వహించాలని అన్నారు. వాగులు, వంకలు పొంగే ప్రమాదం ఉన్నందున లోతట్టు ప్రాంతాల్లో నివాసముండే కుటుంబాలను సహాయ శిబిరాలకు తరలించాలన్నారు. నీటిపారుదల శాఖ అధికారులు జలాశయాలు, చెరువులు, కుంటల్లో నీటి మట్టాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ కలెక్టర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం..

తుఫాన్ ప్రభావంతో వర్షపునీరు నిల్వ ఉండి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున పురపాలక, పంచాయతీరాజ్ శాఖ అధికారులు పారిశుధ్య పనులు చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖ అత్యవసర మందులను అందుబాటులో ఉంచుకోవాలని, అవసరమైన చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రాణనష్టం, ఆస్తినష్టం, పశు సంపద కోల్పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్ నగరంలో ప్రజల నుంచి వచ్చే వినతులకు జీహెచ్ఎంసీ, హైడ్రా, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ సిబ్బంది తక్షణమే స్పందించాలన్నారు. కాగా, రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున జనజీవనానికి ఆటంకాలు లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలని రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కామారెడ్డి, సిద్దిపేట, ఉమ్మడి వరంగల్, యాదాద్రి భువనగిరి, మెదక్, మేడ్చల్, పెద్దపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. మొంథా తుఫాన్ నేపథ్యంలో బుధవారం విపత్తుల నిర్వహణ శాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. భారీ వర్షాల ప్రభావిత జిల్లాల్లోని పరిస్థితిపై ఆరా తీశారు. లోతట్టు ప్రాంతాల్లో చేపట్టాల్సిన చర్యలపై ఆదేశాలు జారీ చేశారు.

నేడు ముంబైకి సీఎం రేవంత్

సీఎం రేవంత్ గురువారం ముంబై వెళ్తున్నారు. కేంద్ర మాజీ మంత్రి సుశీల్ కుమార్ షిండే కుటుంబంలో జరిగే వివాహ వేడుకకు హాజరుకానున్నారు. ఈ కార్యక్రమానికి సీఎంతోపాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఒకరిద్దరు మంత్రులు కూడా వెళ్లనున్నట్టు సమాచారం. రాష్ట్రంలో నెలకొన్న భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో జిల్లాల వారీగా చేపట్టాల్సిన చర్యలపై సీఎం అన్ని జిల్లాల కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. పంట నష్టం, ఆస్తి నష్టం, దెబ్బతిన్న రహదారుల అంచనాలు రూపొందించడం, తక్షణ సహాయక చర్యలపై సీఎం కలెక్టర్లతో చర్చించనున్నారు.

బీఆర్ఎస్ గెలిస్తే మూడేళ్లు ఆగాల్సిన అవసరం రాకపోవచ్చు

- జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపిస్తే ఏమైనా జరగొచ్చు
- రాష్ట్రంలో ఎటువంటి మార్పులైనా సంభవించవచ్చు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలు

హైదరాబాద్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ గెలిస్తే మళ్లీ మూడేళ్ల వరకు ప్రజలు వేచి చూడాల్సిన అవసరం రాకపోవచ్చని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పారు. బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపిస్తే రాష్ట్రంలో ఏమైనా జరగొచ్చని, ఎటువంటి మార్పులైనా సంభవిస్తాయన్నారు. బుధవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మున్నూరుకాపు సంఘం ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ నవంబర్ 11న జరిగే ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని, భవిష్యత్తులో కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. 4కోట్లమంది రాష్ట్ర ప్రజలు 4లక్షలమంది ఓటర్ల వైపు చూస్తున్నారని, జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్‌కు ఓటేస్తే కాంగ్రెస్‌కు బుద్ధి వస్తుందన్నారు. కాంగ్రెస్‌కు ఓటేయాలనే ఉత్సాహం ఎవ్వరిలోనూ కనిపించడం లేదని, అందుకే కాంగ్రెస్ కొత్తవేషాలు వేస్తోందని, మంత్రులు గల్లీ లీడర్లలాగా తిరుగుతున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. దొంగఓట్లతో అప్రమత్తంగా ఉండాలని, కాంగ్రెస్ 12 నుంచి 13వేల దొంగఓట్లు సృష్టించిందని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ మోసపూరిత మాటలు నమ్మి రెండేళ్ల కిందట ప్రజలు మోసపోయారని కేటీఆర్ చెప్పారు. కాంగ్రెస్ డబ్బులిస్తే తీసుకోవాలని, ఓటుమాత్రం బీఆర్ఎస్ అభ్యర్థికే వేయాలని ఆయన ఓటర్లకు సూచించారు. ఇందిరమ్మ రాజ్యంలో ఒక్క ఇల్లు కూడా కట్టకపోగా, వేలాది ఇళ్లను నేలమట్టం చేశారని, పెద్దల ఇండ్లజోలికి వెళ్లని హైడ్రా పేదల ఇళ్లు కనిపిస్తే కూల్చివేస్తోందన్నారు. 42శాతం రిజర్వేషన్లు ఇస్తామంటూ బీసీలను కాంగ్రెస్ సర్కార్ మోసం చేస్తోందని, పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ చేస్తేనే ఇది జరుగుతుందని తాము ముందే చెప్పినా రాష్ట్ర ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని కేటీఆర్ చెప్పారు.

ఉప ఎన్నికపై ఉన్న శ్రద్ధ రైతులపై లేదు: సంజయ్

హైదరాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వానికి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై ఉన్న శ్రద్ధ రైతులను, ప్రజలను ఆదుకోవడంలో లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ విమర్శించారు. ఈ ఎన్నికకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పెడుతున్న ఖర్చుతో రైతులను ఆదుకోవచ్చని ఆయన వ్యాఖ్యానించారు. భారీ వర్షాలు వస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించినా నష్ట నివారణ చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ధాన్యం కొట్టుకుపోయి రైతులు అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వకుండా ప్రభుత్వం ఇబ్బంది పెడుతోందని మండిపడ్డారు.

50 లక్షలకు పైగా ఉద్యోగులకు లబ్ధి

- 8వ వేతన సంఘం విధివిధానాలను కేంద్రం ఆమోదించడం పట్ల కిషన్‌రెడ్డి హర్షం

న్యూఢిల్లీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన 8వ వేతన సంఘం విధివిధానాలను కేంద్ర కేబినెట్ ఆమోదించడం పట్ల కేంద్ర బొగ్గు, గనుల మంత్రి కిషన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు చేస్తున్న కృషికి సరైన గుర్తింపును కల్పిస్తూ.. వారి జీవన ప్రమాణాలను మరింతగా మెరుగుపరిచే దిశగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ప్రభుత్వ ఉద్యోగులకు, దేశ ఆర్థిక వ్యవస్థకు పెద్ద ఊరటనిస్తుందని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర నిర్ణయంతో 50 లక్షలకు పైగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, 65 లక్షలకు పైగా పెన్షనర్లకు లబ్ధి చేకూరుతుందని చెప్పారు. వేతన సవరణ ద్వారా ఉద్యోగుల్లో మరింత ఉత్సాహం పెరగడంతో పాటు కేంద్ర ప్రభుత్వ సంస్థల పనితీరు మెరుగవుతుందని అన్నారు.

కాంగ్రెస్‌కు ఓటేస్తే ఎంఐఎంకు వేసినట్లే: రాంచందర్

హైదరాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో పోటీ ఎంఐఎం-బీజేపీల మధ్యే ఉంటుందని, కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే.. ఎంఐఎంకు వేసినట్లేనని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. బీఆర్ఎస్‌ను రాష్ట్ర ప్రజలు ఇప్పటికే మర్చిపోయారని పేర్కొన్నారు.'100 రోజుల్లో 6 గ్యారంటీలు' అని అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ఇప్పుడు చేతులెత్తేసిందని మండిపడ్డారు. ఆ పార్టీకి తగిన అభ్యర్థులు లేరని, గతంలో ఎంఐఎం నుంచి పోటీ చేసిన అభ్యర్థిని ఇప్పుడు కాంగ్రెస్ బరిలో దించిందన్నారు. రాష్ట్రంలో బీజేపీని బలోపేతం చేయాలని, ప్రతి ఒక్కరూ సమన్వయంతో పార్టీని ముందుకు తీసుకుపోవాల్సిన అవసరముందని చెప్పారు. ఉప ఎన్నికలో బీజేపీకి అనుకూల వాతావరణం ఉందని, తమ పార్టీనే గెలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

కాంగ్రెస్‌తోనే జూబ్లీహిల్స్ అభివృద్ధి: పొన్నం

హైదరాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇటు రాష్ట్రంలో, అటు కేంద్రంలో అధికారంలో లేని బీఆర్ఎస్ పార్టీకి ఓటేస్తే ఉపయోగం లేదని, జూబ్లీహిల్స్ అభివృద్ధి అధికార కాంగ్రెస్‌తోనే సాధ్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఎప్పుడైనా ప్రయాణం చేసే బండి ఎక్కాలి కానీ.. మూలన పడ్డ కారును ఎక్కితే ముందుకు పోలేరని వ్యాఖ్యానించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ప్రజలు సంక్షేమం, అభివృద్ధికి పట్టం కడుతున్నారని, కాంగ్రెస్‌ను గెలిపిస్తున్నారని ధీమా వ్యక్తం చేశారు. కేటీఆర్ ఆటోలో ప్రయాణాలు చేస్తూ రాజకీయ డ్రామాలు చేస్తున్నారని, వాస్తవానికి ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చినవి తప్ప నగరంలో ఒక్క ఆటోకు కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం పర్మిట్ ఇవ్వలేదన్నారు. తాము 20 వేల ఎలక్ట్రిక్ ఆటోలకు అనుమతులు ఇచ్చామని ఆయన చెప్పారు. పదేళ్లలో జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఏం చేశారని ఆయన ప్రశ్నించారు.

స్టార్ క్యాంపెయినర్‌గా సీఎం రేవంత్‌ను తొలగించండి

- కేంద్ర బలగాలను రప్పించండి
- సీఈవో సుదర్శన్‌రెడ్డికి బీఆర్ఎస్ నేతల వినతి

హైదరాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో అధికార కాంగ్రెస్ పార్టీ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని.. సినీ కార్మికులకు హామీలిచ్చి.. సీఎం కోడ్ ఉల్లంఘనకు పాల్పడ్డారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా పట్టించుకోని సీఎం రేవంత్‌రెడ్డిని స్టార్ క్యాంపెయినర్‌గా తొలగించాలని ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సీఈవో సుదర్శన్‌రెడ్డికి ఆ పార్టీ నేతలు గంగుల కమలాకర్, వద్దిరాజు రవిచంద్ర, పాడి కౌశిక్‌రెడ్డి, పట్నం నరేందర్‌రెడ్డి బుధవారం ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సినీ కార్మికులకు సీఎం ఇచ్చిన హామీలను ఎన్నికల హామీలుగా గుర్తించి.. సుమోటోగా చర్యలు చేపట్టాలని, రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్ స్టార్ క్యాంపెనయిర్‌గా తొలగించాలని కోరామన్నారు. కాంగ్రెస్‌కు అనుకూలంగా పనిచేసే రాష్ట్ర పోలీసులను నమ్మే పరిస్థితి లేదని.. పారదర్శకంగా ఉప ఎన్నిక జరిపేందుకు కేంద్ర బలగాలను రప్పించాలని కోరామని చెప్పారు.

జూబ్లీహిల్స్.. భిన్నంగా ఓటర్ పల్స్!

ఒక్కో డివిజన్‌లో ఒక్కో పార్టీకి ఆదరణ.. ఎన్నికలను బట్టి మారుతున్న ఆధిపత్యం

- అసెంబ్లీ ఎన్నికల్లో ఓ పార్టీ వైపు..
- పార్లమెంట్‌లో మరో పార్టీ వైపు మొగ్గు
- బస్తీలు, కాలనీలు, మైనారిటీలతో
- భిన్న వర్గాలు.. విభిన్న అభిప్రాయాలు
- పెద్ద సంఖ్యలో ఉండే సినీ కార్మికులు
- ఉప ఎన్నికలో ఎవరి మొగ్గు ఏ పార్టీకో?

బంజారాహిల్స్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రస్తుతం టాక్ ఆఫ్ ది స్టేట్‌గా మారింది. ఇక్కడి ఫలితాలు భవిష్యత్ రాజకీయ పరిణామాలకు సంకేతమని ప్రధాన పార్టీలు భావిస్తున్నాయి. అందుకే ఈ ఎన్నికలో గెలుపు కోసం సర్వశక్తులూ ఒడ్డుతున్నాయి. ఇప్పటికే పార్టీ నేతలు, క్యాడర్‌ను భారీగా మోహరించాయి. బస్తీ, కాలనీ సంఘాలతోపాటు.. కుల సంఘాలతోనూ సమావేశాలు నిర్వహిస్తున్నారు. జూబ్లీహిల్స్ అనగానే అందరికీ గుర్తుకొచ్చేది సంపన్నులు ఉండే ప్రాంతం. కానీ, నియోజకవర్గ జనాభాలో అధికంగా ఉన్నది పేద, మధ్య తరగతి వర్గాలే. జూబ్లీహిల్స్ ప్రాంతం ఆ నియోజకవర్గం పరిధిలోనే లేకపోవడం మరో విశేషం. ఈ క్రమంలో అసలు జూబ్లీహిల్స్ నియోజకవర్గ నైసర్గిక స్వరూపం, అక్కడ ఏ వర్గం ఓటర్లు ఎంత మంది ఉంటారు? గత ఎన్నికల్లో ఎవరు ఎటువైపు మొగ్గు చూపారు? గత, ప్రస్తుత పరిణామాల్లో వచ్చిన మార్పు ఏంటి? ఇప్పుడు ఇక్కడి ఓటర్ల ఆదరణ ఎవరికి ఉంటుంది? అన్నది ఆసక్తికరంగా మారింది. నియోజకవర్గంలో ఏడు డివిజన్లు షేక్‌పేట, ఎర్రగడ్డ, బోరబండ, రహ్మత్‌నగర్, వెంగళరావునగర్, యూసుఫ్‌గూడ, సోమాజిగూడ ఉన్నాయి. అన్ని డివిజన్లలోనూ భిన్న వర్గాల ఓటర్లు ఉన్నారు. ఎన్నికల్లో తీర్పునూ భిన్నంగా ఇస్తారు. ఒక్కో డివిజన్‌లో ఒక్కో పార్టీకి ఆదరణ ఎక్కువగా ఉంటుందని గత అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. ఏ డివిజన్‌లో ఏ పార్టీకి గతంలో ఆదరణ దక్కిందన్న దానిపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

కాలనీలు, బస్తీల కలయిక..

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ఏడు డివిజన్లలో షేక్‌పేట ఒకటి. సుమారు 55 వేల మంది ఓటర్లు ఉన్న ఈ డివిజన్‌లో మైనారిటీలు అధికంగా ఉంటారు. కాలనీలు, బస్తీల కలయికతో పాటు గేటెడ్ కమ్యూనిటీలూ ఉన్నాయి. దిగువ మధ్య తరగతి వర్గాలూ ఇక్కడ ఉంటారు. 2018లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపిన ఓటర్లు.. 2020 గ్రేటర్ ఎన్నికల్లో ఎంఐఎం వైపు నిలిచారు. 2023 అసెంబ్లీ ఎన్నికలు, 2024 పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ స్వల్ప ఆధిక్యం సాధించింది. ఈసారి ఎంఐఎం మద్దతు కూడా ఉన్నందున ఉప ఎన్నికలో తమదే పైచేయి అని కాంగ్రెస్ అంటోంది. అయితే బీఆర్ఎస్ హయాంలో సంక్షేమ పథకాల లబ్ధిదారులు షేక్‌పేటలోనే అధికంగా ఉన్నారని, వారంతా దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌పై ఉన్న సానుభూతితో తమకే ఓటు వేస్తారని బీఆర్ఎస్ చెబుతోంది. కాగా, బీసీ, ఓసీ ఓటర్లు తమ వైపు ఉన్నారని బీజేపీ అంటోంది.



నియోజకవర్గంలో అత్యంత కీలకమైన డివిజన్ బోరబండ. మైనారిటీలు, పేదలు, దిగువ మధ్యతరగతి ప్రజలు అధికంగా ఉండే ఈ డివిజన్‌లో పట్టు సాధించడం అన్ని పార్టీలకూ కత్తి మీద సాము లాంటిదే. ఇక్కడ 62 వేల పైచిలుకు ఓటర్లు ఉన్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికలు, 2020 జీహెచ్ఎంసీ ఎన్నికలతోపాటు 2023 అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇక్కడ బీఆర్ఎస్ పైచేయి సాధించింది. అయితే 2024 పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అధిక ఓట్లు వచ్చాయి.

రహ్మత్‌నగర్, ఎర్రగడ్డకు ప్రత్యేక స్థానం..

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో అతిపెద్ద డివిజన్‌గా రహ్మత్‌నగర్‌కు ప్రత్యేక స్థానం ఉంది. సుమారు 65 వేల మంది ఓటర్లున్న ఈ డివిజన్‌లో.. మైనారిటీలు 60 శాతం ఉంటారు. వీరితోపాటు పేదలు, బీసీలు ఉండే బస్తీలే అధికం. దివంగత నేత పి.జనార్దన్‌రెడ్డి తన తల్లిదండ్రుల పేరిట స్థాపించిన ఎస్పీఆర్ హిల్స్‌లో సుమారు 23 వేల మంది ఓటర్లు ఉంటారు. కార్మికనగర్‌లో 21 వేల మంది దాకా ఉంటారు. జవహర్‌నగర్, ఓంనగర్, నేతాజి సుభాష్ చంద్రబోస్ నగర్ వంటి బస్తీల ఓటర్లు కూడా కీలకం. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ వైపు మొగ్గు చూపించిన ఓటర్లు.. 2020 గ్రేటర్, 2023 అసెంబ్లీలో బీఆర్ఎస్ వైపు నిలిచారు. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు భారీ మెజారిటీ అందించారు. ఈసారి ఇరు పార్టీలకు చెందిన అగ్రనేతలంతా ఇక్కడే మోహరించారు. ఇక ఎర్రగడ్డ డివిజన్‌లో బస్తీలతో పాటు కొన్ని కాలనీలు ఉన్నప్పటికీ.. ఇక్కడ మైనారిటీలే కీలకం. అయితే జనప్రియ, కల్పతరు, బ్రిగేడియర్ వంటి బహుళ అంతస్తుల అపార్ట్‌మెంట్‌లు కూడా ఈ డివిజన్ పరిధిలోనే ఉన్నాయి. ఆయా అపార్ట్‌మెంట్‌లలో సుమారు 12 వేలకు పైచిలుకు ఓటర్లు ఉన్నారు. సైలెంట్ ఓటర్లంతా ఇక్కడే ఉంటుండటంతో డివిజన్ ఏ పార్టీ వైపు మొగ్గు చూపిస్తుందన్నది చెప్పడం కష్టమే. 2018లో కాంగ్రెస్‌కు, 2020 గ్రేటర్‌లో ఎంఐఎం, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్, 2024 పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇక్కడ ఆధిక్యం సాధించాయి. అయితే బీజేపీకి కూడా అత్యధికంగా ఇక్కడి నుంచే ఓట్లు పోలవుతాయి.

2023 అసెంబ్లీ ఎన్నికల్లో డివిజన్ల వారీగా పార్టీలకు వచ్చిన ఓట్లు..

డివిజన్	బీఆర్ఎస్	కాంగ్రెస్	బీజేపీ
షేక్‌పేట	9870	11175	4137
ఎర్రగడ్డ	12961	9536	3886
బోరబండ	12945	8230	3684
రహ్మత్‌నగర్	17902	12139	3752
వెంగళరావునగర్	10473	9329	3950
యూసుఫ్‌గూడ	9620	8357	3524
సోమాజిగూడ	6547	5069	2808

విద్యావంతులు, సినీ కార్మికులు..

విద్యావంతులు ఎక్కువగా నివసించే ప్రాంతంగా వెంగళరావు నగర్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. వెంగళరావునగర్, సిద్ధార్థనగర్ కాలనీలు అన్నిపార్టీలకు కీలకం. జవహర్‌నగర్ లాంటి బస్తీల్లో కూడా కీలకమైన ఓటర్లు ఉంటారు. 2018 అసెంబ్లీ ఎన్నికలతోపాటు 2020 గ్రేటర్‌లో, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నిలబడ్డ ఓటర్లు 2024 పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం బీజేపీ పక్షాన నిలిచారు. ఒక రకంగా చెప్పాలంటే మూడు పార్టీలు ఇక్కడ బలంగా ఉన్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇక యూసుఫ్‌గూడ డివిజన్ సినీ పరిశ్రమలో బాగా పాపులర్. సినీ కార్మికులు ఎక్కువగా నివసించే కృష్ణానగర్ ఈ డివిజన్‌లోనే ఉంటుంది. మధురానగర్‌తోపాటు కృష్ణానగర్, వెంకటగిరి, యాదగిరినగర్ బస్తీల సమాహారంగా యూసుఫ్‌గూడ విస్తరించింది. సుమారు 43 వేల మంది ఓటర్లు ఉన్న ఈ డివిజన్‌లో మున్నూరుకాపులు, యాదవులు, గౌడలు అధికంగా ఉంటారు. ఇక్కడి ఓటర్లు 2018 అసెంబ్లీ, 2020 గ్రేటర్, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ వైపు నిలిచారు. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం బీజేపీకి మెజారిటీ కట్టబెట్టారు. ఇక ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ అసెంబ్లీ సెగ్మెంట్‌ల ఉమ్మడి డివిజన్ సోమాజిగూడ. శ్రీనగర్‌కాలనీ, నవోదయకాలనీ, శాలివాహననగర్, ఎల్లారెడ్డిగూడ, అంబేద్కర్‌నగర్, వడ్డెర బస్తీలు ఉన్న ఈ డివిజన్‌లో కాలనీ, బస్తీ ఓటర్లు కీలకం. మైనారిటీలు కూడా అధికంగా ఉండటంతో ఏ పార్టీకీ సరైన మెజారిటీ దక్కిన సందర్భాలు లేవు. 2018లో అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, 2020 గ్రేటర్, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు స్వల్ప మెజారిటీ లభించింది. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి మెజారిటీ దక్కింది.



ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- రహ్మత్‌నగర్‌లో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారం

బోరబండ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రథమ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటికే 4 లక్షలకు పైగా ఇళ్లు మంజూరు చేశామని, వాటిలో 3 లక్షలకు పైగా ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని చెప్పారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా రహ్మత్ నగర్ డివిజన్ కార్మికనగర్‌లో మంత్రి పొంగులేటి బుధవారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణ ప్రాంతాల్లోని పేదలకు ప్రయోజనం కలిగేలా ఇందిరమ్మ ఇళ్ల నిబంధనలను సడలించినట్లు తెలిపారు. గత పదేళ్లుగా పేదల కోసం ఒక్క చిన్న ఇల్లు కూడా కట్టని కేసీఆర్.. కమీషన్లపై ఆశతో కాళేశ్వరం ప్రాజెక్టును కట్టారని ఆరోపించారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలో అర్హులైన పేదలందరికీ పట్టాలిచ్చి ఇండ్లు కట్టిస్తామని ప్రకటించారు. అంతేగాక గత ప్రభుత్వ హయాం నుంచి అసంపూర్తిగా ఉండిపోయిన డబుల్ బెడ్రూం ఇండ్లను పూర్తిచేసి పేదలకు ఇస్తామని మంత్రి పొంగులేటి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన 400 మందికి ప్రాతినిధ్యం వహిస్తున్న చేపల కృష్ణ, ఆనంద రావు, ఫిలిం ఫెడరేషన్ నాయకుడు బసాడ కృష్ణ, లక్ష్మి తదితరులకు కాంగ్రెస్ కండువాలు కప్పి మంత్రి పార్టీలోకి స్వాగతించారు. ఓవైపు వర్షం పడుతున్నా మంత్రి తన ప్రచారాన్ని కొనసాగించారు. భారీవర్షం కురుస్తున్నా లెక్క చేయకుండా పెద్దఎత్తున ప్రజలు తరలి వచ్చి నృత్యాలు, బాణాసంచాతో మంత్రి పొంగులేటికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బాలు నాయక్, బీర్ల ఐలయ్య, వేముల వీరేశం, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, కార్పొరేషన్ల చైర్మన్లు మల్‌రెడ్డి రాంరెడ్డి, ఒబేదుల్లా కొత్వాల్, పటేల్ రమేష్ రెడ్డి, జెరిపెటి జైపాల్, మందుముల పరమేశ్వర్ రెడ్డి, డివిజన్ కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రివర్గంలోకి అజారుద్దీన్

(మొదటి పేజీ తరువాయి)

సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులు పాల్గొంటారు. అజారుద్దీన్‌కు మైనార్టీ సంక్షేమంతోపాటుగా మరో శాఖను అప్పగించనున్నట్టు చెబుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అజారుద్దీన్ జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసి ఓడిపోయారు. ఆ ఎన్నికలో గెలిచిన ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో ఇక్కడ ఉప ఎన్నిక వచ్చింది. ఈ సీటు నుంచి గెలిస్తే మైనార్టీ కోటాలో మంత్రి పదవి దక్కే అవకాశం ఉండటంతో కాంగ్రెస్ టికెట్ కోసం అజారుద్దీన్ తీవ్రంగా ప్రయత్నించారు. సర్వేల నివేదికలు ఆయనకు అనుకూలంగా రాకపోవడంతో సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ అధిష్ఠానంతో చర్చలు జరిపి.. అజారుద్దీన్‌ను ఎమ్మెల్సీ చేసి, మంత్రివర్గంలోకి తీసుకోవాలని నిర్ణయించారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా టీజేఎస్ చీఫ్ కోదండరాం, అజారుద్దీన్ పేర్లను మంత్రివర్గంలో ఆమోదించి, గవర్నర్‌కు పంపారు. ఈ నియామకాలకు సంబంధించి సుప్రీంకోర్టు విచారణ నేపథ్యంలో ఆ ఫైలు గవర్నర్ వద్దే పెండింగ్‌లో ఉండిపోయింది. దీనితో అజారుద్దీన్‌కు మంత్రివర్గంలో స్థానం ఆలస్యమవుతూ వచ్చింది. ప్రస్తుతం ఉప ఎన్నిక జరుగుతున్న జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో సుమారు లక్ష మంది ముస్లిం ఓటర్లు ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఈ నియోజకవర్గంలోని మెజారిటీ ముస్లింలు కాంగ్రెస్‌కే మద్దతు పలికారు. కానీ రాష్ట్ర మంత్రివర్గంలో ఇప్పటివరకు మైనార్టీలకు చోటు లభించకపోవడంతో.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో వారి ఓట్లపై ప్రభావం చూపే ఆస్కారముందన్న భావన వ్యక్తమైంది. ఉప ఎన్నికలో మైనార్టీల ఓట్లు కీలకం కావడంతో అజారుద్దీన్‌ను కాస్త ముందుగానే మంత్రి మండలిలోకి తీసుకోవాలని అధిష్ఠానం అనుమతితో సీఎం రేవంత్ నిర్ణయించినట్టు తెలిసింది. ఈ మేరకు శుక్రవారం అజారుద్దీన్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆయన ఖైరతాబాద్ నియోజకవర్గ ఓటరు కావడంతో.. ప్రమాణ స్వీకారం కోసం ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. కాగా, నిబంధనల ప్రకారం ప్రస్తుతం మంత్రివర్గంలో మరో ముగ్గురికి చోటు కల్పించేందుకు అవకాశం ఉంది. అజారుద్దీన్ మంత్రి అవుతుండటంతో.. మిగతా రెండు పదవులను డిసెంబర్‌లో భర్తీ చేసే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

ఆరు నెలల్లో ఎమ్మెల్సీ అయితే చాలు!

చట్టసభల్లో దేనిలోనూ సభ్యత్వం లేకుండా నేరుగా మంత్రి అవుతున్న అజారుద్దీన్.. నిబంధనల ప్రకారం ఆరు నెలల్లోగా శాసనసభ లేదా మండలిలో సభ్యుడు కావాల్సి ఉంటుంది. ప్రభుత్వం అజారుద్దీన్ గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ నియమించాలని ఇప్పటికే ప్రతిపాదించింది. ఈ అంశంపై సుప్రీంకోర్టు తీర్పు సానుకూలంగా వస్తే ఆయన ఎమ్మెల్సీ అవుతారు. ఒకవేళ ఆరు నెలల్లోపు తుది తీర్పు రాకున్నా, ప్రతికూలంగా వచ్చినా.. అజారుద్దీన్‌కు చట్టసభ సభ్యత్వం కోసం ప్రభుత్వం ఇతర మార్గాలను అనుసరించాల్సి వస్తుంది.

సీఎంను కలిసిన మైనార్టీ సంఘాల నేతలు

వివిధ మైనార్టీ సంఘాల నేతలు బుధవారం సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. మైనార్టీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తున్నట్టు ప్రకటించారు. మైనార్టీ నేతలతో జరిగిన ఈ సమావేశంలో అజారుద్దీన్, మంత్రి వివేక్ వెంకటస్వామి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎంఐఎం ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో లబ్ధిదారులుగా లక్ష కుటుంబాలు!

- అభివృద్ధి, సంక్షేమమే అజెండా అంటున్న కాంగ్రెస్
- 200 యూనిట్ల ఉచిత విద్యుత్ 25,925 కుటుంబాలకు
- రూ.500 గ్యాస్ సిలిండర్ లబ్ధి కుటుంబాలు 19,658
- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో రూ.120 కోట్లు

హైదరాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో విజయం సాధించేది తామేనని అధికార కాంగ్రెస్ పార్టీ అంటోంది. నియోజకవర్గంలో తమ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే తమను గెలిపిస్తాయని చెబుతోంది. నియోజకవర్గంలో రాష్ట్ర పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న కుటుంబాలే దాదాపు లక్ష ఉన్నాయని పేర్కొంటోంది. నియోజకవర్గంలో మొత్తం 3.98 లక్షల మంది ఓటర్లుండగా.. అందులో లక్ష కుటుంబాలు ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో లబ్ధి పొందుతున్నాయని అంటోంది. ఆ పార్టీ నేతలు చెబుతున్న వివరాల ప్రకారం.. 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ పథకం 25,925 కుటుంబాలకు, రూ.500 గ్యాస్ సిలిండర్ సబ్సిడీ 19,658 కుటుంబాలకు అందుతున్నాయి. ఇక ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాలతో హైదరాబాద్‌లో ఇప్పటివరకు కోటిమందికి పైగా ప్రయాణించగా.. వారికి దాదాపు రూ.2,410కోట్లు ఆదా అయ్యాయి. అందులో జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని మహిళలకు రూ.120 కోట్లు ఆదా అయింది. మరోవైపు 14,197 కొత్త రేషన్‌కార్డులు ఇవ్వడం, ఉన్న రేషన్‌కార్డుల్లో 8123 మందిని అదనంగా చేర్చడంతో పాటు మొత్తం రేషన్ కార్డుదారులందరికీ ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం అందిస్తున్నారు. ఇందిరమ్మ క్యాంటీన్ల ద్వారా రూ.5కే అల్పాహారం అందించడం, ఇతర సంక్షేమ పథకాలన్నీ ఓటర్లు తమవైపు ఉండేలా చేస్తాయని కాంగ్రెస్ ధీమా వ్యక్తం చేస్తోంది.

భారీగా అభివృద్ధి పనులు..

నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు కూడా తమకు సానుకూలంగా ఉంటాయని కాంగ్రెస్ భావిస్తోంది. ప్రత్యేక అభివృద్ధి నిధులతో రూ.5.51 కోట్లతో నియోజకవర్గంలో రోడ్లు, మౌలిక వసతుల కల్పన పనులు నిర్మాణంలో ఉన్నాయని చెబుతోంది. జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు జంక్షన్, కేబీఆర్ ఎంట్రన్స్ జంక్షన్, రోడ్‌నెంబరు 45జంక్షన్, ఫిల్మ్‌నగర్, మహారాజా అగ్రసేన్, బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ జంక్షన్లలో ట్రాఫిక్ ఇబ్బంది అధిగమించేలా రూ.826 కోట్ల ఖర్చుతో ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌ల నిర్మాణానికి ప్రభుత్వం ఇప్పటికే పరిపాలనా అనుమతులు మంజూరు చేశామని అధికార పార్టీ చెబుతోంది. వీటితోపాటు కొత్తగా పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, 11కేవీ ఫీడర్లు, దాదాపు 13కిలోమీటర్ల మేర ఎల్‌టీ లైన్ ఆధునికీకరణ పనులకు రూ.11కోట్లు ఖర్చు చేస్తున్నామని, ఈ నియోజకవర్గంలో రూ.162కోట్లతో అండర్‌గ్రౌండ్ విద్యుత్ లైను వేయాలని ప్రతిపాదనలను సిద్ధం చేశామని తెలిపింది. ఈ అభివృద్ధి, సంక్షేమ పథకాలు తమ విజయానికి మార్గం సుగమం చేస్తాయని బుధవారం ఒక ప్రకటనలో కాంగ్రెస్ పేర్కొంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.